# ఉపదేశత్రయము

(మేలుకొలుపు, హనుమదాచార్యోపదేశము, సీతోపదేశము)


రచన

**వావిలికొలను సుబ్బారావు**



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

# UPADESATRAYAMU

**(Melukolupu, Hanumadacharyopadesamu, Seethopadesamu)**

*by*
**Vavilikolanu Subbarao**

***Editor***
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1378

© All Rights Reserved


*First Edition* : 2024

*Copies :* 200

*Published by*
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

***DTP***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.





# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచారంలో భాగంగా ధార్మిక సాహిత్యాన్ని ముద్రించడం జరుగుతోంది. విస్తృతంగా భక్తులకు అందిస్తున్నది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలతోపాటు భక్తిప్రబోధాత్మక అనేక రచనలు ప్రధానంగా ఆంధ్రం, సంస్కృతం, ఆంగ్లం, తమిళం, కన్నడం, హిందీవంటి భాషల్లో ధార్మిక సాహిత్యాన్ని ప్రచారం చేస్తున్నది. కవిత్రయ భారతం, పోతన భాగవతం, అన్నమాచార్యుల వేల సంకీర్తనలతోపాటు అనేక ధార్మిక, ఆధ్యాత్మిక గ్రంథాలు ఇందులో చోటుచేసుకున్నాయి.

ఆ కోవలోనికి వెనుకటితరంవారైన వావిలికొలను సుబ్బారావు వస్తారు. వారి జీవితం ఆదర్శప్రాయమైనది. వారి రచనలు ధర్మప్రబోధాత్మకమైనవి. శ్రీరామభక్తితత్పరులైన వీరు ఒంటిమిట్ట శ్రీకోదండరామాలయానికి విశిష్టసేవ చేశారు. తన ఆస్తిని స్వామికి సమర్పించి ఆలయసేవకోసం (టెంకాయిచిప్ప చేత ధరించి, ధనం సేకరించి) ఒంటిమిట్టలో పలు నిర్మాణాలు చేపట్టారు. నిత్యోత్సవాదులు వైభవోపేతంగా నిర్వహించారు. తాను రచించి 1908లో ఒంటిమిట్ట స్వామికి అంకితం చేసిన ఆంధ్రవాల్మీకి రామాయణానికి 'మందరం' పేరుతో వ్యాఖ్యానం 1934లో పూర్తి చేశారు. ఆర్యకథానిధి, ఆర్యచరిత్ర రత్నములు, హితచర్యలు ఈనాటి సమాజం ధర్మమార్గంలో నివసించేందుకు వీలుగా హితబోధ చేస్తూ రచించారు. వాసుదాసు గారు ప్రారంభించిన భక్తిసంజీవని మాసపత్రిక నేటికీ వారి భక్తుల ద్వారా నడుస్తూ ఉంది.

ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానముల అధీనంలోనికి వచ్చాక వావిలికొలను వారి రచనలను, తి.తి.దే. స్వీయముద్రణగా ముద్రించేందుకు నిర్ణయించింది. అందులో భాగమే ఈ "ఉపదేశత్రయము". ఈ ఉపదేశత్రయంలో మూడు

భాగాలున్నాయి. 1. మేలుకొలుపు 2. హనుమదాచార్యోపదేశము 3. సీతోపదేశము. ఈ మూడు ఉపదేశాలు మానవుడు తన జీవితాన్ని సక్రమమార్గంలో నడిపించుకొనేందుకు ఉపకరిస్తాయి.

గురువును సమీపించి గురువు ద్వారా మరోజన్మలేని స్థితికి వెళ్లేందుకు తెలుసుకొనే మార్గాన్ని ఈ 'మేలుకొలుపు' భాగం ప్రబోధిస్తుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం అంటే ఏమిటో తెలియజేస్తోంది.

సంపూర్ణ మానవ జీవితవికాసంకోసం బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమధర్మాలున్నాయి. హనుమంతుడు ఆచార్యుడుగా రామాయణంలో తన పాత్రను నిర్వహించిన విధానాన్ని 'హనుమదాచార్యోపదేశము' వివరిస్తుంది.

చివరి భాగం 'సీతోపదేశం'. సీతాయాః చరితమ్ మహత్ – అని ఆర్యోక్తి. రామాయణంలోని సీత పాత్రద్వారా మనం తెలుసుకోదగ్గ ఉపదేశం ఇందులో ఇంది. ధర్మచింతనపరాయణులైన భక్తులు చదివి తమ జీవితాలను సక్రమ మార్గంలో మలచుకొనేందుకు ఈ ఉపదేశత్రయం గ్రంథం ఉపయోగపడుతుంది. ఉపదేశత్రయమనే ఈ గ్రంథానికి సరళమైన భాషలో చక్కటి పీఠికనందించిన ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ గారికి హృదయపూర్వక ధన్యవాదములు.

ఈ మంచి గ్రంథాన్ని ఎంపిక చేసి చక్కగా ఆమూలం పర్యవేక్షించి ముద్రాపింపజేసిన ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి శుభాభినందనలు.

సదా శ్రీవారి సేవలో...

ఐ. శ్యామలరావు
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# భూమిక

శ్రీరామచంద్రుని సేవకై తమ జీవిత సర్వస్వాన్ని సమర్పించుకొన్న మహాభక్తులు శ్రీ వావిలికొలను సుబ్బారావు గారు. వీరు జ్ఞాన, భక్తి, వైరాగ్యసంపన్నులు. వీరు రచించిన గ్రంథమే ఈ 'ఉపదేశత్రయం'. ఇందులోని ప్రతి అక్షరమూ భక్తిరసామృతముతో కూడుకొన్నది. ఉపదేశత్రయం అనే ఈ గ్రంథం మూడు అంశాలతో కూడుకొని ఉన్నది. మొదటిది–మేలుకొలుపు. రెండవది–హనుమదాచార్యోపదేశం. మూడవది–సీతోపదేశం. ఈ గ్రంథం సంసార సాగరాన్ని దాటించగలిగిన చక్కటి సాధనం. ఇందులోని మొదటి అంశం–మేలుకొలుపు.

నేటి ప్రపంచం జీవితలక్ష్యమేదో తెలుసుకోకుండా ఇంద్రియసుఖాలే ప్రధానమని భావిస్తున్నారు. ఇందువల్ల పడరానిపాట్లు పడుతున్నారు. సుఖం దొరికినా, దొరకకపోయినా చివరకు దుఃఖం మాత్రం తప్పడం లేదు. కాలమూ, సాధనమూ చేజారిన తర్వాత దుఃఖించి ప్రయోజనం లేదు. మానవుడికి పారమార్థిక సుఖమే జీవితలక్ష్యమనే విషయాన్ని చాలామంది గ్రహించడం లేదు. ఏ మార్గంలో నడిస్తే మానవాళికి శ్రేయస్సు కలుగుతుందో ఆ మార్గాన్ని ఉపదేశించాలి. నిరంతర సుఖాభిలాష నుండి జనసామాన్యాన్ని సన్మార్గంలో నడిపించాల్సింది మహాత్ములే. ఎందరో ఈ కలియుగంలో తమకు తెలియకుండానే అజ్ఞానాంధకారంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. అది తెలిపి వారిని మేలుకొలిపి జ్ఞానాన్ని మహాత్ములు ప్రసాదిస్తారు. ఇదే నిజమైన మేలుకొలుపు.

"మేలుకొలుపు" అనే ఈ వ్యాసం రెండు విధాలుగా సాగింది. సన్మార్గంలో నడిపించడం మొదటిది కాగా, లౌకికభ్రమల నుండి మరల్చడం రెండవది. 'స్వయంతీర్ణః పరాంస్తారయేత్' (తాను తరించినవాడే ఇతరులను తరింపజేయువాడు) అనే శాస్త్రప్రమాణాన్ని

అనుసరించి స్వానుభావం ప్రకారం శ్రేయో, ప్రేయోమార్గాలను విభజించడం జరిగింది. పరమహితం, శాశ్వతానందప్రదం అయిన శ్రేయోమార్గాన్ని అనుసరించాలని ఉపదేశించడం జరిగింది. తాత్కాలిక సుఖం తరువాత దుఃఖప్రదం అవుతుంది. కనుక నరకహేతువు అయిన ప్రేయోమార్గాన్ని విడనాడాలని హెచ్చరిస్తుంది.

ఎవరికి వారే తాము ఏ మార్గాన్ని అనుసరిస్తున్నారో, అనుసరిస్తున్నట్లయితే ఎంతవరకు సాధించారో తెలుసుకొనే కొలబద్దలను శాస్త్రం మనముందుంచింది. ఆ మార్గంలో సత్త్వ రజ స్తమోగుణాలను, వాటి లక్షణాలను చక్కగా వివరిస్తున్నది ఈ మేలుకొలుపు. మన మనస్సు సత్త్వగుణార్జన వైపు పయనించాలి, రజస్తమోగుణాల వేగాన్ని నిలువరించాలి. అందుకోసం ఆహారనియమాలను కూడా పాటించాలి.

ఆధ్యాత్మిక ప్రపంచంలో మంత్రజపానికి, అనుష్ఠానానికి విశిష్టమైన స్థానం, విలువ ఉన్నది. మంత్రం కూడా గురూపదిష్టమై ఉండాలన్నది అంతకంటే నిశ్చయం. గురువులకు గురుడు ఏకాదశస్థానంలో ఉండడం సహజం. కొందరు బోధగురువులు ఉన్నారు. వారు 'స్వయంతీర్ణః పరాంస్తారయేత్' అనే సిద్ధాంతానికి చెందిన మహాత్ములు. వీరు ఎడారిలోని ఒయాసిస్సులాగా అరుదుగా కనిపిస్తారు. అటువంటివారిని గురువులుగా పొందిన శిష్యులు ఉద్ధరించబడతారు. శిష్యుల పూర్వజన్మ సుకృతంకొద్దీ జీవన పరమార్థాన్ని బోధించే గురువులు వారికి లభిస్తారు.

ఇక రెండవకోవకు చెందిన గురువులున్నారు. వీరికి లోకంలో కొదువలేదు. ఇటువంటివారు ఇవ్వని మంత్రమూ లేదు, వీరికి తెలియని జగద్రహస్యమూ లేదు. శిష్యులు వారి గ్రహచారంకొద్దీ ఇటువంటి వారికి దొరికిపోతారు. ఈ గురువులు చేయించుకోని సేవలు కానీ, కోరని కోరికలు కానీ లేవు. వీరు శిష్యుల ధనాన్ని హరించేవారు. ఇలాంటివారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తూ, మేలుకొలుపుతూ,

ఖరుడు మొదలైన రాక్షసులపై శ్రీరామచంద్రుడు వెనువెంటనే ప్రయోగించిన బాణాలవలె సూటిగా, వేగంగా రచయిత తన రచనను కొనసాగించాడు.

సద్గురువుల లక్షణాలేవి? వారినెలా గుర్తించాలి? వారిపట్ల శిష్యులు ఎలా మెలగాలి? శిష్యులకు ఎలాంటి వినయవిధేయతలుండాలి, గురువులకు లేదా పెద్దలకు ఎలా నమస్కరించాలి? మొదలైన విషయాలను సందర్భానుసారంగా వివరించారు. మోక్షసాధనమైన పరమభక్తిని సాధించే దిశగా సాధకులను 'మేలుకొలుపు'తూ సాగిన ఈ వ్యాసాన్ని మనం తప్పక చదివి తీరవలసిందే.

కవి పేర్కొన్నట్లు గురూపదేశమంటే మానసిక, శారీరక, సకల మాలిన్యాలను ప్రక్షాళన చేసే అజలస్నానం, శారీరక వణుకులు, ముడతలు పడుట, జుట్టు తెల్లబడుట మొదలైన లక్షణాలను కలిగించని వృద్ధత్వం, కొవ్వు పెరగని బలుపు, బంగారంతో చేయబడని కర్ణాభరణం, దీపం లేని వెలుగు, అలజడి కలిగించని ఈ 'మేలుకొలుపు'.

ఇక ఈ ఉపదేశంలోని భాష అందామా... దాని అందమే అందం. ఈ రచనాశైలిని పరిశీలిస్తే శ్రీ వావిలికొలను వారు పానుగంటి వారికి ఈవలివారో, ఆవలివారో తెలియదు. కానీ 'సంవాదిన్యో హిమేధావినాం బుద్ధయః' అనుకుంటాను.

ఉపదేశత్రయంలో రెండవ ఉపదేశం 'హనుమదాచార్యోపదేశం'. ఇందులోని ఉపదేశ మకరందం ఈ చిన్న పీఠికలో ఇమిడేది కాదు. ఆ మకరందంలోని రెండు, మూడు బిందువులను ఆస్వాదించే ప్రయత్నం చేద్దాం.

పరమార్థ సాధనమే జీవిత లక్ష్యం. దాన్ని సాధించాలంటే మనకు గురువు అత్యావశ్యకం. తన జీవితమంతా అర్పణచేసి తాను సాధించిన దానిని గురువు శిష్యునికి శ్రమ లేకుండా అందించి వానిని కృతార్థుణ్ణి

చేస్తాడు. ఎవరికి వారే స్వతంత్రంగా పుస్తకాల ద్వారాగానీ, స్వీయబుద్ధి చేతగానీ తెలుసుకొని ముందుకు సాగాలని ప్రయత్నిస్తే వారు ప్రాపంచిక విద్యలందే కృతార్థులు కాలేరు. ఇక అతిక్లిష్టసాధ్యమైన ఆధ్యాత్మిక విద్యలలో సరైన మార్గం చేతికి చిక్కడం కానీ, గమ్యం చేరడం కానీ అసాధ్యమని వేరుగా చెప్పనవసరం లేదు. కనుక ఆచార్యుని ఆశ్రయించడం తప్పనిసరి. అటువంటి ఉత్తముడైన ఆచార్యుని లక్షణాలను మనకు తెలియపరచి వారి ఉత్తమ గుణాలను, కర్తవ్యాలను బోధించేదే 'హనుమదాచార్యోపదేశము'.

హనుమంతుని ఆచార్యునిగా భావించేవారు ఎలా ఉండాలో ఈ వ్యాసం తెలియజేస్తున్నది. హనుమంతుడు సద్వంశసంభవుడు, సద్గుణాలు కలిగిన తల్లిదండ్రులకు జన్మించాడు. కీర్తిప్రతిష్టలు కలిగినవాడు. కనుక ఆచార్యుడన్నవాడు అలా ఉండాలి. హనుమంతుడు నైష్ఠిక బ్రహ్మచారి. గొప్ప జ్ఞాని. కనుక ఆచార్యుడు అలా ఉండాలని ఈ ఉపదేశం తెలియజేస్తున్నది. ఆచార్య లక్షణాలను వివరిస్తూ ముముక్షువు బ్రహ్మచర్యవ్రతుడై ఉండాలనే తన వచనాన్ని అనుసరించి గృహస్థ భక్తుల గార్హస్థ్యం నీచమైందిగా భావిస్తారేమోనని అనుమానించి అటువంటి ఆలోచనను తొలగిస్తూ గృహస్థాశ్రమం యొక్క ప్రాశస్త్యాన్ని కూడా ఈ వ్యాసం చక్కగా వివరిస్తున్నది. “తల్లిదండ్రులు, బిడ్డలు జన్మజన్మాలలో మారుతారేమో కానీ, భార్యాభర్తలు మాత్రం మారరు” అనే ఈ వ్యాసకర్త మాట నిత్యస్మరణీయమైనది.

త్రిగుణాతీతుడైన హనుమంతుడు దాసోహమనే పరమభక్తుడే కానీ, స్వస్వరూపానుసంధానం చేసే జ్ఞాని మాత్రం కాదు అని చెబుతాడు. సంసార కారణమేది – అజ్ఞానమా? భక్తిహీనతా?, మోక్షకారణమేది – జ్ఞానమా? భక్తిప్రపత్తులా? అనే విషయాలను విపులంగా చర్చించాడు. భక్తిహీనతే సంసార కారణమనీ, భక్తిప్రపత్తులే మోక్షదాయకాలనీ నిర్ధారించాడు. ఈ సందర్భంలో భక్తికి అంగమైన జ్ఞానమే మోక్షాధికారాన్ని కలిగిస్తుంది అని ఈ వ్యాసకర్త తీర్మానించాడు.

ఆచార్య లక్షణాలను గురించి చెప్పిన ఈ వ్యాసం వారి కర్తవ్యాలను కూడా వివరించింది. ఆచార్యుడు శిష్యునికి, భగవంతునికి మధ్య వారధిలాంటివాడు. శిష్యుని దుఃఖాన్ని నివారించేవాడు. ఇది ఆచార్యుని కర్తవ్యం. హనుమంతుడు రామసుగ్రీవుల మైత్రినీ, సీతారాముల మైత్రినీ, రామభరతుల మైత్రినీ సాధించాడని పేర్కొంటూ వాటిని సప్రమాణంగా ఈ వ్యాసంలో వివరించాడు.

ఈ రచన యొక్క అధ్యయనమే ఒక సాధన. ఈ రచయిత భక్తులను ఉద్ధరించడానికి జన్మించిన కారణజన్ముడైన ఆచార్యుడు. ఈ రచన అనంతకాలికులను ఉద్ధరించగల ఆచార్యస్థానీయము అని నా విశ్వాసం. ఇందులోని ప్రతి వాక్యమూ మాణిక్యమే. ప్రతి మాణిక్యమూ శిరోధార్యమే. అయినా కొన్నింటిని తెలుసుకొందాము.

1) జీవుడు ఏది కోరినా భగవంతుడు నెరవేర్చుతాడు. కానీ, దాని ఫలం జీవుడే అనుభవిస్తాడు.

2) భగవంతుడు కోపించిన, భక్తుడు కాపాడగలడు కానీ, భక్తుడు కోపించిన వానిని భగవంతుడు కూడా కాపాడలేడు.

3) లంకలోని అశోకవనంలో మరలా పతిప్రాప్తికై సీత చేసిన కార్యమేమి?... హృదయంలో రాముడు వచ్చి తన్ను రక్షిస్తాడని దృఢవిశ్వాసం ఏర్పరచుకొంది. అందుకే ఎల్లప్పుడూ రామనామోచ్చారణ చేసింది. ఈ మార్గమే జీవాత్మకి తరుణోపాయము.

ఇక ఈ ఉపదేశత్రయములో చిట్టచివరిది సీతోపదేశము.

శ్రీ వావిలికొలనువారు ఆజీవిత భగవత్సేవాపరాయణులు. జనసామాన్యమదిలో భక్తి అనే బీజాలను చల్లి, వాటిని అంకురింపజేశారు. తద్వారా సంసారసాగరాన్ని దాటించడానికి కృషి చేసిన భాగవతోత్తములు.

ఉపదేశత్రయంలోని మూడు అంశాలు భక్తి అనే రెండక్షరాల సూత్రానికి వ్యాఖ్యానమైన మహాభాష్యాలు. అమృతసాగరాలు. ప్రతి కెరటం, ప్రతి బిందువు, ప్రతి శీకరమూ అమృతమే. ఈ అమృతం రామనామం. ఈ అమృతం సీతమ్మ. ఈ అమృతసాగరం మనముందుంది. ఈ సాగరం మనలను భక్తిపరవశులను చేయడానికి, భాగవత సేవాపరాయణులను చేయడానికే ఉద్దేశించినది. ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎవరెన్ని చెప్పినా, ఎవరేమనుకొన్నా మేము మీరనుకొన్న విధంగా మారడానికి సిద్ధంగా లేమని మొండితనం చేసేవారికి తరుణోపాయం జన్మజన్మలకూ లభించదు. కనుక మనము వారి ఉపదేశాన్ననుసరించి ఆ మార్గంలో పయనించి కృతార్థులం కావాలి. శ్రీరామచంద్రుని అనుగ్రహాన్ని ఈ జన్మలోనే పొంది తీరాలి.

శ్రీరామచంద్రుని అనుగ్రహం మనకెలా సులభంగా సిద్ధిస్తుందో తెలియజేసే అనేక ఉపాయాలు ఈ సీతోపదేశంలో ఉన్నాయి. ఒక మహారాజు దయను మనం పొందాలంటే ముందు ఆయనకు సన్నిహితులైనవారి దయను సంపాదించగలగాలి అనేది ఒక ముఖ్య ఉపాయం. దీని ప్రాముఖ్యతను శాస్త్రప్రమాణంగా, లౌకిక ప్రమాణంగా ఇందులో వివరించారు. ప్రభువుకు ఆప్తులైనవారిలో ముఖ్యులు ఆతని భార్య. ఆమె రామచంద్రుడికైతే సీతమ్మ. శ్రీమహావిష్ణువుకైతే శ్రీమహాలక్ష్మీదేవి. ఆమె దయామయి. "కార్యం కరుణమర్యేణ న కశ్చిన్నాపరాధ్యతి" అన్నది ఆమెనే కదా! మహాపరాధం చేసిన కాకాసురుని శ్రీరాముని కాళ్ళపై పడవేసి రక్షింపజేసిందీ ఆమెనే కదా! తనను బాధించిన రాక్షస స్త్రీలు ఒక్క నమస్కారం చేస్తే, వారిపై దయ చూపిన తల్లి ఆమెనే కదా! తండ్రి కోపగించుకుంటే శాంతింపజేసేదీ, చేయగలిగినదీ తల్లియే కదా! అటువంటి దయామయి అయిన సీతమ్మ ద్వారానే రామానుగ్రహాన్ని సంపాదించవలసి ఉన్నది. ఆ సీతమ్మ శ్రీరామునికి ప్రపన్నురాలు.

ఎల్లప్పుడూ రామునిపై భారముంచి తనను తాను రక్షించుకోగలిగినా కూడా రక్షించుకోలేనిది. తన శత్రువులను దండించగలిగి కూడా దండించలేదు. రాముడే రక్షిస్తాడు, రక్షించాలని విశ్వసించింది. ఇలా ఉండడం ప్రపత్తి లక్షణమే కదా! ప్రపత్తి లక్షణాలన్నీ సీతమ్మలో వున్నాయి.

ఈ సీతోపదేశంలో రచయిత ప్రపత్తిలో భాగంగా అనుకూల్య సంకల్పం, ప్రతికూల్యవర్జనం, మహావిశ్వాసం, గోప్తృత్వవరణం, ఆత్మనిక్షేపం, కృపణత్వం మొదలైనవి చక్కగా, సోదాహరణంగా వివరించాడు. అంతేకాక, ఈ రచన భక్తి మతస్వరూపాన్ని వివరించింది. సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యాలనే మోక్షస్వరూపాలు ఇందులో వివరించబడ్డాయి. మోక్షం పొందినవారికి లక్ష్మీపతిత్వము, జగత్సృష్టి, స్థితిసంహారకార్యాలు లేవనే విషయం స్పష్టీకరించబడింది.

ఇలా ఎన్నో విషయాలను వివరిస్తూ సాగిన ఈ రచన, ప్రధానంగా సీతాదేవి చరిత్ర నుండి మనం నేర్చుకోవలసిన విషయాలను తెలియజేసింది. ఆమె మహత్త్వమును, పతిదేవతాత్వమును విశదీకరించింది.

ఈ ఉపదేశత్రయమును ఆస్తికులు మరలా మరలా చదవాలి. ఇందులోని ప్రతిమాటా మనకు శిరోధార్యమే. మనల్ని సంసార సాగరాన్ని దాటించగలిగిన భక్తిప్రపత్తులను అలవరచుకొని ముక్తి అనే గమ్యాన్ని చేరాలని హెచ్చరిస్తున్నది ఈ ఉపదేశత్రయం. మనలను భక్తిమార్గం వైపు నడిపించేందుకు తహతహలాడే మహానుభావుడైన ఈ రచయిత శ్రీ వావిలికొలను సుబ్బారావు గారికి కృతజ్ఞతాబద్ధులమై ఉందాం!

**– ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ**
విశ్రాంతాచార్యులు
జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి.

# మేలుకొలుపు

# మేలుకొలుపు

మహాజనులారా! మనవి! – స్వశ్రేయస్సు గోరితిరేని అనసూయులై సావధానులరై యాలకింతురు గాక.

శరపరంపరలఁబోలిన వాక్యపరంపరలచే, నభినయవిశేషములచేఁ, దేనె మాటలచే మీ వీనులలకింపగునట్లు, మనస్సున కెక్కునట్లు, తలలూఁచునట్లు, మేలుమేలనిపించునట్లు, చప్పట్లు కొట్టిన ట్లొసఁగఁబడిన యుపన్యాసముల మీరెన్నియో వినియుందురు. మెచ్చియుందురు. ఆనందించియుందురు. తలలూఁచియుందురు. అందు మీకు శ్రేయస్కరములైనవి యెన్నియో ప్రియములైనవి యెన్నియో యందేవి మీ రనుష్ఠానమునకుఁ దెచ్చితిరో వానివలన మీరెంత బాగుపడితిరో యాలోచింపుడు.

వైదికజ్ఞానమువలనఁ జూచినను, లోకజ్ఞానమువలనఁ జూచినను లోకమున శ్రేయోమార్గమని ప్రేయోమార్గమని రెండే మార్గములు కలవు. శ్రేయోమార్గమును బోవువాఁడు తత్కాలమున నించుక కష్టపడినను దుదకు నుభయలోకముల సుఖించును. ప్రేయోమార్గమును బోవువాఁడు తత్కాలమున నించుక సుఖాభాస మనుభవించి తుదకు రెండులోకముల దుఃఖించును. శ్రేయోమార్గమును బోధించువాఁడు హితుఁడు. ప్రేయోమార్గమును బోధించువాఁడు ప్రియుఁడు. వీఁడిచ్ఛకాలమారి.

నేను వాగ్మిని గాను. వాచోయుక్తి పటుత్వము నాయందు లేదు. మీ మనముల నాకర్షించు నింపైన మాటలు, సొంపైన యభినయంబులు నేనేరను. పెద్దల సేవచేతను, సద్గ్రంథపఠనముచేతను, స్వానుభవముచేతను, నిజమైన స్వశ్రేయోభిలాష యుత్కంఠగలవారలకు నాచరింప మార్గమెయ్యిది యని నాకెఱుఁగవచ్చెనో దానిని సుబోధములగు పలుకుల మీకుఁ తెలిపెదను. ఈ మార్గమందు నడచువాఁ డెట్టి నికృష్ట జన్ముండైనను,

హీనవర్తనుఁడైనను, బాపచరిత్రుఁడైనను నిశ్శ్రేయసము గాంచుట యందుసందేహము లేదు. ఈమార్గమందు నడచువారు బాగుపడుదురని చెప్పితిని కాని, యూరక వినువారని నేను జెప్ప లేదు. కలకండ తినువారికి నోరు తీపగును గాని దానిపై నుపన్యాసముల వినువారికిఁ గాదు ఇప్పు డూరక వినువారును భగవత్కృపచేఁ గాలాంతరమున నీమార్గమం దభిలాష వహించి బాగుపడుదురు.

తీవ్రరోగముచే బాధపడువానికి మందిచ్చి పథ్యభోజనము విధించు వైద్యుఁడు హితుఁడు. రోగికి జిహ్వాచాపలము మెండు. నిషిద్ధపదార్థములనే వాఁడు కోరును. వైద్యుఁడు దిననీయఁడు. లంకణములే వేయును. చప్పిడికూడే తినుమనును. చేఁదు వగరు కారముగానుండు మందులే యిచ్చును. వైద్యుఁ డిచ్చిన మందుతిని పథ్యముండు రోగి యారోగ్యవంతుఁడై యావల నిష్టమృష్టాన్నముల భుజించి సుఖించును. ఇఁకఁ బ్రియుఁడో రోగికి నిషిద్ధపదార్థములు దిననిచ్చును. దానివలన రోగము ముదిరి క్రమక్రమముగ నెక్కువ బాధపడి రోగి తుదకుఁ జావనే చచ్చును. ఈ యిరువురిలో రోగి మేలు కోరువాఁ డెవఁడు? హితుఁడా ప్రియుఁడా యను విచారము వచ్చినపుడు బుద్ధిమంతులందఱు హితుఁడేయని తప్పక చెప్పుదురు. కావున మన ముపన్యాసములు వినినను బుస్తకములు జదివినను నిది శ్రేయస్సును బోధించునా ప్రేయస్సును బోధించునా యని విచారింపవలయును. శ్రేయస్సును బోధింపని దేదియైనను ద్యాజ్యమే ఆవిషయమున ధనకాలముల వెచ్చించుట దుర్వ్యయము.

ఇఁక శ్రేయస్సనునది యేదియని యాలోచింతము. కొందఱు ప్రేయస్సును శ్రేయస్సుగా భ్రమింతురు. శాశ్వతానందకరము నిజమైన శ్రేయస్సు. ఇదియే బ్రహ్మానందము. ఇదియే మోక్షము. అశాశ్వతానందకరమైనది దుఃఖాంతమగును. ఇట్టి దానిని బుద్ధిమంతులు సుఖకరముగ నెంచరు. ఇట్టిది విషయానందము.

**శ్లో. య త్త దగ్రే విష మివ, పరిణామే ఽ మృతోపమమ్**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్త, మాత్మబుద్ధిప్రసాదజమ్ ॥**
**విషయేంద్రియసంయోగా, ద్య త్త దగ్రే ఽ మృతోపమమ్**
**పరిణామే విష మివ, తత్సుఖం రాజసం స్మృతమ్ ॥**
**యదగ్రే చానుబంధే చ, సుఖం మోహన మాత్మనః**
**నిద్రాలస్యప్రమాదోత్థం, త త్తామస ముదాహృతమ్ ॥**
**భగవ. 18 అధ్యా.**

చిరకాల మభ్యసించుటవలన నే సుఖమునం దెక్కువ యానందము కలుగునో దేనివలన సంసారబాధ తొలుగునో తొలుత విషమువలె నుండినను గడపట నమృతమువలె నగునో యట్టిదై యాత్మస్వరూపవిషయమైన బుద్ధి ప్రసన్నతచేఁ గలుగు సుఖము సాత్త్వికసుఖము.

ఏ సుఖము విషయేంద్రియముల కూడికవలనఁ దొలుత నమృతముగాఁదోఁచి తుదకు విషమగునో యట్టి సుఖము రాజసము.

ఏ సుఖము మొదటఁ దుదఁగూడ మోహహేతువగుచున్నదో నిద్ర-సోమరితనము - హెచ్చరిక లేమి వేనివలన జనించినదో యట్టిది తామససుఖము.

దేహము ప్రకృతిపరిణామము* ప్రకృతి త్రిగుణాత్మకము - సత్త్వము-రజస్సు-తమస్సు మూఁడుగుణములు. ఈ మూఁడును లేని ప్రకృతిపదార్థమే లేదు. దేహవంతమైన దానియందెల్లఁ గొలఁదిగనో గొప్పగనో యీ మూఁడుగుణము లుండును.

**శ్లో. సత్త్వం రజ స్తమ ఇతి, గుణాః ప్రకృతిసంభవాః**
**నిబధ్నంతి మహాబాహో, దేహే దేహిన మవ్యయమ్ ॥**

తత్ర సత్త్వం నిర్మలత్వాత్, ప్రకాశక మనామయమ్
సుఖసంగేన బధ్నాతి, జ్ఞానసంగేన చానఘ ॥
రజో రాగాత్మకం విద్ధి, తృష్ణాసంగసముద్భవమ్
తన్నిబధ్నాతి కౌంతేయ, కర్మసంగేన దేహినామ్ ॥
తమ స్త్వజ్ఞానజం విద్ధి, మోహనం సర్వదేహినమ్
ప్రమాదాలస్యనిద్రాభి, స్తన్నిబధ్నాతి భారత ॥

"ప్రకృతివలనఁ గలిగిన సత్త్వము, రజస్సు, తమస్సు ననెడి మూఁడు గుణములు దేహమందుండు నవ్యయుఁడైన జీవుని బంధించుచున్నవి. అందు సత్త్వగుణము నిర్మలమై ప్రకాశమును సుఖమును గలుగఁజేయుచుఁ బురుషునికి జ్ఞానమునందును సుఖము నందును గోరికలు కలిగించుచున్నది. వాఁ డవి లభించుటకుఁ గర్మములు చేయఁగా నవి యనుభవించుటకై జన్మములు కలిగించుచు నీ విధముగ నది బంధించుచున్నది."

అర్జునా! రజోగుణము స్త్రీపురుషుల యన్యోన్యానురాగమునకుఁ గారణమనియు, విషయములందలి యాశకుఁ బుత్రాది సంబంధులయందలి కోరికకుఁ బుట్టుచోటనియు నెఱుంగుము. ఆ రజోగుణము కర్మములఁ జేయవలయునను కోరిక కలిగించుటచే బంధించుచున్నది. తమోగుణము విపరీతజ్ఞానము వలనఁ బుట్టి సమస్తప్రాణులను మోహింపఁ జేయుచున్నది. తమోగుణము నిద్ర సోమరితనము హెచ్చరికలేమి యను వానిచే బంధించుచున్నది."

ఈ గుణములగుఱించి భగవద్గీతయందు మఱియు నిట్లు చెప్పఁబడెను. సత్త్వగుణమునకు సుఖసంగము ప్రధానము. రజోగుణమునకుఁ గర్మసంగము ప్రధానము. తమోగుణము జ్ఞానమును మఱుఁగుపఱిచి విపరీతకార్యములు చేయించుచున్నది. ప్రతిజీవియందును సత్త్వరజస్తమోగుణములు మూఁడును నుండును. అందు సత్త్వ

మెక్కువయయ్యెనా యది రజస్తమస్సుల నణఁచుచున్నది. రజస్సెక్కువయయ్యెనా సత్త్వ తమస్సుల నణఁచుచున్నది. తమస్సెక్కువయయ్యెనా తక్కిన రెంటిని నణఁచుచున్నది. ఈ దేహమందుఁగల కన్నులు మొదలగు సమస్తజ్ఞానేంద్రియుముల మూలమున వస్తువుల యథార్థస్వరూపముతెలియు జ్ఞాన మెప్పుడు కలుగుచున్నదో యప్పుడు సత్త్వము వృద్ధిపొందినదని తెలియుము. రజోగుణము వృద్ధిపొందినపుడు పిసినారితనము, అత్యాశ, ప్రయోజనములేక చేష్టలుచేయుట, యింద్రియముల యుద్రేకము, విషయములందలి కోరిక కలుగుచున్నవి. తమోగుణము వృద్ధినొందినపుడు జ్ఞానము లేకుండుట, కార్యములుచేయక సోమరియైయుండుట, పరాకు, విపరీతజ్ఞానము కలుగుచున్నవి.

సత్త్వము వృద్ధిపొందినపుడు మరణించువాఁ డాత్మస్వరూప మెఱిఁగినవారి పవిత్రలోకములకుఁ బోవుచున్నాఁడు. రజోగుణము వృద్ధియయినపుడు మరణించువాఁడు ఫలాపేక్షతోఁ గర్మములు చేయువారి వంశమునఁ బుట్టుచున్నాఁడు. తమోగుణము వృద్ధియగుచుండ మరణించినవాఁ డేపురుషార్థమునకుఁ దగని నీచయోనులందుఁ బుట్టుచున్నాఁడు. ఫలాపేక్షలేక భగవత్ప్రీతిగ మంచి కర్మములు చక్కఁగఁ జేయువానికి వాఁడు మరణించినపిమ్మట మఱుసటి జన్మమున నాత్మజ్ఞానముగలవారివంశమునఁ బుట్టి మునుపటికంటె నెక్కువ సత్త్వగుణముకలవాఁడై లవమైనను దుఃఖమును బొందకుండుటే ఫలము. అట్టులే రజస్సునకు ఫలాపేక్షతోఁ గర్మములు చేయువారి యింటఁబుట్టి తాను నట్లే చేయుచు నా ఫలముల ననుభవింప మరల మరలఁ బుట్టుచు దుఃఖములపా లగుటయే ఫలము.

సత్త్వమువలన జ్ఞానము, రజస్సువలన లోభము, తమస్సు వలనఁ బ్రమాదమోహములు నజ్ఞానము కలుగుచున్నవి. సత్త్వగుణము కలవారు మోక్షమునకుఁ బోవుదురు. రజోగుణము గలవారు నడిమిలోకముల నుందురు. తమోగుణము కలవారధోలోకముల పాలగుదురు.

అయ్యలారా! శుద్ధాత్మ జ్ఞానానందమయుఁడు. జ్ఞానము నానందము నాత్మకు స్వతస్సిద్ధగుణములు. అయినను గాంతి వేఁడిమి స్వభావముగాఁగల దీపము కుండలోనుంచఁబడినపు డా రెండుగుణము లెట్లు సంకుచితములై వెలికి గోచరింపకయుండునో యట్లే ప్రకృతిసంబంధమైన దేహముననుండి దాని సంబంధమైన గుణములచే నావరింపఁబడిన బద్ధాత్మజీవుఁడు సంకుచిత జ్ఞానానందములు గలవాఁ డగుచున్నాఁడు. జీవుని జ్ఞాన మజ్ఞానముచే నావరింపఁబడుటచే మోహముపా లగుచున్నాఁడు. ఆ కారణముచే నిజమైన సుఖ మెట్టిదో యెఱుఁగలేక ప్రకృతి సంబంధములగు నింద్రియముల మూలమున వచ్చు కేవల దుఃఖమునో దుఃఖమిశ్ర సుఖమునో నిజమైన సుఖముగా భ్రమించుచున్నాఁడు. తమోగుణ మతిశయించి యుండువానికి సోమరితనము, నిద్ర, అతిభుక్తి, అభోజ్యభక్షణము సుఖకరములై తోఁచును. మెడకుఁ ద్రాడుగట్టి యెట్లీడ్చిన నట్లు పోవు కుక్కవలెఁ వీఁ డింద్రియము లెట్లీడ్చిన నట్లు పోవును.

రజోగుణము గలవాఁ డీ లోకసుఖములతో సంతుష్టి పడక స్వర్గలోకసుఖము నాశించి దానధర్మములు - పూజలు-వ్రతములు చేయును. వీని ఫలముగ స్వర్గసుఖము లనుభవించి యీ లోకమున సంపాదించిన పుణ్యము క్షయింపఁగా మరల నీ లోకమునందో యింతకు హీనలోకములందో జనించును.

**శ్లో॥ "ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం,**
**నాన్యచ్ఛ్రేయో వేదయంతే ప్రమూఢాః**
**నాకస్య పృష్ఠే సుకృతేషు భూత్వా**
**ఇమం లోకం హీనతరం విశంతి.**

అని శ్రుతి. కొందఱు తమ కోరికలు నెఱవేఱుటకై జీవహింసచేసి దేవతలఁ బూజింతురు. కొందఱు ఫలాదులర్పించి యజింతురు. మొదటివారు వారుచేసిన హింసకొలఁది యధమలోకములకును బోయినఁ

బోదురు. రెండవవా రీ లోకమున జన్మింతురే కాని యధమలోకములకుఁ బోరు.

సత్త్వగుణాతిశయులు ఫలములఁగోరి కార్యములఁజేయక యన్నియు భగవత్ప్రీతిగఁ జేయుదురు. దానివలన వా రీ లోకమున ననుభవింపవలసిన దేమియు నుండమిని నూర్ధ్వలోకము అందుండి యచ్చటనుండియే సత్త్వగుణము నెక్కువచేసికొని గుణాతీతులై మోక్షమునకుఁ బోదురు. అన్నియు నట్లు చేయుటకు సాధ్యపడనివారు మరల నీ లోకమునఁ బుట్టి యట్లే యజ్ఞదాన తపస్సులు చేయుచు సత్త్వమును మఱింత వృద్ధిచేసికొని పరమభక్తి లభింపఁగా మోక్షమునకుఁ బోదురు.

వర్తమానకాలమున జనులను మనము పరీక్షించితిమేని వేయింటికి 999 గురు రజోగుణ తమోగుణము లతిశయించి యుండువారుగానే యుందురు. శుద్ధాంతఃకరణముగల స్త్రీకిఁ గాని పురుషునకుఁగాని తన్ను మించిన విమర్శకుఁడు దొరకుట దుర్లభముగావునఁ దా నేతరగతియందుఁ జేరినది తానే పరామర్శించి తెలిసికొనవలయును.

సత్త్వగుణ మధికముగలేక యుండువారి నుద్దేశించియే కఠోపనిషత్తు "ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ నిబోధత" యని ప్రబోధించుచున్నది. ఇదియే యాంధ్రీకరింపఁబడి కోదండ రామసేవక సమాజకరపత్రంబుల

**గీ. "లెమ్ము మేలుకొమ్ము సమ్మతి సద్గురుఁ**
**జేరి తత్త్వ మెఱిఁగి క్షేమపడుము**
**రామచంద్రుసాటిరక్షకుండును లేఁడు**
**స్మరణమునకు సాటి తెరువు లేదు"**

అని ముద్రింపఁబడియున్నది. ఈ వాక్యములచేతనే మీలో నిద్రించువారిని మీమేలుకోరి మేలుకొలుపుచున్నాను.

లెమ్ము మేలుకొమ్మనియెదవే, మేము కన్నులుమూసికొని పరుండి నిద్రించుచున్నారమా యని తల్లులారా! తండ్రులారా! కినియకుఁడు. చేఁపలు కన్నులు తెఱిచికొనియే నిద్రించును. కొందఱు కూర్చుండి, నిలుచుండి, గుఱ్ఱముపైఁ బోవుచుండి నిద్రింతురు. కొందఱు నిద్రించుచునే లేచి నడచుచు గృహకార్యములఁ జేయుదురు. కావున, నిద్రకు హెచ్చరిక తప్పుట ప్రధానవిషయము. దేనియందు మనము హెచ్చరిక గలిగి వర్తింపవలయునో దానియందుఁ బ్రమాదపడి యుంటిమేని నిద్రించుచున్న వారమే యగుదుము. కావుననే

**శ్లో॥ యా నిశా సర్వభూతానాం, తస్యాం జాగర్తి సంయమీ**
**యస్యాం జాగ్రతి భూతాని, సా నిశా పశ్యతో మునేః ॥2-69॥**

యని భగవద్గీతయందుఁ గృష్ణభగవానులు సెలవిచ్చిరి. అనఁగా సమస్తభూతములు దేనియందు నిద్రించుచుండునో మననశీలుఁడైన ముని దానియందు మేల్కొని యుండును. భూతములు దేనియందు మేలుకొని యుండునో దానియందు జ్ఞానియగు ముని రాత్రియందువలె నిద్రించుచుండును.

మనము దేనియందునిద్రించుచున్నారమో పరిశీలింతము. నిద్రయనఁగా హెచ్చరిక తప్పియుండుటయని చెప్పితినిగదా. మనయింట నమూల్య వస్తు వొకటి కలదనుకొందు. ఇది పరులచేనపహరింపఁ బడకుండఁ గాచుట మనకు విధికదా. ఇట్లుండ నొకరాత్రి, దొంగలు మనయింటఁ జొరఁబడి దాని నపహరించి రనుకొందు. దొంగలు దానిని హరించుటయందు మేల్కొని యున్నారు. మనము రక్షించుటయందు నిద్రించుచున్నారము గదా. ఇట్టులే మన దేహమం దమూల్యపదార్థ మాత్మగలదు. శాశ్వతసుఖమునకై దానిని రక్షింపవలసినది మనకు విధి. అది పాపరహితము, జరామృత్యు శోకరహితము ఆఁకలిదప్పులు లేనిది,

జ్ఞానానందమయము, ఇట్టిది పాపము - జర - మృత్యువు - శోకము - ఆఁకలి - దప్పియని యేద్పుచున్నది. ఏల? ఇవి యన్నియు దానిని బీడించుచున్నవి. మనస్సుతోడి యింద్రియము లేవంక కనిన నావంకకు నిర్దయములై జింకపిల్లను దోడేళ్లవలె దాని నీడ్చుచున్నవి. అట్టి యాత్మను నిట్టి శత్రువులబారిఁ బడకుండ మనము హెచ్చరికతోఁ గాపాడుచున్నారమా? లేక మఱింత శత్రువుల స్వాధీనపడఁ జేయుచున్నారమా? రాజునకుఁ ద్రోసిరాజు రాకుండఁ గాపాడుచు నాడువాఁడుగదా చదరంగమున నేర్పరి. పాపము- జర-మృత్యువు-శోకము-ఆఁకలి-దప్పి యివి యన్నియు నాత్మకు దేహసంబంధమువలన వచ్చినవే. దేహసంబంధము నిశ్శేషముగఁ దొలఁగెనేని యాత్మ యేబాధయు లేక సుఖించును. అట్టిబాధ దొలఁగుటకు మనమేమి చేయుచున్నాము. ఆత్మ యనునదియే మనమని యెంచుఁడు. మనకీ జరాదిబాధ దొలఁగుటకై మన మేమిచేయుచున్నామని యోజింపుఁడు. నే ననునది యాత్మకే యన్వయము. ఈ దేహమను కారాగృహమునఁ బడి బాధచెందు నే నీ శాలనుండి యెట్లు తప్పించుకొని స్వతంత్రుఁడనై సుఖింతునాయని యోజించి దానికిఁ దగిన కార్యములు చేయువాఁడు ముని. వాఁడట్లు తప్పించుకొనుటయందు హెచ్చరికగలవాఁడై యెప్పుడు మేలుకనియే యుండును. తక్కినవారిలోఁ గారాగృహమే శాశ్వతవాసమని కొందఱు తలంతురు. కొందఱకు స్వాతంత్ర్యసుఖ మున్నదనుటయే తెలియదు. కొందఱు తెలిసినను దానిని సంపాదించుట యం దుపేక్ష వహింతురు. ఇట్టివా రందఱు నిద్రించువారే కదా. ఆత్మకు దేహసంబంధము కలుగుటకుఁ గామము కారణము. ఇది మునికిని తెలియును. మనకును దెలియును.

మనము ధనమార్జించుట దేనిచేత? కామముచేత, కామమనఁగాఁ గోరిక.

**ధాన్యమార్జించుట దేనిచేత? కామముచేత**
**వ్యాపారముచేయుట దేనిచేత? కామముచేత**
**సేద్యముచేయుట దేనిచేత? కామముచేత**
**సేవచేయుట దేనిచేత? కామముచేత**
**భార్యాసంగమము దేనిచేత? కామముచేత**
**సంతానవాంఛ దేనిచేత? కామముచేత**
**భుజించుట దేనిచేత? కామముచేత**
**గృహవాసము దేనిచేత? కామముచేత**
**వస్త్రధారణము దేనిచేత? కామముచేత**
**యశస్సుకోరుట దేనిచేత? కామముచేత**
**కీర్తికోరుట దేనిచేత? కామముచేత**
**యజ్ఞములుచేయుట దేనిచేత? కామముచేత**
**సత్రములునిలుపుట దేనిచేత? కామముచేత**

ఇట్టు మనముచేయు కార్యములకెల్ల మూలకారణమరసితిమేని కామమేయని తప్పక యేర్పడును. క్రోధలోభాదుల కీ కామమే తల్లి ఇట్లు కామకారణముచే మనముచేయు కార్యము లాత్మకు దేహసంబంధమును బలపఱుచును గాని క్షమింపఁజేయవు. కామముతోఁ గార్యములు చేసినయెడల వానిఫలమనుభవించుటకు మరల దేహధారణము చేయవలసియుండును. కావున, మనస్సునఁ గోరిక లుడుగువఱకు నాత్మకు దేహసంబంధము తొలఁగదు కావునఁ, గామదాసులమై మన మాత్మరక్షణ మందు నిద్రించుచున్నార మనుట సత్యము.

దేహమే తా ననుకొను పామరుఁడు దూషణభూషణ తిరస్కార సుఖదుఃఖములు తనకుఁ బ్రాప్తించినట్లు వెఱ్ఱిపట్టిన వానివలెఁ గొంతసేపు నవ్వుచుఁ గొంతసే పేడ్చుచుఁ గొంతసే పితరులఁ గసరుచు నున్మత్తనాటకము నాడుచుండును. నా సామర్థ్యము చూచితివా నా బుద్ధి

చమత్కార ముపయోగించి యె ట్లీకార్యము సాధించితినో. ఇది యితరులకు సాధ్యమగునదా? ఎంత శ్రమించి ధనమార్జించితిని? ఇఁక నే భోగము లనుభవించిన నా కెవ రడ్డము? ఉద్యానవన మధ్యమందున్న మేడయిండ్లలో బంగారుతూఁగుటుయ్యాలపై మెత్తలపై మెత్తలు వేసికొని హంసతూలికా తల్పమందుఁ బరుండి శృంగారవతులు వింజామరలు వీవ హాయిగాఁ బరుండుదును. ఇష్టమృష్టాన్నములు నానావిధములైన పిండివంటలు కడుపారఁ బూటపూట తిందును. మేలిజలతారు దువ్వలువలు గట్టుదును. ఎంత ధనమైన వెచ్చించి నాకు సుందరులని తోఁచిన స్త్రీలతో నెల్ల రమింతును. నే నేమిచేసిన నన్ను గాదనువా రెవరు? నా కార్యముల నైవరైనఁ గా దనిరా పట్టి కొట్టింతును. తలఁ దీయింతును. నాకంటె బలవంతుఁ డెవఁడు? భోగార్థము పుట్టినదేకదా యీ శరీరము? భోగింపవలయునని బుద్ధిపుట్టిన భోగింపవలయును. తినవలయునని బుద్ధిపుట్టినఁ దినవలయును. కుడుపుమానుట కుక్షివంచనము. సంకల్పము పుట్టినపు డాయా కోరికల నప్పుడప్పుడే తీర్చుకొనవలయును గాని యాయా యింద్రియమును వంచింపరాదు. అనుభవించుటకుఁ గాకున్న నింద్రియము లేల పుట్టినవి? దేహమున్నప్పుడే భోగానుభవము. వెన్నెల యున్నప్పుడే వెన్నెలకుప్పలు. ఆవల నేమికలదు? నరకము పాప మనునవి దీనులు - దుర్బలులు - నసమర్థులు భోగింప శక్తిలేని వారు తమ యాత్మసంతుష్టికై చెప్పుకొను సమాధానములే కాని వాస్తవములు గావు అని తలఁచి న్యాయాన్యాయ ధర్మాధర్మ పుణ్యపాప విచారములేక మూఢుఁడు కార్యములు చేయును.

ఇఁక నిట్టివారు తాము చేసిన కార్యముల ఫల మనుభవించినపుడు చెప్పెడు మాటలు వినుఁడు. ఇవి మీకుఁ గ్రొత్తలు గావు. అయ్యో! నిలువ నీడలేదాయెనే, కుడువఁ గుడుపు లేదాయెనే. కట్ట బట్టలేదాయెనే. పాపపు దైవమా! నీ కేమి ద్రోహముచేసితిని. అయ్యో! నాకొడుకు చచ్చెనే! నన్నుద్ధ

రించునని తలఁచితినే, నాకుఁ గొఱవివేయునని తలఁచితినే. మోసము చేసిపోయెనే. ఇల్లుపోయె, వాకిలిపోయె, కూడుపోయె, గుడ్డపోయె, కొడుకులుపోయిరి, కోడండ్లుపోయిరి, పెండ్లముపోయె, బిడ్డలుపోయిరి! నీవా యనువారు లేరు. పక్షికైన నొకగూఁడుండను నాకదియులేదు నీవా రమ్మని పిలుచువారులేరు. సుఖదుఃఖము విచారించువారులేరు. అయ్యలారా! ధర్మాత్ములారా! కన్నులుగానని గ్రుడ్డివాఁడను ఒకధర్మభిక్ష. అమ్మలారా! కాళ్లులేనివాఁడను ఒక దమ్మిడి. మూఁడునాళ్లనుండి పస్తు. పాపపు దైవమునకు నామీఁద నెంత క్రోధమో. అయ్యో! యీ వ్యాధి బాధ నేనుబడలేను. రాత్రియంతయు నిద్దురలేదు. ఇట్లు కొఱ్ఱువలెఁ గూర్చుండియుంటిని. ప్రాణముపోయినను మేలే. పాడుప్రాణము పోదే. నా చీటిబయటరాలేదే. యమధర్మరాజునకు నేనింకను గనఁబడలేదేమో. బావిలో దూఁకుదునా? చెఱువులో దూఁకుదునా? అయ్యో! యింత చిన్న వయస్సుననే ముండమోసికొన వలసివచ్చెనే. అయ్యో! యంతమంది బిడ్డలఁ గంటినే. ఒకటియైన బ్రతుకరాదా. అందఱను బెంచి పెంచి కాటిలోఁ బెట్టితినే. దేవుఁడా! నేనేమి నీకు విషముపోసితిని.

అని యీ ప్రకార మొకరొకరు తమ తమ కష్టములకై విలపించుచు దేవుని దూషించువారేకాని యవియన్నియుఁ దాము ముందు నవ్వుచుఁ జేసిన పాపముల ఫలమని తలఁపరు.

ఇట్లు మిన్ను మన్ను తెలియక కార్యములుచేయుట ఫలానుభవకాలమున శోకించుట పామరుల లక్షణము.

ఈ విషయమున ముని యేమిచేయును : దేహము లేక యే కార్యముసాధ్యముగాదు. కావున, ముక్తిసాధించుమునికిని, గామదాసుఁడైన పామరునకు దేహరక్షణ మవశ్యకార్యము. శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్మనునది యిరువురకుఁ బ్రమాణవాక్యమే. అయినను నీ కార్యమందు మునికిని బామరునకును భేదము గలదు. శరీరరక్షణమందు

నాహారగ్రహణము ప్రథమకార్యము. పామరుఁడు మునియు నిరువురు నాహారము గొందురు. పామరుఁడు నోటికి రుచిగా నున్నదియా లేదాయని మాత్రమే చూచును. రుచిగానుండినఁ దినును. రుచి లేదేని పాఱవేయును. వీనికి దేహపోషణము నింద్రియతృప్తి ప్రధానోద్దేశములు గావున లభించిన యాహారమును జూచి యిది రుచిగా నున్నదా లేదా. ఇది తినిన బలము వచ్చునా రాదా యని యిట్టిప్రశ్నలు వేయక దీనిని దినిన క్షుత్తణఁగునా యణఁగదా? అణఁగునేని యిది సాత్త్వికాహారమా? రాజసాహారమా? తామసాహారమా? అని పరీక్షించి రాజసతామసాహారములని తోఁచిన నావలఁ బాఱవేయును. సాత్త్వికాహారమయ్యేనేని దేహధారణమున కెంతకావలయునో యంతమాత్రమే గ్రహించును. ఆహారము దొరకని నాఁడు పామరుఁడు కొంపమునిఁగి నట్లేడ్చుచుండును. ముని యది యొకవిషయముగా మదిలో నెంచనేయెంచఁడు. తినెడి పదార్థములు ప్రాణమును రక్షించునని పామరుఁడెంచును. ప్రాణమును రక్షించునది ప్రాణశక్తియని యది సర్వత్రయున్నదని యెఱిఁగి ముని అగ్ని పక్వాహారమును మాని యనగ్ని పక్వములఁదినును. దానిని మాని పర్ణాదుల గ్రసించుచు వానిని మాని జలాహారియై యావల వాయువు గ్రోలి యావల సూర్యకిరణములను గొని దేహమును నిలుపును. కావున, వీఁడాహారకామి గాఁడు. దానికై పాటుపడఁడు. ఇఁక వస్త్రముల విషయమునఁ బామరుఁడు జలదారు పంచలచేతను పట్టువస్త్రముల చేతను దేహము నలంకరించి తన్ను గొప్పవానిఁగా భావించుకొనుచుండును. ఇఁక మునియో వస్త్రధారణమున నేమిప్రయోజనము? అది భుక్తినిచ్చునా? ముక్తినిచ్చునా? దేహధారణమునకిది యావశ్యకమా? శీతాతపవారణమున కావశ్యకమేని జలతారు పంచలేకాని సామాన్యవస్త్రములు పనికిరావా? వీనికి డబ్బెక్కడనుండి తెత్తును? కృష్ణాజినములు చాలవా? వీని నెవరి యాచింతును? ఎండవేఁడిమి హెచ్చయ్యెనా చెట్లనీడలులేవా? చలి యెక్కువ

యయ్యెనా గుహలులేవా? నెగళ్లులేవా? బూది లేదా? పుణ్యాత్ములవాకిటి పంచలులేవా? ప్రాణాయామము లేదా? మానరక్షణమున కందువా? మూఁడుద్రేళ్ల వెడల్పు తావును దాఁచుటకు నెనిమిది పదిమూరలగుడ్డ కావలయునా. జేనెఁడు గోఁచి చాలదా? అది వీథులలో దొరకదా? దిసమొలతోనుండు నన్నుఁగని యేపురుషులో యేస్త్రీలో జిట్టెఁడు గుడ్డ యియ్యరా? అది లేకున్న నాకేమిలోటు? నా కేమిసిగ్గు? సిగ్గుపడువా రితరులే? అది లేకున్న నాప్రాణముపోవునా?

ఇంతకు సిగ్గనునది మనుష్యులు నడుమఁగొని తెచ్చుకొన్న తద్ధినమే కాని స్వభావసిద్ధమైనది కాదు. అది స్వతస్సిద్ధ మైనచో బాలికాబాలక వృద్ధులయం దేల లేదు? నడుమ వచ్చినది గనుకనే నడుమనే పోవుచున్నది. ఆరోపితము గనుకనే యోగులు విసర్జించుచున్నారు.

**శ్లో. శరీరం వ్రణవ త్పశ్యే, దన్నం తు వ్రణలేపనమ్ ।**
**వ్రణసేచనవ త్పానం, వస్త్రం తు వ్రణపట్టవత్ ॥**

దేహమును[1] బుంటివలెను, అన్నమును బుంటికిఁ బూసెడి పూఁతవలెను (ఉడికించి కట్టెడి పిండివలెను) పానము పుంటిని గడుగు నీళ్లవలెను, వస్త్రమును బుంటికిఁ గట్టెడి గుడ్డవలెను జూడవలయుననికదా విజ్ఞులు చెప్పుదురు.

**శ్లో. న శబ్దశాస్త్రాభిరతస్య మోక్షో, న చైవ రమ్యావసథప్రియస్య ।**
**న భోజనాచ్ఛాదనతత్పరస్య, న లోకచిత్తగ్రహణే రతస్య ॥**

వ్యాకరణమందుఁ బ్రీతిగలవానికిని, మంచి యిండ్లయందుఁ బ్రియముపడువానికిని, భోజనవస్త్రములం దాసక్తిగలవానికిని, నే నేమిచేసిన నెవ రేమనుకొందురో యని యితరుల చిత్తవృత్తి ననుసరించి పోవువానికిని మోక్షము లేదు. అను సూక్తులు వ్యర్థభాషణములా!

1. కురుపు

**శ్లో. అస్థి స్థూణం స్నాయుయుతం, మాంసశోణితలేపనమ్ ।**
**చర్మావనద్ధం దుర్గంధి, పూర్ణం మూత్రపురీషయోః ॥**
**జరాశోకసమావిష్టం, రోగాయతన మాతురమ్ ।**
**రజస్వల మనిత్యం చ, భూతావాస మిమం త్యజేత్ ॥**

ఎముకలు స్తంభములై నరములు కట్టుత్రాళ్లై మాంస రక్తములతో నలుకఁబడి తోలుగప్పి గౌలుగొట్టుచు మలమూత్రములచే నిండి వార్ధకశోకము లావేశించి రోగముల నెలవై, క్షుత్పిపాసాపీడితమై రజముతోఁగూడి యశాశ్వతమై యెప్పుడో యేవేళనో కూల సిద్ధపడి పంచభూతములను దయ్యములఁ గల కొంపను నెప్పుడెప్పుడు విడుతునా యని ముని యెదురు చూచును. పామరుఁ డది పోవునేయని యేడ్చును.

అని యీ ప్రకార మాలోచించి వస్త్రకామిగాక కౌపీనమాత్రధారియో దిగంబరుఁడో యగును. ముని ప్రతిపదార్థ విషయమందును నిది లేకున్న నా దేహమునిలువదా? ఇది నా యాత్మ నిష్ఠకు సాధకమా బాధకమా? యని మాత్రమాలోచించుచుఁ దుదకు నాహారకామిగాక, వస్త్రకామిగాక, గృహకామిగాక, కేవల నిష్కామియగును. తుదకు పామరుఁడు సర్వకాలసర్వావస్థలయందు శిశ్నోదరపరాయణుఁడై కామవిషయమున దేహాభిమానమును వదలును. జాగరూకుఁడైయుండు ముని నారాయణ పరాయణుఁడై కార్యములఁ జేసినను నిష్కాముఁడై భగవత్ప్రీతిగఁజేయుచు యోగమున జాగరూకుఁడైయుండి కామమున విస్మృతివహించి యాత్మనిష్ఠుఁడై యుండును.

పామరుఁడు దేనిని వలయుననునో ముని దానిని వలదనును. పామరుఁడు దేనిని భూషించునో దానిని ముని దూషించును. పామరుఁడు సకల కార్యములందుఁ గర్త నేననును. మునియో కర్త భగవంతుఁడనును. పామరుఁడు ప్రపంచము తన భోగార్థమై యున్నదనును. ముని తాను

నవి సర్వ ప్రపంచము భగవంతుని భోగార్థమై యున్నదనును. పామరుఁడు తాను స్వతంత్రుఁడ ననుకొనును. ముని తాను భగవత్పర తంత్రుఁడననుకొనును. పామరునకుఁ గర్మభూమి ఫలభూమి యిదియే. ముని కిది కర్మభూమి. ఫలభూమి పరలోకము. పామరుఁడు దుఃఖమువచ్చిన దుఃఖించును. సుఖము వచ్చిన సంతోషించును. మేలువచ్చినఁ బొంగును. కీడువచ్చినఁ గ్రుంగును. మునియన్నిట సముఁడుగానుండును. పామరునకు సంసారము పరమార్థము. మునికి సంసారము కారాగారము.

**సీ. కమనీయభూమి భాగములు లేకున్నవే**
**పడియుండుటకు దూదిపఱపు లేల?**
**సహజంబులగు కరాంజలులు లేకున్నవే**
**భోజన భాజనపుంజ మేల?**
**వల్కలాజిన కుశావళులు లేకున్నవే**
**కట్ట దుకూలసంఘంబు లేల?**
**గొనకొని వసియింప గుహలు లేకున్నవే**
**ప్రాసాదసౌధాదిపటల మేల?**

**గీ. ఫలరసంబులు గురియవే పాదపములు?**
**స్వాదుజలములు నుండవే సకలనదులుఁ?**
**బొసఁగ భిక్షంబుఁ బెట్టరే పుణ్యసతులు?**
**ధనమదాంధులకొలు వేల తాపసులకు.**

**సీ. అజినవల్కల దుకులాంబరంబులు గట్టి**
**యైనఁ గట్టకయైన నలరుచుందు**
**నాందోళికారథ హయనాగములనెక్కి**
**యైన నెక్కకయైన నరుగుచుందుఁ**
**గర్పూరచందన కస్తూరికా లేప**
**మైన భూరజమైన నలఁదుచుందు**

భర్తశయ్యలనైనఁ బర్ణశిలాతృణ
భస్మంబులందైనఁ బండుచుండు.

గీ. మానహీనమైన మానయుక్తంబైనఁ
దియ్యనైన మిగులఁ దిక్తమైనఁ
గుదుతు, సగుణమైన గుణవర్జితంబైనఁ
గొంచెమైనఁ జాల గొప్పయైన.

కం. లేదని యెవ్వరి నడుగను
రాదని దుఃఖింపఁ బరులు రప్పించినచోఁ
గాదని దేనిని మానను
ఖేదము మోదంబులేక క్రీడింతు మదిన్.

కం. నిందింపఁ బరుల నెన్నఁడు
వందింప ననేకపీడ వచ్చిన మది నా
క్రందింప విభవముల కా
నందింపఁ బ్రకామ వర్తనంబున నధిపా. భాగవతము

గీ. కెరలి భిక్షాన్న మారగించెదము మేము
పండుకొనియెద మిలయను పాన్పుమీఁదఁ
గట్టెదము దిక్కులనియెడి కలితశాటి
యేమికార్యంబుమాకు నరేంద్రులందు. భర్తృహరి

అని ముని తలఁచును. పామరులో ధనికుల గులాములు. ఇట్టిముని

శ్లో. నాహారం చింతయే త్ప్రాజ్ఞో, ధర్మమే వానుచింతయేత్ ।
ఆహారో హి మనుష్యాణాం, జన్మనా సహ జాయతే ॥

శ్లో. ఉత్పత న్నపి చాకాశం, విశ న్నపి రసాతలమ్ ।
అట న్నపి మహీం కృత్స్నాన్, నాదత్త ముపతిష్ఠతే ॥

అను నిశ్చయబుద్ధిగలవాఁడు.

బుద్ధిగలవాఁ డాహారమునకై చింతపడరాదు. ధర్మమునే కాపాడుచుండవలయును. మనుష్యుల కాహారము పుట్టుక తోడనే పుట్టినది. తల్లిగర్భమందు నే నుండఁగానే నా కాహారమైన పాలను దల్లిచన్నులయం దుంచినవాఁడు. నేఁడేల నన్నుఁ బస్తులుంచును. ఆనాఁటి దేవుఁ డీ నాఁడు లేఁడా? నే నా కాశమున కెగిరిపడినను బాతాళమునఁ జొచ్చినను భూవలయమంతయుఁ గ్రుమ్మరినను నే నెంత పూర్వజన్మమున దానముచేసితినో యంతే యిప్పుడు నాకు లభించును. ఎక్కువరాలేదని నేనిప్పుడు వగచి ప్రయోజనమేమని యాహారసంపాదనమునకై ముని దేవులాడఁడు.

మీరు సులభముగఁ బరీక్షించి తెలిసికొనఁదగినవాని విషయమునఁ బామరుల యభిప్రాయము మునుల యభిప్రాయము తెలిపెదను. అం దెవరి యభిప్రాయము మోహదుష్టమో యెవరి యభిప్రాయము యథార్థమో మీరే తెలిసికొనుఁడు. మోహకారణభూతలు స్త్రీలుగదా. వారి విషయమున నిరువుర యభిప్రాయము లెట్టివో వినుఁడు.

| స్త్రీల | పామరునకు | మునికి |
|---|---|---|
| కురులు | నీలములు–నల్లకలువలు తుమ్మెదలు. | స్పృశింపరాని వెండ్రుకలు. |
| ముక్కు | సంపెఁగ మొగ్గ | చీమిడిబుఱ్ఱ |
| నోటియెంగిలి | అధరామృతము | జొల్లు. |
| స్తనములు | బంగరుకుండలు–పూల చెండ్లు | పచ్చిమాంసపు ముద్దలు |
| భగము | ఇంద్రభోగస్థానము | ఉచ్చగుంత–రేతఃపల్వలము |
| దేహము | కనకశలాక–మెఱపుఁదీగ | మలమూత్రభాండము తోలుకప్పిన యెముకలగూఁడు. |

ఇట్టులే తక్కినవి పురుషుల విషయమై స్త్రీలును నిట్లే యాలోచించి మోహవిభ్రాంతులై యజ్ఞానాంధకారమున మునిఁగియుండువా రెవరో సత్యవాదులై యథార్థ దర్శనులైనవారెవ్వరో మీరే నిర్ణయింపుఁడు.

మీఁద సూచించిన చింతామార్గము లాలోచింపఁ బామరుఁడు దేనియందు నిద్రించుచున్నాఁడో యనఁగా నుపేక్ష వహించి యున్నాఁడో యందు ముని హెచ్చరికకలిగి మేల్కొని యుండును. ఎందుఁ బామరుఁడు మేలుకని యున్నవాఁడో యందు ముని యుపేక్షవహించి నిద్రించుచుండుననుట స్పష్టమయ్యెఁగదా. ఒకదానియం దొకఁడు నిద్రించిన మఱియొక దానియందు మఱియొకఁడు నిద్రించుచున్నవాఁడు. వీ రిరువురిలో నెవరిని శ్రుతి మేలుకొలుపుచున్న దందురేమో. వాస్తవ మారయఁబామరుఁడు పరమార్థమును గనులఁగానక పగటఁ గన్నులు దెఱచి నిద్రించును రాత్రులందుఁ దన దేహమే తనకుఁ దెలియక పీనుఁగువలెఁ బడికన్నులుమూసి నిద్రించును. మునియో యహర్నిశములు కన్నులమూయక మేలుకనియే యుండును. రాత్రులందు నించుకసేపు నిద్రించునో నిద్రింపఁడో.

తమోగుణ లక్షణమైన నిద్రచేతను, బ్రొద్దువోని ముచ్చటలు చింతలు మొదలగువానిచేతను, వ్యర్థముగఁ గాలము గడపరాదని ముని క్రమక్రమముగ నాహారము తగ్గించి నిద్ర తగ్గించును. నిద్రింపవలయునను కోరికచేఁ బండుకొనఁడు. బలాత్కారముగ నిద్ర పైపడెనేని కూర్చుండియే తూఁగును. లేక లేచి నడవనైనఁ బూనును. నిద్ర సుఖమని పామరునివలెఁ దలంపఁడు.

ముని భయమెట్టిదో యెఱుఁగఁడు. ఎవరికి భయపడ వలయును? ఏల భయపడవలయును? మనకుఁ గీడుచేయుశక్తి యెవనికిఁ గలదు?

"సర్వం ఖల్విదంబ్రహ్మ" ఇదంతయు బ్రహ్మమే కదా!

“తేన వినా తృణాగ్రమపి నచలతి” ఆయనవలనఁగాక గడ్డి పోఁచయుఁ గదలదు. శివునాజ్ఞలేక చీమయైనఁ గుట్టదు.

హరిమయముగాని ద్రవ్యము పరమాణువులేదు.

“వాసుదేవ స్సర్వమ్” సర్వము వాసుదేవుఁడే.

“సర్వము న్నతని దివ్యకళామయము”

“ఈశావాస్య మిదంసర్వమ్” ఈ ప్రపంచమంతయు భగవంతుని వాసస్థానము.

**“య చ్చ కించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతే ఽపి వా ।**
**అంతర్బహి శ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః ॥”**

ఏదిచూచెదమో యేదివినెదమో యంతయు లోపల వెలుపల నంతట నారాయణుఁడే వ్యాపించి యున్నవాఁడు.

ఇత్యాది వాక్యముల స్మరించి

**శ్లో. యత్రైవ యత్రైవ మనో మదీయం, తత్రైవ తత్రైవ తవ స్వరూపమ్**
**యత్రైవ యత్రైవ శిరో మదీయం, తత్రైవ తత్రైవ పదద్వయం తే.**

ఎచ్చటెచ్చట నామనస్సో యచ్చటచ్చట నీస్వరూపమే. ఎచ్చటెచ్చట నా శిరస్సో యచ్చటచ్చట నీ పాదద్వయమే యనుకొనుచు పులి, సింహము, కొండగుట్ట, చెట్టు, మిట్ట, స్త్రీ పురుషుఁడు సర్వము భగవత్స్వరూపముగానే యనుసంధానముచేయుచు నమస్కరించుచుండును. పాము వచ్చినా, పెద్దపులి వచ్చినా, భగవంతుఁడే యా స్వరూపముతో వచ్చెనని మ్రొక్కుచు నిలుచును. అవి కీడుచేసిన భగవదనుగ్రహ మనుకొనును. ఇట్టివాఁ డెవరికి భయపడవలయును? ఏల భయపడవలయును?

మైథునము. ఇది పామరులకుఁ బరమార్థము. తుదకు వీరు

కడుపునిండఁ గుడుపుతినుటయు నీ కార్యమునకే. దీనికై మనుష్యు లెన్ని పోరానిపోకలైనఁ బోదురు. పశుపక్ష్యాదులందు లేని ముండలరోగములు మనుష్యులందే కదా కలవు. ఇఁక మునియో యిట్టు లాలోచించును మైథునమనఁగా నేమి? తల్లిగర్భమను నరకములోఁ జీఁకటిగదిలోఁ బడి పరితపించు మనుష్యునకు దానినుండి వెలువడుటకు మార్గమేదియో దానిని, జన్మించిన పిమ్మటఁ బాలిచ్చి యేవి రక్షించెనో వానిని, బురుషుఁడు చక్కఁగ శక్తివంచనలేక లేని శక్తియైనఁ దెచ్చుకొని మర్దించుటేకదా మైథునమనఁబడును. ఇంతకంటెఁ గృతఘ్నత వేఱొం దుండునా? ఏమి పాపమో పామరులు దీనిని దలఁపరు గదా? మలద్వారమైన దీనికై పురుషు లెంత పాపమైనఁ జేయుచున్నారు కదా? దీనియందుఁ బురుషులుంచు నాసక్తిని భగవంతునియందుంచిన నిది యొసఁగు సుఖ మాయన నీయఁజాలఁడా?

**శ్లో. దేవతిర్యఙ్మనుష్యేషు, పున్నామా భగవాన్ హరిః ।**
**స్త్రీనామ్నీ లక్ష్మీ ర్మైత్రేయ, వానయో ర్విద్యతే పరమ్ ॥**

**– విష్ణుపురాణమ్**

దేవతిర్యఙ్మనుష్యులందు పురుషనామము దాల్చిన వా రందఱు శ్రీ విష్ణువులే. స్త్రీనామముగలవారందఱు లక్ష్మీదేవులే. ఇంతకంటె నితరమైనది వీరినిమించినది వేఱొందులేదు అని యుండుటచే స్త్రీలందఱు లక్ష్మీదేవులు సీతాదేవులు నైనపుడు పురుషుఁడే స్త్రీతోనైన నెట్లుసంభోగింపఁగలఁడు? దుష్టుఁ డెవఁడైన స్త్రీలు లక్ష్మీదేవులైన నేను విష్ణువును గదా యేల సంభోగింపరాదను నేని యప్పు డందఱు స్త్రీలు తనకు భార్యలేకదా. తన తల్లియు – కూఁతురు – అక్క సెల్లెండ్రు – కోడలు మొదలగు వాదుకూడఁ దనకు భార్యలే కదా! ఇట్టి భావము సమంజసమా? అట్లు కాదేని యొకవస్తువును బోలిన వేఱొకవస్తువును జూచి నపుడు తొలుతఁజూచినది

స్మరణమునకు వచ్చుట స్వభావము గదా. అట్లైనచో నొకస్త్రీని జూచినపుడు మతిగలపురుషునకుఁ దనతల్లి జ్ఞప్తికి రాకపోవునా?

**గీ. స్త్రీలఁ గన్నంతమాత్రానఁ జిత్రమేమొ**
**యెన్నఁడో చన్ననాతల్లి స్మృతికివచ్చు**
**నిట్టిమోవియ కద నాకు నిడియె ముద్దు**
**లిట్టిచేతులె కద నన్ను నెత్తిపెంచె**
**నిట్టికేల్గాదెనన్ను జోకొట్టుచుండెఁ**
**గూర్మి మీఱంగనిదుకొని కుఱువులందు**
**నీకరంబులె నన్ను నుయ్యేలల నూఁచె**
**నిట్టిఱొమ్ములె కద నాకు నిచ్చెఁ బాలు.**
**ఇట్టి గర్భంబునంగాదె యేనునుంటి**
**మాసములు తొమ్మిదిని సుఖావాసముగను**

టెంకాయచిప్పశతకము అని తలంచుట స్వభావవిరుద్ధము కాదు కదా. ఇట్లు తలఁచువాఁ డెవతెతో సంభోగించును. కావున స్త్రీలందఱు నాకుఁ దల్లులు సీతలు లక్ష్మీదేవులు నని వారిని గన్నప్పుడెల్ల ముని నమస్కరించుచుండును. పామరుఁడు సర్వకార్యములకు స్వదేహసంబంధ కార్యములకు సహితము పరులపై నాధారపడియుండును. ఇప్పటి దొంగసన్యాసులు, దొంగ యోగులు, నంగశుశ్రూషయను పేరఁ బ్రాయంపు విధవలచేఁ దొడలసేవ, దేహసేవఁ జేయించుకొను చున్నారు గాని నిజమైన యోగులు సన్న్యాసులు నట్టివాని నొల్లరు "సర్వం పరవశం దుఃఖం, సర్వమాత్మవశం సుఖ" మ్మనుట మఱవక 'స్వయం దాసా స్తపస్విన' యను సూక్తి ననుసరించి తమకుఁ గావలసిన కార్యములన్నియుఁ దామే చేసికొనుదురు. ముని సూర్యపక్వ పదార్థములే తినును. నదీ తటాకాది జలములే త్రాగును. దేవుఁ డిచ్చినకాళ్లచే నడచును. నేలమీఁ దనే పరుండును. యోగాభ్యాసముచేఁగాని దారి నడచుటచేఁ గాని బడలినపుడు

శవాసనమున నరగంట పరుండును. శీతోష్ణములఁ బ్రాణాయామముచే సహించును. వస్త్రమున్నచోఁ దానే యుదికికొనును. ఈ విధముగఁ బరసాహాయ్య మపేక్షింపక యొరుల బాధింపక ముని జీవించును. తన్ను రక్షించువారు బంధువులు ధనములు మిత్రులని పామరుఁడు తలఁచును. రక్షించుశక్తి వీరికెవ్వరికి లేదనియుఁ దమవలెనే ప్రకృతిబద్ధులై సంసార కారాగృహమునఁబడి దుఃఖించుచుండు వారు నన్నేమి కాపాడఁగలరనియు

**కం. రక్షకులు లేని వారల**
**రక్షించెదననుచుఁ జక్రి రాజై యుండన్**
**రక్షింపు మనుచు నొక నరు**
**నక్షము వేఁడంగ నేల యాత్మజ్ఞులకున్. – పోతన భాగవతం**

**"న వాసుదేవభక్తానాం మశుభం విద్యతే క్వచిత్"**

భగవంతుని భక్తులకు నెట్టి భయములేదు

**'న మే భక్తః ప్రణశ్యతి' (భగవద్గీత)** నాభక్తులు చెడరు

ఇత్యాదులైన యభయ సూక్తుల నమ్మి

**శ్లో. స్వయం మృత్పిండభూతస్య, పరతంత్రస్య దేహినః ।**
**స్వరక్షణే ప్యశక్తస్య, కోఽ హేతుః పరరక్షణే ॥**
**పశవః పాశితాః పూర్వం, పరమేణ స్వలీలయా ।**
**తే నైవ మోచనీయా స్తే, నాన్యై ర్మోచయితుం క్షమాః ॥**
**– వేదాంతదేశికుల రహస్యత్రయసారము**

తామే మంటిముద్దలై పరతంత్రులై తమ్ముఁ గాపాడుకొను శక్తిలేనివారు పరులనేమి కాపాడఁగలరు. పూర్వము భగవంతుఁడే లీలగాఁ బశువులను జీవులను బంధించెను. ఆ బంధముల మరల నాయన విడుచుటకు సమర్థుఁడే కాని యితరులు యంత సర్వరక్షకుఁడు సర్వస్వామి సర్వశక్తుఁడు

సర్వశరణ్యుఁడు నగు భగవంతునకు భరార్పణము ఫలార్పణము గావించి నిర్భరుఁడై నిర్భయుఁడై యుండును.

ప్రవృత్తి (సంసార) మార్గనిష్ఠులకు, నివృత్తి (మోక్ష) మార్గనిష్ఠులకు నెంత భేదముగలదో కంటిరా – ఏది మేలో మీరే నిశ్చయించుకొనుఁడు.

కావున, నిరువురయందు విశేషనిద్రాళువు పామరుఁడే కావున, వానినే శ్రుతి బోధించుచున్నదని యెఱుఁగవలయును. అంతియకాదు, మనుష్యులకు దైవమార్గమని యసురమార్గమని రెండు కలవనియు నందుఁ బామరమార్గ మసురమార్గమనియు, ముని మార్గము దైవమార్గమనియుఁ, దైవమార్గమునకు ఫలము మోక్షమని చెప్పి కృష్ణుఁడసుర మార్గమునఁ బోవువారిని గుఱించి

**శ్లో. తా నహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్ ।**
**క్షిపా మ్యజస్ర మశుభా, నాసురీ ష్వేవ యోనిషు ॥**
**ఆసురీంయోని మాపన్నా, మూఢా జన్మని జన్మని ।**
**మా మప్రా ప్యైవ కౌంతేయ, తతో యాం త్యధమాం గతిమ్ ॥**

అట్టి సాధు విరోధులై క్రూరులైన నరాధములను దుఃఖకరములైన యసురయోనులందు నెల్లప్పుడు త్రోయుచుందురు. ఈ విధముగ నసురయోనులందు జన్మ జన్మమున మూఢులై పుట్టి యావల నన్నుఁ బొందకయే యర్జునా! యధమగతుల పాలగుదురని చెప్పెను. ఇట్టి పామరులకే కదా హితము బోధింపవలయును. కావున శ్రుతివారినే ప్రబోధించుచున్నది. ఏమని మేలు కొలుపుచున్నది.

సమ్మతి (సన్మతి) సద్గురుఁజేరి తత్త్వమెఱిఁగి క్షేమపడుము అని బోధించుచున్నది. అటు చేయకపోయితివేని క్షేమపడ వనునర్థము దీనివలన స్ఫుటమగుచున్నది. సమ్మతిన్ (సన్మతిన్) ఇది శిష్యధర్మమును దెలుపుచున్నది.

ఇట్టి మనస్సు సంసారసాగరమున మునుఁగుచుఁ దేలుచుఁ గామోపహతచిత్తులై దరిదాపు గానక యుండువారికి దుర్లభము.

ఒకజీవి జన్మజన్మమునఁ బాపములు చేయుచుఁ జచ్చి నరక బాధ లనుభవించుచుఁ దుదకు నరకమార్గము రోసి పుణ్యకర్మములు చేయ నారంభించును. వానివలన స్వర్గమునకుఁ బోయి సుఖము లనుభవించుచుఁ బుణ్యము క్షయింపఁగా మరల భూమిపై జన్మించుచు నిట్లు స్వర్గమునకు భూమికిఁ జక్రమువలెఁ దిరుగుచుండును. ఇట్లు తిరుగు జీవి యేదో యొక జన్మమునఁ జేసిన నిష్కామపుణ్యముచేతనో దారితప్పి యాపదయందు భగవన్నామ ముచ్చరించుటచేతనో 'కృపా కాప్యుపజాయతే' యన్నట్లు భగవంతుని కతనియందుఁ గరుణ జనించును. ఆ భగవత్కృపాదృష్టిచే నిర్వేదము జనింప సంసారము రోసి దానినుండి విడివడుటెట్టులా యని యాలోచింపసాగును. ఇంతవఱకు నెవ్వరు దేవుఁడు దైవము భక్తిజ్ఞానము నని చెప్పినను వాని చెవులఁ జొరఁబడవు.

**ఉ. అచ్చపుఁ జీఁకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై**
**చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైనవారికిన్**
**జెచ్చెరఁ బుట్టునే పరులు చెప్పిన నైన నిజేచ్ఛ నైన నే**
**మిచ్చిన నైనఁ గానలకు నేగిన నైన హరిప్రబోధముల్.**
**– పోతన భాగవతము**

అని ప్రహ్లాదుఁడు చెప్పెనుగదా సత్కర్మపరిపాకంతో

**బహూనాం జన్మనా మంతే నృణాం మోక్షేచ్ఛా జాయతే।**
**తదాసద్గురు మాశ్రిత్య చిరకాలసేవయా బంధా న్మోక్షం కశ్చి త్ప్రయాతి.**
**– పైంగలోపనిషత్తు**

అనేకజన్మముల కావల సత్కర్మ పరిపాకమువలన మనుష్యులకు మోక్షమం దాసక్తి కలుగును. అప్పుడు సద్గురు నాశ్రయించి చాలఁగాలము

సేవించి బంధమువీడి మోక్షమున కెవ్వఁడో యొకఁడు పోవును. ఇట్టివానికి నిర్వేదము ప్రథమ చిహ్నము.

నిర్వేదమువలన భగవదాభిముఖ్య మించుక గలవాఁడైనను వీనికి నహంకారమమకారములు దొలంగమిని గండములు మానినవి కావు. గ్రంథములందు మోక్షకారణము కర్మయోగమని యొకచోట జ్ఞానయోగమని యొకచోట భక్తియోగమని యొకచోటఁ జదివి శాస్త్రవాక్యములకుఁ దన ప్రకృతిగుణము ననుసరించి యర్థము చెప్పుచు దురభిమానముచేఁ బెద్దల నడిగి తెలిసికొనక సర్వజ్ఞత్వము నారోపించుకొని యశాస్త్రీయపద్ధతిఁ గర్మములుచేయుచు వ్యర్థుఁడై కొన్ని జన్మములు గడపి యావలఁ గల్లు-సారాయి-గంజాయి త్రావి మాంసభక్షకులైన క్షుద్రుల వలనఁ దాము చెప్పెడిమాటలకుఁ దమకే యర్థముతెలియని కుక్షింభరులైన నీచబ్రాహ్మణ విధవాదులవలనను నీచజాతుల వలనను 'అహంబ్రహ్మాస్మి తత్త్వమసీత్యాది' వాక్యముల కసంప్రదాయార్థ మెఱుఁగుచు భ్రష్టులై కొన్ని జన్మముల దుఃఖములపాలై యావల సరియైనరీతిని గర్మజ్ఞానయోగము లభ్యసించి వానిచే నిర్మలమనస్కుఁడై భక్తియోగప్రాప్తికి విరోధులైన పాపముల నశింపఁజేసి సద్గురు కటాక్షముననేకజన్మముల కావల తుదకు భక్తియోగ మభ్యసింపఁ బ్రారంభించును. ఈయర్థమునే

**శ్లో. జన్మాంతరసహస్రేషు, తపోధ్యానసమాధిభిః ।**
**నరాణాం క్షీణపాపానాం, కృష్ణే భక్తిః ప్రజాయతే ॥**

యనుశ్లోకము దెలుపుచున్నది. (వేలకొలఁది జన్మము లందుఁ జేసిన తపస్సు ధ్యానము సమాధి మొదలైనవానిచేఁ బాపములు నశించిన మనుష్యులకుఁ గృష్ణభక్తి పుట్టుచున్నది.) భక్తిపుట్టినంతమాత్రముచేతనే మోక్షమురాదు.

ఇట్లు తొలుతఁ బుట్టినభక్తికి గౌణభక్తియని పేరు. ఇది పరభక్తియై, యవలఁ బరజ్ఞానమై, యవలఁ బరమభక్తిగాఁ బరిణమించును. మోక్షమిచ్చునది పరమభక్తియే. (దీని లక్షణములు ననుష్ఠానవిధములు భక్తిప్రసూనమాలికా గ్రంథముల వివరింపఁ బడెను. తృతీయసోపానము చూడుఁడు.)

ఒకఁడు నిద్రమేలుకొనెనా లేదా యని తెలియుటకుఁ గొన్ని నిదర్శనములు గలవు.

1. సత్యమై స్థిరమై తీవ్రమైన నిర్వేదము. నిర్వేద మనఁగా విషాదము. పరితాపము. కడచినదానిని గుఱించి మిక్కిలి తపించుట. ఆహా! యిదియేమి సంసారమేమి సంసారము. ఎన్ని కష్టములు! ఎన్ని దుఃఖములు! ఎన్ని పడరాని పాటులు! కుక్కలు కూడ నిన్ని పాటులు పడవే. ఇన్నియు నేమిటికి? పొట్టకు – పట్టకు – వట్టకు. ఈ మూఁటికిఁగాను నెందఱ నాశ్రయించితిని? ఎంత కష్టముచేసితిని! ఎంతయవమానము సహించితిని! ఎన్ని యసత్యము లాడితిని! ఎందఱ మోసగించితిని! ఇంతయేల? వీనికై నేను జేయని పాపమెద్ది? ఇంతచేసి సంపాదించితినిబో. ఎవరికెక్కిన ప్రీతి! నేను సంపాదించినదానిలో నేను దినినది యెంత! అంత కష్టపడి దున్ని విత్తి నీళ్లుదోలి పైరుపెంచి తుదకు గడ్డితిని జీవించు నెద్దులకుఁ బురుషులకు నేమిభేదము? ఇంత శ్రమించినది పరులకైకదా. దారపుత్రాదులకు బంధువులకు. ఎంతతెచ్చి కొంపలోవేసినను లేదు చాలదను వాక్యములేకాని, యయ్యో మాకై యింత శ్రమించుచున్నావు గదా యని పల్లెత్తి కృతజ్ఞతను దెలుపుమాట యొక్కటి యేనాఁడైన వారినోర వెలువడునా? వా రనకున్నఁబోనీ! అక్కఱలకైన నాదుకొందురా? వీరికందఱకు నాయందుఁ బ్రీతియా? నా ధనమునందుఁ బ్రీతియా? నాయందుఁ బ్రీతిగలవారైరేని నాకు సంపాదన ముడిగిన వేళ నిప్పటివలె నన్ను నేల యాదరింపరు? ప్రాణము పోవఁగానే నన్నుఁజూచి యేల భయపడుదురు?

"ఆత్మానం సతతం రక్షేత్ దారైరపి ధనైరపి" భార్యను ధనమును విడిచియైనఁ దన్నుఁ (దనయాత్మను) రక్షించుకోవలసిన దనిన స్మృతివాక్యమును,

"సర్వత ఏవాత్మానం గోపాయత" యను శ్రుతివాక్యమును దుంగలలోఁ ద్రొక్కి వారి సేవచేయుచుంటిఁగదా. ఏమి నా తెలివి? ఆడలేక మద్దెలవాని పైపడి మొత్తుకొన్న బోగము దానివలె నా తప్పునేను దెలిసికొనక దేవుని దూషించి భార్యను బిడ్డలను దూషించి మఱింత పాపమునకుఁ బాలుపడుచున్నాను. నాకు సుఖము దుఃఖము కలిగించునది నామనస్సు తప్ప మఱియెవ్వరుకారు. అంతటిశక్తి యెవ్వరికిని లేదు. నేను మనసారఁ జేసిన పుణ్యపాపములేకదా నా సుఖదుఃఖములకుఁ గారణములు. నేను బుణ్యముచేసిన నది కాదని దేవుఁడు నాకుఁ గష్టములు కలిగించునా? కర్మమునఁ బుట్టితిని. కర్మమున బ్రతుకు చున్నాను. కర్మమునఁ జత్తును. వాస్తవ మిటుండ నేను దేవుని వృథా దూషింపనేల? ఇఁక భార్యచేసిన దోషమేమి? నా కది శత్రువా? నా సంతోషసుఖములకై నేనే దానిని దుడ్డిచ్చి తెచ్చుకొంటిని గాని దానినే సుఖపెట్టవలయుననియా పెండ్లాడితిని? అది బాగుండిన నాకు సుఖము, సంతోషము, కావున దానికి మంచిగుడ్డ కూడు వెట్టితిని. అవియైన నూరకపెట్టితినా? ఎంతకష్టము చేయించుచుంటిని? గృహకార్య నిర్వహణము సులభకార్యమా? సుతులులేకున్న గతులులేవు. సతులులేకున్న సుతులులేరు. ఇట్లిహపరముల గతులు కల్పించు సతుల దూఱువారు పాపరతులేకదా. వాస్తవము విచారించుకొలఁది పరులకష్టములకు నాకష్టములకు నేనే కారణభూతుఁడను. ఈ కష్టములు నిశ్శేషముగ నెట్లు తొలఁగునాయని యిట్లు విషాద పడుటయే నిర్వేదము. ఈ విషాదము సత్యమై యుండవలయును. పరులకు శోకముకలిగినపుడు విచారింపఁబోవు చుట్టములవలె దొంగయేడ్పు లేడ్చినఁ బ్రయోజనము

లేదు. ఇది స్థిరమై మనస్సున నిలుకడగొని యుండవలయును. స్త్రీలకుఁ బురుషులకు నొక్కొక్క సమయంబున నిట్టి నిర్వేదము కలుగును. దానికే పురాణవైరాగ్యము, శ్మశానవైరాగ్యము, ప్రసూతివైరాగ్యమని పేరు. ఇట్టి క్షణభంగుర వైరాగ్యనటనములు నిష్ప్రయోజనములు.

రెండవనిదర్శనము సాధుసహవాసము. మూఁడవనిదర్శనము పాపభీతి. పుణ్యప్రీతి, నాలుగవనిదర్శనము మాతాపితృ గురుదేవతాభక్తి.

ఇప్పుడు నిజమైన భక్తి యుదయించినవాని గుఱించియే మనము విచారింతము.

వీఁడు నిండుమనస్సు నిర్మలమనస్సు గలవాఁడై యుండవలయును. అనఁగా వినయము–శ్రద్ధ–భక్తి–శాంతి–శమములోనైన మంచిగుణములు కలవాఁడై యుండవలయును.

వినయము. వినయములేనివాఁడు చెడిపోవును. వినయముగలవాఁడన్నిట బాగుపడును. అభ్యుదయ చిహ్నము వినయము. అవినయ మహంకారచిహ్నము. అహంకారము గలవాని కేమిచెప్పియు ఫలములేదు. కావుననే శ్రుతి “తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం తస్మై సవిద్వా నుపపన్నాయ సమ్యక్ । ప్రశాంతచిత్తాయ శమాన్వితాయ యేనాక్షరం పురుషం వేద సత్యం । ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్.”

మీఁద వివరించినట్టు భక్తిజ్ఞానము లుదయించినవాఁడు వానినిగుఱించి తెలిసికొన గురువునొద్దకు సమిధలు చేతఁబట్టు కొని వేదజ్ఞానము గలవాఁడుగను, బ్రహ్మవిద్యయందు నిష్ఠగలవాఁడుగ నునుండు గురువునొద్దకుఁ బోవలయును. అట్టివిద్వాంసుఁడు (జ్ఞాని) చక్కని నడవడిక గలిగి వినయసంపన్నుఁడై తన్నాశ్రయించినట్టియు,

మిక్కిలి శాంతచిత్తుఁడైనట్టియు శమముతోఁగూడినట్టియు శిష్యునకు నతఁడు దేనిచేత నక్షరుఁడైన పురుషుని దెలిసికొనునో యట్టి బ్రహ్మవిద్యను సతత్త్వముగఁ జెప్పవలయును అని చెప్పుచున్నది. పూర్వకాలమున శిష్యులు గురువులయొద్దకుఁ బోవునపుడు సమిధలు మోసికొని పోవువారు. కట్టెలు మోయుటకంటె నీచత్వమేదిగలదు? కావున, నిది వినయమును దెలుపును. తండ్రిచేఁ బంపఁబడి శుకుఁడు జ్ఞానోపదేశార్థమై జనకునియొద్దకుఁ బోయెను. అప్పుడు జనకుఁడు నీవెవ్వఁడవని యడిగెను. నేను శుకుఁడను. జ్ఞానోపదేశమునకై మీయొద్దకుఁ దండ్రి పంపున వచ్చితిననెను. నేను జచ్చిన తరువాత రమ్మని జనకుఁడు కోపించి పలికి పంపెను. మఱునాఁడు నట్లే యయ్యెను. శుకునకేమియు బోధపడినది గాదు. తాను జచ్చిన తరువాత రమ్మనుచున్నాఁడే. చచ్చిన పిమ్మటఁ దానేమి నాకుఁజెప్పఁగలఁడని యాలోచించుచు వాకిట నిలఁబడి విచారపడుచుండెను. అప్పు డచ్చటనుండిన దాసి యాయన స్థితికిఁ బరితపించి 'యయ్యా! యాయన చచ్చిన తరువాత నిన్ను రమ్మని వారి యభిప్రాయముగాదు. నేను శుకుఁడనని నీవు పలికితివి. అహంకారము నిన్ను వదలినది కాదు. కావున 'నేను' అనుభావము నీ యందు మరణించిన తరువాత రమ్మని భావము. ఱేపు వచ్చిన "వీనిని శుకుఁడని లోకులందురు" అని ప్రత్యుత్తరమిమ్మని బోధించెను. శుకుఁడు దాని తత్త్వము గ్రహించి మఱుసటినాఁడట్లే ప్రత్యుత్తరమిచ్చెను. వెంటనే జనకుఁడు మహాయోగియగు శుకునకుఁ బ్రదక్షిణ నమస్కారము లాచరించి యాయనకు వలసినది నేర్పి పంపెను. కావుననే శంకరాచార్యులవారును వాదము నిమిత్తమై అహం బ్రహ్మాస్మియనిన యవినయమును క్షమింపుమని "అవినయ మపనయ విష్ణో" యని విష్ణుస్తుతియందు భగవంతుని స్తుతించెను. కావున, శిష్యులందు వినయ మావశ్యకము.

శ్రద్ధయనఁగా విశ్వాసము నమ్మకము. శాస్త్రవాక్యము నందు గురువాక్యమునందునమ్మిక. ఇది లేనివాఁడు చెడిపోవును గనుక నిట్టివానిని శిష్యునిఁగాఁ జేర్చుకొనరాదు. "అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి" అజ్ఞుఁడు, శ్రద్ధలేని వాఁడు, సందేహము గలవాఁడు, చెడిపోవునని శ్రీకృష్ణుఁడు చెప్పెను. భక్తివిషయము తెలియనివాఁడును దానివలన మోక్షము గలదని నమ్మకము లేనివాఁడును, కలుగునో కలుగదో యని సందేహించువాఁడును దప్పకచెడును.

**శ్లో. నైవ వాచా న మనసా, ప్రాప్తుం శక్యో న చక్షుషా ।**
**అస్తీతి బ్రువతోఽన్యత్ర, కథం తదుపలభ్యతే ॥**
**అస్తీత్యేవోపలబ్ధవ్య, స్తత్త్వభావేన చోభయోః ।**
**అస్తీత్యేవోపలబ్ధస్య, తత్త్వభావః ప్రసీదతి ॥ కఠోపనిషత్తు**

అని యాస్తికబుద్ధి శ్రద్ధగలవానికే యాత్మసాక్షాత్కారము, భగవత్కటాక్షము కలుగును

భక్తి - భక్తిలేనివాఁ డిందును నందును జెడినవాఁడే. ఇట్టి వాఁ డుపదేశమున కర్హుఁడు గాఁడు.

**శ్లో. యస్య దేవే పరా భక్తి, ర్యథా దేవే తథా గురౌ ।**
**తస్యైతే కథితా హ్యర్థాః, ప్రకాశంతే మహాత్మనః ॥**
**- శ్వేతాశ్వతరోపనిషత్తు**

ఏవానికి దేవునియందుఁ బరభక్తి గలదో, దేవునియం దెట్టి భక్తిగలదో యట్టి భక్తి గురువునం దెవనికిఁ గలదో యట్టి మహాత్మునకే యిందుఁ జెప్పఁబడిన విషయములు ప్రకాశించును అని యర్థము. కావున భక్తిహీనున కుపదేశించుట కృతఘ్నునకుఁ జేసిన మేలువంటిది.

**శ్లో. స ఏ వాయం మయా తేద్య, యోగః ప్రోక్తః పురాతనః**
**భక్తో ఽసి మే సఖా చేతి, రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ 4-3**
**ఇదంతే నాతపస్కాయ, నాభక్తాయ కదాచన**
**న చాశుశ్రూషవే వాచ్యం, న చ మాం యోఽభ్యసూయతి ॥**
**భగవ. 18**

ముందు నేను జెప్పియుండిన యీ యుత్తమ యోగమునే యది రహస్యమైనను నీవు సఖుఁడవు భక్తుఁడవు కావున నీ కిప్పుడు చెప్పితిని. దీనిని నీవు తపస్సు చేయనివానికిని, భక్తుఁడు కాని వానికిని, శుశ్రూష చేయనివానికిని, నవతారమూర్తియగు నా యం దసూయ గలవానికిని జెప్పఁగూడదు అని కృష్ణుఁడు చెప్పెను.

మఱియు శిష్యుఁడు శాంతుఁడై యుండవలయును. కామక్రోధాదులచేఁ బీడింపఁబడుచుఁ జంచలచిత్తుఁడై వ్యాకులుఁడై యుండరాదు. నిలుకడగా నిలిచిన నీళ్లయందుఁ బ్రతిబింబము దోఁచునుగాని కదలుచుండు నీళ్లయందుఁ బ్రతిఫలించిన బింబము కానరాదు గదా. అట్టులే వ్యాకులచిత్తునకుఁ జెప్పిన సద్విషయము మనస్సున నిలుకడగొనదు.

మఱియు శమము గలవాఁడై యుండవలయును. అనఁగా నింద్రియ నిగ్రహము గలవాఁడై యుండవలయునుగాని, యింద్రియదాసుఁడై యుండరాదు. ఆహారవిహార నిద్రాదులందు శాస్త్రనియతిని బాటింపవలయును గాని శిష్యుఁడు తన యిష్టముచొప్పున వర్తింపరాదు.

**శ్లో. ఈశ్వరస్య చ సౌహార్దం, యదృచ్ఛా సుకృతం తథా**
**విష్ణోః కటాక్ష మద్వేష, మాభిముఖ్యం చ సాత్త్వికైః**
**సంభాషణం షడేతాని, హ్యాచార్యప్రాప్తిహేతవః ॥**

1. త్రికరణశుద్ధిగా సత్కార్యములను జేయుటచే లభించిన యంతర్యామియైన యీశ్వరుని యనుగ్రహము
2. ప్రతిఫలాపేక్ష లేక యున్నట్టుండి తటాలునఁ జేసిన పుణ్యము.
3. విష్ణుమూర్తి కరుణాకటాక్షము
4. విష్ణువును ద్వేషింపకుండుట
5. ఆయన కభిముఖుఁడై యన్నికార్యము లాయనకుఁ బ్రీతిగఁజేయుట
6. సజ్జనులతోడ సంభాషించుట యను నీ యాఱును నాచార్యుఁడు లభించుటకుఁ గారణములు.

కావున సద్గురువు లభింపఁగోరు వాఁడీ యాఱుగుణములు గలవాఁడై యుండవలయును.

**శ్లో. ఊషరే నివాపే ద్బీజం, షండే కన్యాం ప్రయోజయేత్**
**సృజే ద్వా వానరే మాలాం, నాపాత్రే శాస్త్ర ముత్సృజేత్ ॥**

చవిటినేలను విత్తనములు చల్లినఁ జల్లనీ, నపుంసకునకుఁ గన్య నిచ్చిన నియ్యనీ, క్రోఁతిమెడను బూలసరమును వేసిన వేయనీ, యోగ్యతలేనివానికి శాస్త్రవిషయము చెప్పరాదు. కావున, శిష్యుఁడుగాఁ గోరువాఁడు మీఁద వివరించిన గుణములు సంపాదించుకొని యోగ్యుఁడుగా నుండవలయును.

**సద్గురువు**

కోటానఁగోట్లు జన్మములెత్తి మరణించి పుట్టి పుట్టి చచ్చి చచ్చి నరకమునకును భూమికిని, స్వర్గమునకును భూమికిని నడుమఁ జుట్లఁ బెట్టిపెట్టి విసిఁగి తుదకు నీ జనన మరణ బాధలకుఁ గారణమైన సంసారమార్గమును రోసి విచార పీడితుఁడై దీనినుండి తప్పించుకొని పోయి సుఖపడు టెట్టులాయని యాలోచించుచుఁ సద్గ్రంథములఁ జదివి

సదాచార సంపన్నుఁడై సాధుసాంగత్యమునఁ గాని కడదేఱనని నిశ్చయించుకొని సజ్జన సాంగత్యమునకు యోగ్యమైన గుణముల సంపాదించుకొనినవాఁడు. సద్గురువు నాశ్రయింప వలెనని

**"పరీక్ష్య లోకాన్ కర్మచితాన్, బ్రాహ్మణో నిర్వేదమాయా న్నా స్త్యకృతః కృతేన, తద్విజ్ఞానార్థం స గురు మే వాభిగచ్ఛేత్."**

శ్రుతి బోధించుచున్నది.

గురువుతోడ నేమిపని? శాస్త్రములు చదివినఁ జాలదా? అందున్నవే కదా గురువు చెప్పునని మీరడుగవచ్చును.

అన్నలారా! అక్కలారా! మీరీలోకమునఁ బరలోకమునఁ జెడుట బాగుపడుట మీ గురువుల చేతిలోనున్నది. సద్గురువును సంపాదించుకొంటిరా రెండులోకముల బాగుపడుదురు. అనాచారుఁడు, దురాచారుఁడు, జారుఁడు, చోరుఁడు, వంచకుఁడు, కుక్షింభరుఁడు, కామదాసుఁడు, క్రోధదాసుఁడు, ధనాపేక్షగలవాఁడు, కల్లు, సారాయి, గంజాయి త్రాగువాఁడు, మాంసాది తామసాహారముల భుజించువాఁడు, నీచజాతివాఁడు, బంగారు దొంగిలించుట లోనగు పంచమహాపాతకములఁ జేయువాఁడు, ఇంద్రియలోలుఁడు, శాస్త్రజ్ఞానహీనుఁడు, శిష్యవాత్సల్యము లేనివాఁడు, స్వప్రయోజన ధురంధరుఁడునగు వాఁడు మీకు గురువాయెనా మీరీలోకమునందే కాదు, ఈ జన్మమందే కాదు, పరలోకమందు రాఁగల జన్మములందుఁ గూడఁ జెడుదురు. కావున 1) గురువు ఆవశ్యకమా? 2) సద్గురు లక్షణము 3) గురుబోధము నను నీ మూఁడు విషయంబులు తమ శ్రేయస్సు గోరువారందఱుఁ దెలిసికొనుట ముఖ్యము ఈ విషయమున మీరు ప్రమాద పడకుందురుగాక.

శాస్త్రములఁ జదివి మనము ముక్తి సంపాదింపఁగలమా? యను విషయ మాలోచింతము. మనుష్యుల చిత్తవృత్తులు భిన్నములు.

ముక్తిమార్గము లనేకములు. శాస్త్రములు పరస్పర విరుద్ధములు పెక్కులు. ఆయువల్పము. విఘ్నములు మెండు. యముఁడు నిర్దయుఁడు. కాలము మనస్సున కన్న వేగము గలది. మనుష్యుఁడు పరతంత్రుఁడు. ఇట్లగుటచే మనుష్యుఁ డెట్లు స్వతంత్రించి శాస్త్రజ్ఞానము సంపాదించి సంసారమునుండి తరింపఁగలఁడు? దేహము ప్రకృతి పరిణామము. మంటివంటిది ప్రకృతి. కుండవంటిది దేహము. ప్రకృతి త్రిగుణాత్మకము అనఁగా సత్త్వరజస్తమస్సులను గుణములుకలది. ఈ మూఁటికి లోఁపడి మనస్సు పరిపరివిధములఁ బోవుచుండును. ఒకసారి యోగము కోరిన నొకసారి భోగమును గోరును. పర్యవసానమున రోగము వచ్చును. ఇఁక ముక్తిమార్గములందు కర్మయోగ మని, జ్ఞానయోగమని, భక్తియోగమని, ప్రపత్తియని యింకను భక్తి ప్రాశస్త్యమునఁ జెప్పినట్టు లనేకములు గలవు. ఇఁక శాస్త్రము లా కొన్ని కర్మయోగమును బొగడును. కొన్ని "జ్ఞానమే ముక్తి నిచ్చును. కర్మము వ్యర్థమగును. కొన్ని కర్మజ్ఞానములు రెండును వ్యర్థములే ముక్తి నియ్యఁగలది భక్తి యొక్కటే" యనును. ఈ కాలమున భక్తికూడ నందఱకు సాధ్యముగాదు కావునఁ ప్రపత్తియే గతియని కొన్ని యనును. శాస్త్రములఁ జదువువాఁడు సత్యమిదియని యెట్లు నిర్ధారించుకొనఁగలఁడు? చదువువాని ప్రకృతి గుణము ననుసరించి శాస్త్రార్థము తోఁచుచుండును. ఒక్క శాస్త్రవాక్యమునకే సాత్త్వికుఁడొక యర్థము చెప్పును. రాజసుఁడు వేఱొక యర్థమును జెప్పును. తామసుఁడు రెండుగా దని మఱియొక యర్థము చెప్పును. ఇది మనకుఁ బ్రత్యక్షానుభవసిద్ధమే. ఎట్లన : "మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు" అని భగవద్గీతయందుఁగల శ్రీకృష్ణవాక్యమునకు మద్యాజీ భవ యనఁగా నన్నుఁ బూజించువాఁడవగుమని సాత్త్వికులర్థము చెప్పఁగాఁ గ్రూరమృగములవలె మాంసభక్షణము చేయు తామసులు సారాయము మేఁకమాంసము ముందుగాఁ దెచ్చిపెట్టి నమస్కరింపుమని చెప్పినట్టు లర్థము చెప్పుదురు.

ఇంతకంటె ననర్థము కలదా? మాంసభక్షకులు త్రాగుఁ బోతులు దీని నామోదింతురు.

కావుననే శాస్త్రములే

**శ్లో. అభక్తానా మనర్హాణాం, సచ్ఛాస్త్రం శ్రూయతే ఽపి వా ।**
**అన్యథా ప్రతిభా త్యేవ, విషాక్తానాం యథా పయః ॥**

**శ్లో. తామసానాం విమూఢానాం, పతితానాం భవార్ణవే ।**
**విపరీతం చ సకలం, ధర్మజ్ఞానం ప్రకాశతే ॥**

భక్తులు గానివారు నయోగ్యులు సచ్ఛాస్త్రములు వినినను విషము తలకెక్కినవానికిఁ బాలవలె వానికి నది విపరీతఫలము నిచ్చును. తమోగుణము గలవారికి, మూఢులైనవారికి, సంసారసముద్రమునఁ బడి మునుఁగుచుఁ దేలుచు నుండువారికి ధర్మవిషయమైన జ్ఞానమంతయు విపరీతముగఁ ప్రకాశించును అని చెప్పుచున్నవి. గోపికాకృష్ణలీల మోక్షగ్రంథమని భక్తులను చుండ అంకుపురాణమని తామసు లనుట కిదే కారణము. నిర్మలమైన యద్ధము మన ముఖమున్న దున్నట్లు కానఁజేయును గాని వికారముల సవరించి సుందరముగ నుండునట్లు కనిపింపఁ జేయఁగలదా?

అట్లైనచో రాజసతామసులకు గురువులు కావలసియుండునుగాని సాత్త్వికులకు శాస్త్రార్థ మున్నదున్నట్టు ప్రకాశించును గదా వారికేల గురువందురేమో. శాస్త్రములు మార్గదర్శకములేకాని యనుభవ బోధకములుగావు. ఎట్లందురా ధూమశకట మార్గబోధిని యిక్కడనుండి కాశికిఁ బోవుమార్గమును దెలుపునుగాని త్రోవలో బాటసారులకుఁ గలుగు కష్టసుఖాను భవములనెల్ల వ్రాయునా? వ్రాయవలయుననినను సాధ్యపడదు. కాశికిఁ బోయివచ్చినవారి యనుభవములఁ బ్రశ్నించితిమేని యొక్కొక్కఁ డొక్కొక్క విధముగఁ దెలుపును. ఏదని వ్రాయను? ఎన్నని

వ్రాయను? అట్టులే శాస్త్రములు మార్గములను సూచించునేకాని సాధనదశయందు సాధకునకుఁ గలుగు నానానుభవముల వ్రాయవు. ఆ త్రోవ నడచునపుడు కలుగు నపాయములు వానిని దప్పించుకొను నుపాయములు నా మార్గమున నడచి పారము ముట్టిన యనుభవజ్ఞునకే యెఱుక కావున ననుభవజ్ఞుని సాహాయ్యము లేక కేవల శాస్త్రజ్ఞానము పర్యాప్తముగాదు. గురు వనుభవజ్ఞుఁడై యుండవలయు.

అదియునుగాక

ఆయు వల్పము. పూర్వయుగములందువలె నిపుడు వేలకొలఁది సంవత్సరములు మనుష్యుఁడు జీవింపఁడు. ఈ యల్పకాలమున సగము నిద్రయందుఁ బోవును. బాల్యమున 10–15 సంవత్సరములు పోవును. ఉదరపోషణార్థము కొంతపోవును. దారపుత్రాదులతోడి జంజాటామునఁ గొంతపోవును. రోగాది బాధలవలనఁ గొంతపోవును. సోమరితనము చేతను బ్రొద్దుపోని ముచ్చటల చేతను గొంతపోవును. వార్ధకమునఁ గొంత పోవును. ఇఁక నెంతమిగులునో యీమిగిలిన కాలములో నెన్ని శాస్త్రములు పురుషుఁడు చదువఁగలడో చదివి యేమి నిర్ధారింపఁ గలఁడో యోజింపుఁడు. నిర్ధారించుకొనినను సొంతముగ సాధింపఁ జాలినంత కాలము మిగులునా యాలోచింపుఁడు. కావున శాస్త్రము చదివి యనుభవజ్ఞుఁడైనవాఁడు మనకుఁ జిన్న ప్రాయమందే వాఁడెఱిఁగిన తత్త్వసారము నుపదేశించినచో మనకెంత కాలము కలసివచ్చునో యెంత శ్రమము దప్పునో యెన్ని యపాయములు తొలఁగునో యూహింపుఁడు. కాఁబట్టియే కదా

**"ఏ విద్యకైన గురువు లేకున్న నావిద్య పట్టుపడదు**
**కావునను నభ్యాసికి గురుశిక్ష కావలెను నారాయణ"**

యని పెద్దలు చెప్పిరి. శాస్త్రము లిట్లే చెప్పుచున్నవి.

**శ్లో. శాస్త్రజ్ఞానం బహుక్లేశం, బుద్ధే శ్చలనకారణమ్ ।**
**గురుం లబ్ధ్వా హరిం బుధ్వా, విరమే త్సర్వకర్మసు ॥**

శాస్త్రజ్ఞానము మిక్కిలి కష్టించి సంపాదింపదగినది. అది బుద్ధి చలించుటకు గారణమగును, కావున, గురువువలన హరిని దెలిసికొని తక్కిన యన్ని కార్యములు మానవలయును.

**శ్లో. చక్షుర్గమ్యం గురుం త్యక్త్వా, శాస్త్రగమ్యం తు యత్స్మరేత్ ।**
**హస్తస్థ ముదకం త్యక్త్వా, ఘనస్థ మభివాంఛతి ॥**

కనులకు గోచరించు గురువును విడనాడి శాస్త్రగమ్యుఁ డైన గురువును స్మరించువాఁడు చేతిలోనున్న నీటిని పాఱఁబోసి మబ్బులోని నీటి కాశ చేయువానివంటివాఁడు.

**శ్లో. నారాయణోఽపి వికృతిం, యాతి గురోః ప్రచ్యుతస్య దుర్బుద్ధేః**
**కమలం జలా దపేతం, శోషయతి రవి ర్న తోషయతి.**

గురువును విడిచిన దుర్బుద్ధిని జూచి నారాయణుఁడును విపరీతఫలము నిచ్చును. నీటిని విడిచిన కమలమును సూర్యుఁడెండించును గాని ప్రకాశింపఁ జేయఁడు గదా.

**శ్లో. న జన్మనో నాధ్యయనా, న్న యజ్ఞా న్నాపి చాశ్రమాత్ ।**
**న త్యాగా దాప్నుయాత్ బ్రహ్మ, గురూపసదనం వినా ॥**

గురూపదేశము లేకుండెనేని గొప్పకులమునందుఁ బుట్టుక, వేదాధ్యయనము, యజ్ఞము, సన్న్యాసాశ్రమము, త్యాగము, వీనివలన బ్రహ్మసాక్షాత్కారము గలుగదు.

సంసారమును దరింపఁగోరిన మనుష్యునకు గురువావశ్యక మని తెలిసికొంటిమి. గురువన నెవఁడు? వాఁడెట్టివాఁడై యుండవలయు ననుట విచారింతము. నాకు నాలుగు రూపాయలిమ్ము. ఉపదేశము

చేసెద ననువాఁడును, కోళ్లు, గ్రుడ్లు, పిల్లలు, సారాయిబుడ్లు, గంజాయి, నల్లమందు తెమ్ము ఉపదేశము చేసెదననువాఁడును, రాత్రివేళ నొంటిగ రమ్ము ఉపదేశించెదనని స్త్రీలకుఁ జెప్పువాఁడును, గురువు కాఁజాలఁడు. ఇట్టులే యేజాతిదియైనను స్త్రీ మంత్రముపదేశింప యోగ్యురాలుకాదు. స్త్రీకి భర్త, తండ్రి, మామ తగిన గురువులు. భర్త యుపదేశింప యోగ్యతగల వాఁడు గాఁడేని యాయన యనుమతిని మఱియొక యోగ్యుని గురువుగ స్వీకరింపవచ్చును. భగవద్విషయ మెవరివలననైన నెవరైన వినవచ్చును.

**శ్లో. 'గు' శబ్ద స్త్వంధకారాఖ్యో, 'రు' శబ్ద స్తన్నిరోధకః ।**
**అంధకారనిరోధిత్వా, 'ద్గురు' రి త్యభిధీయతే ॥**

గు అనఁగా నజ్ఞానాంధకారము. రు అనఁగా దానిని పోఁగొట్టువాఁడు అజ్ఞానాంధకారమును బోఁగొట్టువాఁడగుటచే వానికి గురువని పేరు. వీనినే యాచార్యుఁడందురు. ఏలన

**శ్లో. ఆచినోతి హి శాస్త్రార్థాన్, ఆచారే స్థాపయ త్యపి ।**
**స్వయ మాచరతే యస్మా, త్తస్మా దాచార్య ఉచ్యతే ॥**

శాస్త్రాధ్యయనముచేసి యందలి విషయము లెఱిఁగి యాప్రకారము శిష్యుల నాసదాచారమందు నిలిపి, యాసదాచారముల చొప్పునఁ దానును నడచువాఁ డెవ్వఁడో వానికాచార్యుఁడని పేరు. శిష్యవిత్తాపహారకులుగారు.

శిష్యునకు గురువాక్యము ప్రమాణము కాని శాస్త్ర జ్ఞానమనావశ్యకము. గురువునకు శాస్త్రజ్ఞానము అనుభవజ్ఞానము రెండు నుండవలయును. మఱియు గురు వెట్టివాఁడై యుండవలయునో వినుఁడు.

**శ్లో. యే సంతుష్టా శ్రుతోపేతా, స్సత్యార్జనదయాపరాః ।**
**జితేంద్రియా జితక్రోధా, స్తానుపాస్వ చ పృచ్ఛ చ ॥**

ఎప్పుడు తృప్తిగలవారును, బెద్దల సేవచేసి వారివలన శాస్త్రార్థముల నెఱిఁగినవారును, సత్యము, చక్కని నడవడి, దయ గలవారును, ఇంద్రియ జయముగలవారును, గోపమును జయించిన వారును నగు వారిసేవచేసి తత్త్వవిషయము ప్రశ్నింపుము అని శాస్త్రము చెప్పుచున్నది.

**శ్లో. భగవద్ధ్యానయోగోక్తి, వందనస్తుతికీర్తనైః**
**లబ్ధాత్మా, తద్గతప్రాణ, మనోబుద్ధీంద్రియక్రియః.**
**ఆచార్యో వేదసంపన్నో, విష్ణుభక్తో విమత్సరః.**
**మంత్రజ్ఞో మంత్రభక్త శ్చ, సదా మంత్రాశ్రయ శ్శుచిః**
**గురుభక్తిసమాయుక్తః, పురాణజ్ఞో విశేషతః.**
**ఏవం లక్షణసంపన్నో, గురు రి త్యభిధీయతే.**

భగవంతుని ధ్యానించుట, భగవద్యోగమందుండుట, భగవంతునివిషయమై మాటలాడుట, భగవంతుని నమస్కరించుట, యాయననే స్తుతించుట, యాయననే కీర్తించుట, వీనివలన నాత్మను బొందినవాఁడై (యీవిధముగ నాత్మసాక్షాత్కారము గలుగువఱకు గ్రుడ్డివానికి సూర్యునివలె వీనికి నాత్మయుండియు లేనట్టే) భగవంతునకు నర్పింపఁబడిన ప్రాణము – మనస్సు– బుద్ధి – యింద్రియవ్యాపారములు గలవాఁడై, విష్ణుభక్తుఁడై, మచ్చరము లేనివాఁడై, మంత్రార్థము నెఱిఁగినవాఁడై, మంత్రమందు భక్తిగలవాఁడై, యెల్లప్పుడు మంత్రము నాశ్రయించినవాఁడై, నిర్మలములయిన యంతరింద్రియం బాహ్యేంద్రియములు గలవాఁడై, గురుభక్తి గలవాఁడై, విశేషముగఁ బురాణజ్ఞానము గలవాఁ డెవ్వఁడో వానికి గురువనిపేరు. ఈ గుణములు గలవారు సద్గురువులు.

కుక్క గొడుగులవలె నిప్పుడు పల్లెపల్లెయందును గానవచ్చు గురువులను మాంసాహారము – సురాపానము – గంజాయిలోనైనవి యేశాస్త్రములు విధించుచున్నవని శిష్యులో మఱియెవ్వరో యడిగిరేని

బంగీభాయి శాస్త్రమం దున్నదని చెప్పుదురేమో. వేమనశతకమున ప్రసక్తిపద్యములు మల్లయ్యపదములు వృద్ధజారలుండఁగా వేదాంతమున కేమి కొఱఁత!! విస్సన్న చెప్పునది వేదము.

మీఁదఁజెప్పిన లక్షణములుగల గురువు మీకు గోచరించెనేని యతనిబరీక్షించి సద్గురువని తోఁచెనేని యట్టివానిని విడువక కష్టపడియైన నష్టపడియైన నతని నాశ్రయించి యతని మనస్సునకు ధర్మమార్గమున సంతోషముగలిగించి శ్రేయస్కరమార్గమెఱిఁగి బాగుపడవలయును. కేవల వేషభాషలఁజూచి మోసపోవలదు. గురువునొద్దకు రిత్తచేతుల విసవిసపోయి స్తంభమువలె నిలువరాదు. దేవగురురాజ సన్నిధికిని గర్భిణీస్త్రీలను బాలురను జూడఁబోవునపుడును రిత్తచేతులఁ బోరాదు. పండో కాయో యేదియో తీసికొని పోవలయును. పోయి యాయనముందుంచి యంగవస్త్రము నడుమునకుఁ జుట్టుకొని సాఁగిలఁబడి యాయన చాలింపుమనువఱకు నమస్కరింప వలయును. దేవునకు – గురువులకు సాష్టాంగముగ నమస్కరింప వలయును. తక్కినవారికి నుత్తనమస్కారము చాలును. దేవతా గురునమస్కారము చేయునపుడు పురుషు లూర్ధ్వకాయమును గప్పియుండరాదు. పాదుమొగములతో నుండరాదు. తలమీఁద గుడ్డలుండరాదు. గురువులయెదుటికిఁ బాదరక్షలు వేసికొని పోరాదు. తాంబూలము లోనైనవి నమలుచుఁ బోరాదు. నోటికంపుతోను బోరాదు. కూర్చుండుమని గురువు చెప్పువఱకుఁ గూర్చుండరాదు. వినయముతో బహువచనమున సంబోధింపవలయును. గురువునెదుటఁ బద్మాసనమునఁ గూర్చుండవలయునుగాని కాళ్లు బాఱఁజాఁచిగాని గొంతుగాని కాలిమీఁదఁ గాలువైచికొనికాని కూర్చుండరాదు.

**శ్లో. శుశ్రూషమాణ ఆచార్యం, సదోపాసీత నీచవత్ ।**
**యానశయ్యాసనస్థానై, ర్నాతిదూరే కృతాంజలిః ॥**

అన్నట్టులు శిష్యుఁడు గురువునకు నాలుగువిధముల నుపచారము చేయవచ్చును. గురువెక్కు వాహనమును, శయ్యను, ఆయన కూర్చుండు పీఁట మొదలగు నాసనమును, ఆయన యుండు స్థానమును (గృహము శుద్ధిపఱుచుట లోనైనవి) శిష్యుఁడు చేయఁదగు శుశ్రూషలు. గుర్వాజ్ఞలేక యాయనను దాఁకరాదు. ఆయన యాజ్ఞగొని పాదసేవ చేయునెడల మోఁకాళ్లకుమీఁదఁ దాఁకరాదు. ఇప్పుడు కొందఱుగురువులు ప్రాయపువిధవలచే నంగశుశ్రూషయని సేవలు చేయించుకొనుచు వారిచేతనే తలంటించుకొనుచు దేహము కాళ్లు తొడలు పిసికించుకొనుచున్నారు. ఈ విధవలకు ముప్పాతిక కాలము గురువులవారి గజ్జలయందే చేతులుండును. ఇంత కెక్కువ యేమిచెప్పవలయును? సదాచారసంపన్నుఁడై కామినీ దాసుఁడు గానిగురు విట్టి విధవాచేష్టల కెడమియ్యఁడు. మీఁదఁ జెప్పినవిధముగ శుశ్రూష చేసి దాసునివలె మిగుల దూరము మిగుల దాపు గానిచోటఁ గూర్చుండవలయును. ఎట్టి గురువుల కట్టి శిష్యులే లభింతురు.

**శ్లో. గురో శ్శయ్యాసనే యానం, పాదుకాంశుకపీఠకమ్ ।**
**స్నానోదకం తథా ఛాయాం, లంఘయే న్న కదాచన ॥**

గురువు పరుండు శయ్యను, గూర్చుండు నాసనమును, వాహనమును బావుకోళ్లను, వస్త్రమును, పీఁటను, స్నానజలమును, ఆయన నీడను శిష్యుఁడు దాఁటిపోరాదు.

**శ్లో. గురో రగ్రే పృథక్పూజా, మద్వైతం చ పరిత్యజేత్**
**దీక్షాం వ్యాఖ్యాం ప్రభుత్వాది, గురో రగ్రే వివర్జయేత్ ॥**

గురువునెదుట మఱియొకని బూజించుటను, యద్వైతమును, దీక్షను, గురువు చెప్పిన మాటమీఁద వ్యాఖ్యానమును, ప్రభుత్వ లక్షణములను వదలి పెట్టవలయును.

**శ్లో. గురుం ప్రకాశయే ద్ధీమాన్, మంత్రం యత్నేన గోపయేత్ ।**
**అప్రకాశప్రకాశాభ్యాం, క్షీయేతే సంపదాయుషీ ॥**

బుద్ధిమంతుఁడు గురువుపేరు బహిరంగముగఁ జెప్పవచ్చును. మంత్రమును వెలిపఱుపరాదు. గురువుపేరు దాఁచినను, మంత్రమును దాఁపకున్నను ఆయుస్సు సంపత్తు నశించును.

ఇట్లు పోయి కూర్చుండి గురువునానతిగొని తన మనస్సునఁగల విషయము విన్నవింపవలయును. పూర్వకాలమున నధమపక్షమున నొక సంవత్సరము శిష్యునిఁ బరీక్షించికాని యేదియు గురువులు దెలుపకుండిరి. కాలవైషమ్యమువలనను, నిప్పుడు మంచివిషయ మడుగువాఁడే దుర్లభుఁడు. కావునను నెవరికిని జెప్పకుండిన లోకము మిక్కిలి చెడునను తలంపుతోను సామాన్యశ్రద్ధాభక్తులు గలవారని తోఁచినయెడల గురువు లుపదేశించుచున్నారు. ధనాశ, కామము, గల దొంగగురువు లెట్టి వారికైనను జెప్పుదురు. వారికిఁ గావలసినది ధనమే కదా. అది లభించినఁ జాలును. శిష్యుఁడు చెడిననేమి బాగుపడిననేమి? తనకుఁ గావలసినవి తెచ్చియిచ్చువాఁడుగా నుండినఁజాలును.

వాస్తవముగ బాగుపడఁగోరినవాఁడు సద్గురువునుజేరి

**శ్లో. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**

సాష్టాంగ నమస్కారముచేతను, జక్కని ప్రశ్నలచేతను, సేవచేతనుజ్ఞానము నెఱుఁగుము. ఇట్లు సేవించితివేని తత్త్వదర్శనులైన జ్ఞానులు నీకు జ్ఞాన ముపదేశింతురని కృష్ణుఁడు చెప్పినట్లు చేసి బాగుపడవలయును. (తత్త్వము గుఱించి మఱియొకసారి ప్రశంసించెదను.) తత్త్వదర్శనులనుటచే దీర్ఘకాలాభ్యాసముచేఁ దత్త్వార్థమును సాక్షాత్కరింపఁజేసికొనినవారు ఇట్టివారు నేఁటి కాలమున శిష్యుని పూర్వపుణ్య విశేషంబునఁగాని లభింపరు.

**శ్లో. నారాయణో ऽ పి వికృతిం, యాతి గురోః ప్రచ్యుతస్య దుర్బుద్ధేః।**
**కమలం జలా దపేతం, శోషయతి రవి ర్న తోషయతి ॥**

గురువును విడనాడు దుర్బుద్ధివిషయమున, భగవంతుఁడును ప్రసన్నుఁడుగాఁడు. నీటినిబాసిన కమలమును సూర్యుఁ డెండించునేకాని వికసింపఁజేయునా? అట్టులని మోసపోయియో మాయమాటలచేతనో తొలుత వరించినగురువు దురాచారుఁడని వంచకుఁడని జ్ఞానహీనుఁడని నీచుఁడని యేర్పడినయెడల వానిని విసర్జింపవచ్చును. అట్టిగురువు తెలిసికాని తెలియక కాని పొగరుచేతఁగాని యిది కార్యమిది యకార్యమని యోజింపక శిష్యుఁడు శిష్యురాలు చేయరాని కార్యమును జేయుమని చెప్పెనేని యట్టిగురువును నావశ్యకమైనచో దండింపవలయును.

**శ్లో. గురో ర ప్యవలిప్తస్య, కార్యాకార్య మజానతా ।**
**ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్ ॥**

**- రామాయణము**

తన వ్రతమునకు భంగముగఁ బరశురాముఁడు చెప్పుట చేఁగదా భీష్ముఁ డాయనను జంపఁబూనెను. కావున, స్త్రీలుగాని పురుషులుగాని గురువాక్యమని శాస్త్రవిరుద్ధము – నీతిమతాచార విరుద్ధము – శీలవిరుద్ధము – లోకగర్హ్యము నిందాకరము శ్రేయోహానికరమునైనఁ బనిచేయరాదు. అట్టివి చెప్పువానిని గొట్టి తఱుమవలయును.

**శ్లో. పరీక్ష్య వివిధోపాయైః, కృపయా నిస్స్పృహో వదేత్**

నానోపాయములచేత శిష్యునిఁ బరీక్షించి కేవల దయచేఁ బ్రతిఫలాపేక్షలేక గురువు శిష్యునకు హిత ముపదేశించును. ఏలయనఁగా

**శ్లో. రాజ్ఞో రాష్ట్రకృతం పాపం, రాజపాపం పురోధసః ।**
**భర్తుః స్వస్త్రీకృతం పాపం, శిష్యపాపం గురో రపి ॥**

ప్రజలు చేసినపాపము రాజును, రాజు చేసిన పాపమాయన కాలోచన చెప్పువారిని, భార్యచేసిన పాపము దాని భర్తను, శిష్యుని పాపము గురువును బొందును. గురువు కోరలేదు గదా యని శిష్యుఁడు గురువును గౌరవింపక యుండరాదు. శక్తికొలఁది బహుమానింపవలయును. సకల కష్టములకుఁ గారణమైన జన్మమునుండి తరించు మార్గముపదేశించు గురువునకు నెంత యిచ్చినను హెచ్చుగాదు. ఏమి యిచ్చి యాయన ఋణమునతఁడు దీర్చుకోఁగలఁడు. అటులని శక్తికిమించి యియ్యవలసిన పనిలేదు. ఇంతయేల గురువు శిష్యుని నడుగరాదు. గురువడుగ లేదుగదా యని శిష్యుఁడేమియు నీయక లోభియై యూరకుండనురాదు.

ఒక యక్షరమైనను గురువుచే నుపదేశముఁ బొందినవాఁ డేమిచ్చియు నా గురువుఋణము తీర్చుకోలేఁడు.

**శ్లో. ఏక మ ప్యక్షరం య స్తు, గురు శ్శిష్యే నివేదయేత్ ।**
**పృథివ్యాం నాస్తి తద్ద్రవ్యం, యద్దత్త్వా చానృణీ భవేత్ ॥**

కామియై యది తెమ్మిది తెమ్మని శిష్యుని బీడించు గురువు గురువు కాఁడు. లోభియై గురువున కేమియు నియ్యని శిష్యుఁడు శిష్యుఁడు కాఁడు.

ఒకఁ డెట్టివాఁడో కనుఁగొనుటకు మనువాక్యమే ప్రమాణము.

**శ్లో. తమసో లక్షణం కామో, రజస స్త్వర్థ ఉచ్యతే ।**
**సత్త్వస్య లక్షణం ధర్మః, శ్రేష్ఠ మేషాం యథోత్తరమ్ ॥**

కామము తమస్సునకు గుర్తు. ధనకాంక్ష రజోగుణ లక్షణము. ధర్మబుద్ధి సత్త్వలక్షణము. వీనిలో మొదటిదానికంటె రెండవది. రెండవదానికంటె మూఁడవది శ్రేష్ఠము.

గురువు సత్త్వగుణము కలవాఁడై యుండవలయును గావున నర్థకామా సక్తిగలవారిని గురువులుగా గ్రహింపరాదు.

**శ్లో. వేదాభ్యాస స్తపో జ్ఞానం, శౌచ మింద్రియనిగ్రహః ।**
**ధర్మక్రియాత్మచింతా చ, సాత్త్వికం గుణలక్షణమ్ ॥**

వేదాభ్యాసము, తపస్సు, జ్ఞానము, శౌచము, ఇంద్రియనిగ్రహము, ధర్మకార్యములు చేయుట, ఆత్మచింత ఇవి సత్త్వగుణముగలవారి లక్షణములు ఆత్మవిద్యతప్ప మఱియేవిద్యకైనను శిల్పమునకైనను, గళలకైనను గురువు నీతి మతాచారదూరుఁడుగ నుండినను, వాని దోషములు శిష్యుని బాధింపఁజాలవు. ఆత్మవిద్య యందట్లుగాదు. మనోబలముచేతను స్పర్శబలముచేతను శిష్యుని యందుఁగల రజస్తమస్సుల నణంచి సత్త్వమును వృద్ధి పఱుచుశక్తిగలవాఁడై గురువుండవలయును. స్పర్శముచేఁగదా శ్రీకృష్ణుఁడు గోపికలందుఁగల రజోగుణమునణంచి భక్తురాండ్రఁ జేసెను. స్పర్శచేఁగదా రామకృష్ణ పరమహంస వివేకానంద స్వామిని సత్త్వగుణ యుక్తునిఁజేసెను. రామకృష్ణ పరమహంస తన పాదములను నిరువురు స్త్రీల ఱొమ్ములపైనుంచి వారిని జక్కఁ బఱచెనని యాయన చరిత్రము తెలుపుచున్నది. ఇట్టి శక్తి గురువునందున్నఁగదా యాశక్తిని శిష్యునందుఁ బ్రవేశపెట్టఁ గలఁడు. ఇట్టి శక్తి కామక్రోధ దాసులు, నభోజ్యభోజులు, అపేయపాయులు దురాచారులు దుశ్చరితులు వంచకులు లోనగు నీచులయందు నిస్సందేహముగ నుండఁజాలదు. అక్రోధనులు, నిష్కాములు, సాత్త్వికాహారులు, మితాహారులు, సదాచారసంపన్నులు, యోగులు, భక్తులు నగు వారియందు మాత్రమే యుదియుండును. కామక్రోధాదులుగల వారియందు దుష్టమైన రజస్తమశ్శక్తులుండును. అట్టివారి నాశ్రయించుటవలన నా గుణములు శక్తులు మనయందుఁ బ్రవేశించి మనల మఱింత చెఱుచును. సజ్జనుఁడు సజ్జనుఁడు చేరుట

చందనము పచ్చకర్పూరము చేరుటవంటిది. దుర్జనుఁడు దుర్జనుఁడు చేరుట బంగాకు ఉమ్మెత్త చేరుటవంటిది.

సోదరీరత్నములారా! సోదరులారా! నాయందు మీకుఁ గల ప్రీతి విశ్వాసములు, మీరు నా కొసంగిన చనవు మీకు మంచిమాటలు నాలుగు చెప్పఁ బ్రేరించెను. తనతోడఁ జేరిన వారిని రక్షించువాఁడు మిత్రుఁడు. పూర్వజన్మమున మనము తల్లిదోడులుగా నుంటిమో యేమో 'ఆ స్నేహమనునది యీ జన్మముననుు మనల నేదోయొక కారణముగ నొకచోఁ జేర్చుట చేత మీలోఁ గొందఱు తెలియనితనముచేతను, గొందఱు వంచకుల జెడనుండుటఁ జూచి జాలిగొని మీ క్షేమముఁగోరి మీరు హెచ్చరికకలిగి వర్తింపఁ గొన్ని మాటలు చెప్పితిని. మోసగాండ్ర తీపుమాటలకు లోపడి చెడుటకంటె నజ్ఞానమున నున్న చోటనే యుండుట మేలు. ఇట్టి మిమ్ము నేను మేలుకొలుప సాహసించితి. నిద్దురనుండిలేచి మెలకువ తెచ్చుకొని కన్నులు తుడుచుకొని ఱెప్పలు చక్కఁగ విచ్చి నలుదిక్కులు పాఱఁజూచి లేచి నడువ నారంభింపుఁడు. కాని, కొఱనిద్రలో నాదర బాదరలేచి యఱమూఁత కన్నులతోఁ దడఁబడు కాళ్లతో నిద్దురమబ్బుతో విసవిసనడచి గుంజగోడ తలకుఁ గొట్టుకొను చుండఁబోయి యే గుంతలోనో బావిలోనో పడకుఁడు. తిక్క తెలిసినది తలకు రోఁకలి చుట్టుఁడను వారివలెఁగాక వాస్తవముగ బాగుపడు కోరికగలదేని విజ్ఞులని ప్రసిద్ధిగాంచిన పెద్దలవలన మంచి చెడ్డ తెలిసికొని సజ్జన సావాసముచేసి వారి మూలమునఁ దగిన గురువును సంపాదించుకొని తరణోపాయమెటిఁగి బాగుపడుఁడు. ఈనాఁడు మీ గ్రామమునకు వచ్చి ఱే పెచ్చట నుండునది తెలియనివారిని యాత్రోవనవచ్చి యాత్రోవఁ బోవువారిని గులము, శీలము, సంశ్రయము ముందుగాఁ దెలియనివారిని నాశ్రయింపకుఁడు. నిజముగ జ్ఞాని, భక్తుఁడు, యోగియైనవాఁడు తన మహిమలఁ జూపియైన మిమ్ము

వశపఱచుకొనునంతటి దురవస్థయం దుండఁడు. మీ యనుగ్రహముతోడ వానికిఁ బనిలేదు. ఎక్కువగ నాశించిన నింతకూడాశించును. మీరై దినములకొలఁది ప్రార్థించిన యెడల మీ నడవడి చక్కనిదని తోఁచిన నెంత చెప్పవచ్చునో యంత యోగ్యతానుసారముగఁ జెప్పును. దుష్టాహారము – దురభ్యాసము – దురాచారము దుశ్చేష్టలు గలవాని నెన్నఁడు నమ్మవలదు! మీకు విననిష్టముగలదేని మీకు హితముపథ్యమునైనవి యప్పుడప్పుడు చెప్పుదును. బాగుపడఁ గోరిక కలవారు బాగుపడవచ్చును– "పొండొల్లనివారు కర్మపుంజముపాలై" తల్లులారా! ముఖ్యముగ మీకొక్క విషయము చెప్పవలసియున్నది. నేనిట్లు చెప్పితినని యన్యథా తలఁపవలదు. ఎవనిని జూడఁగానే వానియందు మీకుఁ బితృగౌరవము కలుగదో, యెవఁడు మిమ్ము తల్లీయని యమ్మాయని ప్రీతిపూర్వకముగఁ బిలువఁడో గౌరవింపఁడో యెవని నేత్రములందు ముఖమునందు దేహమందు మిమ్ముఁ జూచినంత వికారములు గలుగునో యట్టి వానిని వాఁ డెన్ని మహిమలు కనఁబఱిచినను, ఎన్ని రుద్రాక్షమాలలు తులసిపూసల నరములు ధరించినను, నెంత పూజాపరుఁడైనను గురువుగ గ్రహింపవలదు. వానియందు మీకు మాతృభావము, మీయందు వానికి మాతృభావ ముండిననే గురువుగ గ్రహింపుఁడు. మగవానియందుఁ బితృభావమనక మాతృభావ మంటివేమని యందురేమో. స్త్రీలు తమ కన్నతల్లులయెదుట వర్తించినట్లు తండ్రులయెదుట వర్తింతురా? మనస్సు విచ్చి తల్లితోఁ జెప్పు రహస్యములు తండ్రితోఁ జెప్పుదురా? కావునఁ దండ్రికంటె స్త్రీలకుఁ దల్లియే యెక్కువ విశ్వాసపాత్రురాలు. అంతటి విశ్వాసము భక్తి గురువునం దుండవలయును. అంతటి వాత్సల్యము గురువున కుండవలయును. కామాదివికారముల కేమాత్ర మెడముండరాదు. ఇది శిష్యురాండ్రుగ నుండఁగోరు నందఱు గమనింపవలసిన విషయమే యైనను ముఖ్యముగ యోగ మభ్యసింపఁ

గోరువా రెక్కువగ గమనింపవలయును. అహోబలమందు మాలదాసరులు దివిటీలచే దేహమును గాల్చుకొందురు. మండెడు నినుపగొలుసులను జేతులతో దూయుదురు. ఒకఁడు యోగినని కొండమాచు పల్లెకుఁబోయి నీటిమీఁద 5 నిమిషములు పండుకొనఁగా నాయూర నొకబాలుఁడు గంటసేపు పరుండెననియు నా రాత్రికే యా యోగిమాయమై పోయెననియు వింటిని. చాగంటివారి పాళెములో నూరబావికి స్నానమునకుఁ బోయినపుడు 8–9 సంవత్సరముల వయస్సుగల బాలు రొడ్డుమీఁదనుండి నీళ్లలో దూఁకి 5–6 నిమిషములు నీళ్లలోనే యుండఁగంటిని. నాయని పేఁటలో నీళ్లమీఁద నామిత్రుఁ డొకఁడు పండుకొనఁగలఁడు బాగుగ నీఁదువాఁ డెవఁడైన పండుకోఁగలఁడు. గంగానదిలో నీటిదొంగలు నీళ్లలోనేయుండి స్నానానికిదిగిన యాత్రికులను లోపలి కీడ్చుకొనిపోయి సొమ్ములను దీసికొని దూరపు రేవునకుఁ బోదురని వింటిని. ఇది యోగమహిమ గాదు. ఒకఁడు నాకు 400 సంవత్సరముల వయస్సు తపోబలముచే యౌవన పురుషునివలె నున్నాననును. 400 సంవత్సరముల నాఁటివాఁడు సాక్ష్యముచెప్ప మఱియొకఁడు దొరకినఁగదా వీని నమ్మవలయును. 400 ఏల? 1000 అనిన నెవరువలదనుదురు. ఒక కమసాలి నేను బదరికాశ్రమములో 12 సంవత్సరములు తపస్సుచేసి వచ్చుచున్నాను. ఆ తపోబలముచే 80 ఏండ్లవాఁడను 30 ఏండ్లవానివలె నున్నాననెను. బదరికాశ్రమ మేమూల నున్నదో తపమనఁగా నెట్టిదో యీ మోసఁగాఁ డెఱుఁ గఁడు. తల్లులారా! తండ్రులారా యిట్టి వంచకుల మాటల విని బేలుపోకుఁడు వీరు మిమ్మిహమునఁ బరమునఁగూడఁ జెఱుతురు. నిజమైన యోగి మహాత్ముఁడు తనశక్తిని సాధారణముగ బయలు పఱుపఁడని నమ్ముఁడు. ఇట్టి క్షుద్రవిద్యలేకావు. ఎట్టి మహిమలు సిద్ధులు మోక్షము నీయఁజాలవు. సరియైన మార్గమున బాగుపడ ననుకూలముండిన బాగుపడుఁడు. మోసగాండ్రను నమ్మి చెడిపోకుఁడు. భగవంతుఁడే మిమ్ము రక్షించును.

**గీ. లెమ్ము మేలుకొమ్ము సమ్మతి సద్గురుఁ**
**జేరి తత్త్వ మెఱిఁగి క్షేమపడుము**

అను పూర్వార్థమున సద్గురుఁజేరి వఱకుఁగల పదముల యర్థము వివరించితిని. మఱియొకసారి తత్త్వమెఱిఁగి క్షేమపడుము. అను పదముల యర్థమును, దత్త్వమెట్టిది. అది తెలిసికొనుట యెట్లు? దానివలనఁ గలుగు క్షేమమేది? యను మొదలైన విషయములను వివరించెదను.

తల్లులారా తండ్రులారా! యిఁక నొక్కమాట చెప్పి విరమించెదను సాత్త్వికాహార విహార సాత్త్విక క్రియలచే సత్త్వగుణము వృద్ధిచేసికొనుఁడు, రజస్సును, దమస్సును క్షీణింపఁజేయుఁడు. సత్త్వగుణమధికముగఁ గలవారే దేవతలగుదురు. రజోగుణమధికముగఁ గలవారు పశుపక్షులుగఁ బుట్టుదురు. ఈ మూఁడు గుణములను దాఁటినవారు ముక్తులగుదురు. ఈ నాలుగింటిలో మీ రేగతి గోరుదురో యట్టి నడవడి నవలంబింపుఁడు.

**శ్లో. దేవత్వం సాత్త్వికా యాంతి, మనుష్యత్వం చ రాజసః ।**
**తిర్యక్త్వం తామసా నిత్య, మిత్యేషా త్రివిధా గతిః ॥**

అని మనుస్మృతియందుఁ గలదు. ఈయర్థమునే కృష్ణ భగవానుఁ డర్జునున కి ట్లుపదేశించెను.

**శ్లో. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః, మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థాః, అధో గచ్ఛంతి తామసాః (భగ. 14.19)**

సత్త్వగుణముకలవా రూర్ధ్వలోకములకుఁ బోదురు. రజోగుణము గలవారు నడిమిలోకమున నుందురు. నీచగుణవృత్తులు కలవారు అధోగతులకుఁబోదురు. గతి కొలఁదిమతి–మతి కొలఁదిగతి.

ఇప్పుడు కొందఱు "మా వాక్యము గురువాక్యముగా గ్రహింపవలసినది. మీ దేహము, ప్రాణము, ధనము మా పటములకు సమర్పింపవలసినది" యని బోధించుచుఁ దిరుగుచున్నారు. ఇట్టివారిలో

నొకరు వ్రాసిన జీవబ్రహ్మైక్య వేదాంత రహస్యమను పుస్తకము నిటీవలఁ గొంత చదివి యందలి కొన్ని విషయముల కబ్బురపోయితిని.

శ్రుతి "తస్మా త్సాకార మనిత్యం, నిత్యం నిరాకార మితి" మహానారాయణోపనిషత్తు. రూపనామ క్రియలు కలిగిన నానాకార స్వరూప మనిత్యమయినది. రూపనామ క్రియలులేని నానిరాకార స్వరూపము నిత్యమైనది. ఇదేనా నిజస్వరూపము అని కృష్ణుఁ డర్జునునకు బోధించెనఁట. ఎప్పుడు బోధించెనో యెందు బోధించెనో? మహానారాయణోపనిషత్తు కృష్ణుఁ డర్జునున కుపదేశించినదే కాఁబోలు. రూపనామ క్రియలులేని నిరాకార స్వరూపమఁట! చిత్రము. భగవంతుఁడు సాకారుఁడా నిరాకారుఁడా యని కాని సాకారోపాసన శ్రేష్ఠమా? నిరాకారోపాసన శ్రేష్ఠమా? యనికాని నే నిప్పుడు చర్చింపఁబూనలేదు. దానిని భగవద్గీత 12వ యధ్యాయమున మొదటి నాలుగుశ్లోకములే పరిష్కరించుచున్నవి. నేను జెప్పఁ బూనినది యీ వ్రాఁతయందుండు మోసవిధము. ఈ మహా నారాయణో పనిషత్తునందు గురుశిష్య సంవాదము కలదు. అందు శిష్యుఁడు బ్రహ్మనిష్ఠుండైన గురువునుజూచి

"యస్య శ్రవణేన సర్వబంధాః ప్రవినశ్యంతి, యస్య జ్ఞానేన సర్వరహస్యం విదితం భవతి తత్స్వరూపం కథ మితి" యని ప్రశ్నించెను. అనఁగా దేనిని వినుటచేత సర్వబంధములు మూలముట్టుగ నశించును. ఏ జ్ఞానముచే సమస్త రహస్యములు తెలియనగును. దాని స్వరూపమెట్టిది యని శిష్యుఁడు ప్రశ్నింపఁగా గురు విట్లు చెప్పుచున్నాఁడు.

"అమితతేజః ప్రవాహాకారతయా నిత్యవైకుంఠం విభాతి, తచ్చ నిరతిశయానందాఖండ బ్రహ్మానందనిజమూర్త్యాకారేణ జ్వలతి" అమిత తేజస్సుయొక్క ప్రవాహ స్వరూపమున నిత్యమైన వైకుంఠము ప్రకాశించుచున్నది. అదియంతకంటె నతిశయించినదిలేని యానందము.

అఖండ బ్రహ్మానందము తన స్వరూపముగా వెలుఁగుచున్నది అని మఱియు నిట్లు చెప్పుచున్నాఁడు.

అఖండానందామితవైష్ణవ దివ్యతేజోరాశ్యంతర్గత విలసన్మహావిష్ణోః పరమపదం విరాజతే । దుగ్ధోదధిమధ్యస్థితామృతకలశం వైష్ణవం ధామ పరమగ్ం సందృశ్యతే । సుదర్శన దివ్యచేతోం తర్గత సుదర్శనపురుషో యథా । సూర్యమండలాంతర్గత స్స సూర్యనారాయణ అమితాపరిచ్ఛిన్నాద్వైత పరమానందలక్షణతేజోరాశ్యంతర్గత ఆదినారాయణ స్తథా సందృశ్యతే । ఏవ తురీయం బ్రహ్మ స ఏవ తురీయాతీత స్స ఏవ విష్ణు స్స ఏవ సమస్తబ్రహ్మవాచక వాచ్య స్స ఏవ పరంజ్యోతి స్స ఏవ మాయాతీత స్స ఏవ గుణాతీత స్స ఏవ కాలాతీత... ఆత్మాంతరాత్మా పరమాత్మా జ్ఞానాత్మా తురీయాత్మేత్యాది వాచకవాచ్య అద్వైత పరమానందో విభుర్నిత్యో నిష్కళంకో నిర్వికల్పో నిరంజనో నిరాఖ్యాత శ్శుద్ధదేవ ఏకో నారాయణో న ద్వితీయోస్తి కశ్చి దితి య ఏవం వేద స పురుష స్తదీయోపాసనయా తస్య సాయుజ్య మేత్య సంశయ మిత్యుపనిషత్" అని బోధించెను. అఖండానంద స్వరూపమై మితిలేని వైష్ణవదివ్య తేజస్సుయొక్క రాశిలో మహావిష్ణువుయొక్క పరమపదము ప్రకాశించుచున్నది. పాలసముద్రము నడుమనుండు నమృతకలశము పరమైన విష్ణుస్థానము కానవచ్చుచున్నది. సుదర్శనుని దివ్యతేజములోపలఁ గానవచ్చు సుదర్శనపురుషునివలె, సూర్యమండలము లోపల నుండు సూర్యనారాయణువలె నమితము, అపరిచ్ఛిన్నము, అద్వైతము, నైన పరమానందము చిహ్నముగాఁగల కాంతి పూరము లోపల ఆదినారాయణుఁడు కానవచ్చును. ఆయన యే తురీయబ్రహ్మ. ఆయనయే తురీయాతీతుఁడు. ఆయనయే విష్ణువు. ఆయనయే సమస్త బ్రహ్మవాచకములకు వాచ్యమైన వాఁడు. (వాచక మనఁగాఁబేరు, వాచ్య మనఁగా నాపేరుగల వస్తువు) ఆయనయే పరమజ్యోతి. ఆయనయే మాయాతీతుఁడు. ఆయనయే గుణాతీతుఁడు

ఆయనయే కాలాతీతుఁడు.... ఆత్మయని యంతరాత్మయని పరమాత్మయని జ్ఞానాత్మయని తురీయాత్మయని యిట్టి వాచకములకు వాచ్యుఁడై (పేర్లుగలవాఁడై) యద్వైత పరమానందుఁడై విభుఁడై నిత్యుఁడు, నిష్కలంకుఁడు, నిర్వికల్పుఁడు, నిరంజనుఁడు, నిరాఖ్యాతుఁడు, శుద్ధుఁడు, నగుదేవుఁడు నారాయణుఁ డొకఁడే. రెండవవాఁడెవ్వఁడును లేఁడు. ఇట్లు తెలిసికొను పురుషుఁ డాయనను నుపాసించి యాయన సాయుజ్యమును నిస్సందేహముగాఁ బొందును. ఇది రహస్యము" అని బోధించెను. ఇది విని శిష్యుఁడు "భగవ న్వైకుంఠస్య నారాయణస్య చ నిత్యత్వ ముక్తం । స ఏవ తురీయ మిత్యుక్త మేవ । వైకుంఠ స్సాకారో నారాయణ స్సాకార శ్చ. తురీయం తు నిరాకారం । సాకార స్సా వయవో నిరవయవం నిరాకారం । తస్మా త్సాకార మనిత్యం నిత్యం నిరాకార మితి శ్రుతేః । "గురువర్యా వైకుంఠము నిత్యము, నారాయణుఁడు నిత్యుఁడు అని చెప్పితిరి ఆయనయే తురీయుఁడని యవ్యక్తుఁడని యంటిరి. వైకుంఠము ఆకారముతోఁ గూడినది. నారాయణుఁడు సాకారుఁడే. తురీయము నిరాకారము. ఆకారముగలది యవయవములతోఁ గూడియుండును. నిరాకారమున కవయవములు లేవు. ఆ కారణముచే సాకారమనిత్యము నిరాకారము నిత్యముకదా! కాఁబట్టి, వైకుంఠ మనిత్యము నారాయణుఁ డనిత్యుఁడని చెప్పవలసియుండునుగదా యని ప్రశ్నింపఁగా గురువు "సాకారో ద్వివిధః సోపాధికో నిరుపాధిక శ్చ'' ''సాకారము రెండువిధములు ఉపాధితోఁ గూడిన దొకటి. రెండవది యుపాధిలేనిది" యని ప్రారంభించి యథా సర్వగతస్య నిరాకారస్య మహావాతయో శ్చ తదాత్మకస్య త్వక్పతిత్వేన ప్రసిద్ధస్య సాకారస్య । మహావాయుదేవస్య చాభేద ఏవ శ్రూయతే సర్వత్ర" సర్వగతుఁడై నిరాకారుఁడైన మహావాయువునకును దదాత్మకుఁడై మనకుఁదగులుచుండు ప్రసిద్ధుఁడైన సాకార మహావాయువునకును

నభేదము సర్వత్ర యెట్లు చెప్పఁబడుచున్నదో" యని దృష్టాంతములఁ జూపి "తద్వత్పర బ్రహ్మణస్సార్వాత్మికస్య సాకార నిరాకారభేద విరోధోనాస్త్యేవ." అటులే సర్వాత్ముఁడైన పరబ్రహ్మమునకు సాకార నిరాకారభేద విరోధము బొత్తుగలేదు అని సిద్ధాంతముచేసి "అన్యథా సర్వపరిపూర్ణస్య పరబ్రహ్మణః పరమార్థతః సాకారం వినా కేవల నిరాకారత్వం యద్యభిమతం తర్హి కేవలనిరాకారస్య గగనస్యేవ పరబ్రహ్మణో ఽపి జడత్వ మాపాద్యతే తస్మా త్పరబ్రహ్మణః పరమార్థత స్సాకారనిరాకారౌ స్వభావసిద్ధౌ." అటుగాక సర్వపరిపూర్ణుఁడైన పరబ్రహ్మమునకు పరమార్థముగ నాకారము లేదని యాయన కేవల నిరాకారమే యనుట యభిమతమేని యప్పుడు కేవల నిరాకార మైన యాకాశమునకువలెఁ బరబ్రహ్మమునకు జడత్వము చెప్పవలసి వచ్చును. కావున పరబ్రహ్మమునకు వాస్తవముగ సాకార నిరాకారత్వములు స్వభావసిద్ధములు" అని బోధించెను.

ఈ విషయమై యనేకులకుఁ గల భ్రాంతి తొలఁగింపఁ జెప్పవలసినది చాలఁగలదు కాని యిది సమయముగాదు. మఱియొకచోఁ జర్చించెదను. ఇప్పుడు నేను జెప్పఁదలఁచినది మహానారాయణోప నిషత్తునందలి సిద్ధాంత వాక్యమేదో, జీవేశ్వరైక్యవేదాంతరహస్యమందు దాని యభిప్రాయముగ వ్రాయఁబడిన వ్రాఁతయెట్టిదో చూడుఁడు. ఇట్టి గ్రంథవాక్యముల నమ్మువారి గతియేమి? అనియే. ఇంతేకాదు. ఈగ్రంథమున శ్రీశంకరాచార్యుల వారు తమ నలువురు శిష్యులకు బోధించు రవివర్మ పటమును గుఱించి "సనకసనందన సనాతన సనత్కుమారులను ఈ నలువురు బ్రహ్మదేవుని పుత్రులు పరబ్రహ్మముగా (బట్టబయలుగా) నుండు తాను పృథివి. అప్పు, తేజము, వాయువు, ఆకాశమనెడి పంచభూతములను సమష్టి వ్యష్టిగాఁజేసి వాటివలన శ్రీ శంకరాచార్యులవారు మానవ శరీరమెత్తి మఱ్ఱిచెట్టుక్రిందఁ దపము

చేయుచుండు నలువురి కెదురుగా శ్రీశంకరాచార్యులు దక్షిణముఖముగా వచ్చి నిలువఁబడిరి" అని లిఖింపఁబడినది. ఈ యసత్యవాక్య కృత్రిమ రత్నముపైఁ జర్చ యనావశ్యకము. ఇందలి దోషములును స్పష్టములు. ఇంతతోఁ బోయిన మేలే.

"శ్రీ శంకరాచార్యులు నలువురువద్దకు వచ్చునపుడు మూడు సన్నవివెదురుకొయ్యలను ఒకటిగాఁజేర్చి కట్టి (యేకదండియని చెప్పఁబడు) దాని కొనయందు బావుటా (దండా Flag) వేసి దానిని భుజముపైనుంచి బ్రహ్మదేవుని కుమారులు నలువురికిని జూపించిరి. వాటి యర్థమును దెలిసికొని నలువురు కూడ పైఁజెప్పిన రీతినికట్టి యేకదండిని భుజముపై నుంచుకొనిరి" శంకరాచార్యులవారఁట మూఁడుకట్టెల నొకటిగాఁ గట్టి భుజముపై నుంచుకొనిరఁట! దానికి ఏకదండియని పేరఁట! వారినిజూచి సనకసనం దనాదులు నట్లే ధరించిరఁట. వహ్వా ఈ సనాతనుఁ డెవఁడో? ఇంతకంటెఁ బనికిమాలిన వ్రాఁత యుండునా? శంకరాచార్యులు పుట్టకముందు సనకాదు లెట్లుండిరో. ఇంతకుమించిన చిత్రము చూడుఁడు.

"పైఁజెప్పిన బ్రాహ్మణసన్న్యాసికి జీయరు అనిపేరు. ఈ సన్న్యాసి యేకారణమువలన మూడు వెదురుపుల్లలను ఒకటిగాఁ జేర్చి కట్టి దానికొనన బావుటా (జెండా) కట్టి భుజముపై నుంచి లేవనెత్తి చూపి అందఱికి ముందు నడచుచున్నాఁ డనఁగా నేను ధరణి (భూమిగృహములు మొదలైనవాటిపై యుండు) యాశ, ధనాశ, స్త్రీయనెడియాశ యీ మూటిని జయించితిని. వీటిని జయించినందున ఆణవము – మాయకామ్యమనెడి మూడు ఆశలను ముమ్మలములను జయించినాను" అని యెల్లవారికిఁ జూపుచున్నాఁడని వ్రాయఁబడెను. వైష్ణవసన్న్యాసులు త్రిదండధారులైన కారణ మెఱింగినవా రీ వ్రాఁతకు ఫక్కున నవ్వకుందురా. మణ్ణాశ, పెణ్ణాశ, పొన్నాశ యని యఱవమందుఁగల దానినిబట్టి యీయర్థము

వ్రాయఁబడినదిగాని సంప్రదాయముగాని వాస్తవముగాని కాదు. (మణ్ణాశ = భూమిపై కోరిక, పెణ్ణాశ = యువతిపై కోరిక, పొన్నాశ = బంగారుపై కోరిక) అద్వైతి శంకరాచార్యులవారు మూఁడు కట్టెల నొకటిగాఁ గట్టిరి. వైష్ణవసన్యాసి యట్లే చేసెను. ఆయన యేకదండి యెట్లయ్యెను? ఈయన త్రిదండి యెట్లయ్యెను? ఇట్టులే సంధ్యావందనము గుఱించియు వింతలు వ్రాయఁబడినవి. అవి శూద్రసంధ్యావందన పద్ధతులు కాఁబోలు. ఈ గ్రంథమునం దిట్టి యసంగతపువ్రాఁతలు, నపోహములు మఱియుఁ బెక్కులు కలవు. ఇవి వాస్తవములని యెందఱు ప్రమాదపడుచున్నారో యని విచారపడ వలసియున్నది.

'నమశివయ' యనునది పంచాక్షరియఁట. హరిహరీ! పంచాక్షరి కెట్టి పంచత ప్రాప్తించెను!! అక్షరాభ్యాసకాలమున బాలురకును నమఃశివాయ యని వ్రాసియిత్తురే. ఇంతటి యోగీశ్వరునకుఁ దన్మంత్రోపాసకున కిదియేల తెలియదాయె. నమ యని ముందు వ్రాయఁబడియెఁగదా. ఇది యేయంతము? వేదాంతమునకుఁ బ్రాణాంతము కాఁబోలు. ఏలింగము? మృల్లింగము కాఁబోలు. 'శివయ' ఏవిభక్తి? భక్తి యక్కఱలేదేని పోనిండు. విభక్తి కీ దుర్దశ రానేల? వ్యాకరణమున కీ మరణ యోగమేల? ఈయోగము వ్యాకరణమునకే కాదు. ఛందస్సునకును బ్రాప్తించెను.

**ఉ. మంగళభానుకృష్ణగురువారములందును సూర్యనాడియున్**
**రంగుగ సోమ శుక్ర బుధవారము లన్మఱి శుక్లపక్షమందు**
**దుం గురువాసరంబునను నొప్పుగమేలగు చంద్రనాడియెం**
**చంగ దినాది నాల్గుమొద లాఱవగంటకు నొప్పియుండినన్.**

ఇందలి యతు లేజాతియతులో కదా?

ఆర్యులారా! పంచాక్షరీ మంత్రస్వరూపము తెలియదందురా? ఇట్టివారు తాము గురువులమను నభిమానముచే నుపదేశాధికారము

వహించి లోకుల కసత్యము బోధించి వారిని జెఱుపనేల? ఇట్టి విరూపమంత్రము జపించువారి గతి యేమి? తెలిసియు రహస్యమగుటచే యథాస్వరూపము చెప్పలే దందురా? అప్పుడు చెప్పకయే యుండవలయును. ఈ వంచనమేల? ఇది నిజమైన మంత్రస్వరూపమని కదా జ్ఞానములేక యీ గ్రంథమును జదువువారు తలంతురు. ప్రణవరహిత పంచాక్షరి జప్యమా?

ప్రాణాయామమందు గాలి ప్రేగులలోకిఁ బోయి బాధ పెట్టునఁట. అవురా యోగబోధ! ఇట్లు పోవునని బాధపెట్టుననియే యోగశాస్త్రము చెప్పుచున్నదో? మనము పీల్చిన గాలి శ్వాసకోశముల దాఁటిపోఁగలదా? ఈ వేదాంతరహస్యమం దాసనము లెట్లు బోధింపఁబడినవో కనుఁడు.

"సిద్ధాసనమనఁగా, ఎడమకాలిపాదము కుడితొడ క్రింద నుంచి కుడిపాదము ఎడమమోకాలి పిక్కతొడలకు మధ్యన పైగానుంచి శిరస్సు కంఠము రొమ్ము మొదలగునవి సరిగఁ జిత్రప్రతిమ (బొమ్మ)వలె నిలిపి చిన్ముద్రనుబట్టి నిష్ఠయం దుండవలయును" ఇది సిద్ధాసనమని యేయోగగ్రంథమం దున్నదో? ఆసనసిద్ధి లేకున్న మానెఁగాని యోగీశ్వరుఁడనని చెప్పుకొనువానికి నాసనలక్షణజ్ఞాన మైన వలదా?

ఈ గ్రంథమందు దేహమునందలి షట్చక్రములలో 'ఆగ్నేయ' చక్రమని యొకటి యున్నట్లు వ్రాయఁబడియున్నది. ఔరా చక్రజ్ఞానము!! చక్రము పేరుకూడఁ దెలియక దానిని గుఱించి వ్రాయుట యీకాలపుజోగులకే తగియున్నది. ఆజ్ఞాచక్రమునకు నాగ్నేయచక్రమనియే యోగులు చెప్పెదరో? ఏ శాస్త్రముచెప్పునో?

ఈ గ్రంథమందు నీటిమీఁదఁ బండుకొనుట జలసమాధి యని వ్రాయఁబడియున్నది. జలసమాధి యనఁగా నేమియర్థము? ఈఁదనేర్చిన నేర్పరియగువాఁ డెవ్వఁడైనఁ జేయఁగల యీ గారడివిద్యయందు

యోగవిశేష మేమిగలదు? నీటిమీఁదఁ దిరుగుచు మాటలాడుచు నుండువాఁడు సమాధియం దుండఁగలఁడా? సమాధియనఁగా నేమి? గోరియనియా? కుంభకమును సాధించినవాఁడు బద్ధపద్మాసనుఁడై కూర్చుండినను మునుఁగఁడని శాస్త్రమందుఁ గలదు గాని పండుకొమ్మని యున్నదా? తిరువళిక్కేణిలో బార్థసారథి స్వామివారి పుష్కరిణిలో నొకఁడు తాను యోగినని నీటిమీఁదఁ బరుండి తిరుగుచు నుపన్యాస మిచ్చుచుండఁగా మఱియొకఁ డట్టేచేసి యిది యోగముగాదు. మాయాయోగము టక్కు మోసమని యందఱకుఁ దెలిపెను. అదిమొద లా యోగీశ్వరుఁడు చెన్నపురిలో నట్టి పిచ్చిచేష్టలు చేయుట మానెను. అతఁడీ గ్రంథకర్త కాఁడు కాఁబోలు.

కాఫీ - బంగాకు మొదలగువానిని వలదని బోధించి విగ్రహారాధనము లోనైనవి కర్తవ్యములని వ్రాయుటచే నీ గ్రంథకర్తలు నాకు వంద్యులే యగుదురు. ఈ కాలమున వెల్లివిరిసిన కలిదూతలగు బంగీభాయి వేదాంతులకంటె వీరు మేలు.

మచ్చునకై యీ గ్రంథమునందలి కొన్ని దోషముల సూచించితిని. ఇంకను బెక్కులుగలవు. ఈ గ్రంథమునం దెందుఁ బుట్టినను దురూహలు, నపోహములు, నసత్యములు నిండియున్నవి. కావున, నిట్టి గ్రంథములను నమ్మి మీరు చెడకుందురుగాక యని హితముఁగోరి చెప్పెదను గాని వారియందలి నిరాదరణబుద్ధిఁగాదు. ఈ గ్రంథమును జూచిన వీ రుదాహరించిన

**శ్లో. "సర్వే బ్రహ్మ వదిష్యంతి సంప్రాప్తే తు కలౌ యుగే ।**
**నానుతిష్ఠంతి మైత్రేయ, శిశ్నోదరపరాయణాః ॥"**

మైత్రేయా! కలియుగమందు నందఱు బ్రహ్మము బ్రహ్మమని వదురువారే. కాని, శిశ్నోదర పరాయణులై దాని ననుష్ఠించువారుండరు. అను వాక్యము స్మరణమునకుఁ దప్పక వచ్చుచున్నది కాలమహిమ!

సభ్యులారా! శ్రుతివాక్యములచే మిమ్ము మేలుకొలిపితిని. లేచి నిద్దురమబ్బున నిట్లట్లుపోయి మిమ్ము మ్రింగుటకుఁ గాచి వేచియుండు మాయాయోగులు, శుష్క వేదాంతులు నసుపులుల తోడేళ్లవాతఁబడక గురులక్షణ మెఱిఁగి కన్నులు దెఱచికొని శోధించి పరీక్షించి సద్గురువుల నాశ్రయించి శిష్యధర్మము నిర్వర్తించుచు బాగుపడుఁడు. భక్తిమార్గమున నేను బాటుపడువాఁడ నగుటను, మీరును భక్తియం దభిలాషగలవా రగుటచేతను, భక్తిప్రపత్తులే నిరపాయములు - నిశ్చితఫలములు. శీఘ్రఫలదములు నగుటచేతను, బోధయంతః పరస్పరమ్మని కృష్ణభగవానులు సెలవిచ్చుటచే నాకుఁ దెలిసినది మీకుఁ జెప్పుటయు మీకుఁ దెలిసినది మీవలన నేను నేర్చుకొనుటయు సముచితము గావున సోదరన్యాయంబున మీకీ విషయములు చెప్పఁ బూనితిని గాని తదితరబుద్ధిఁగాదు. మీరును నన్ను సోదరునిఁగాను దండ్రిగాను సమాన ప్రతిపత్తితో నెంచవలయునని యే నా ప్రార్థన. వంచకుల వంచనలకు మోసపోక బాగుపడఁ గోరెదరేని భక్తి ప్రసూనమాలికాగ్రంథములఁ జదువుఁడు. సందేహములున్న నడుగుఁడు.

**వాసుదాసుఁడు**

* * *

# హనుమదాచార్యోపదేశము

# హనుమదాచార్యోపదేశము

సోదరులారా! సోదరీమణులారా!

శ్రీకోదండరామ సేవక సమాజమున సభ్యుల మయిన మన మందరము సోదరులమే. కావున నొకరికిఁ దెలిసినది మఱి యొకరికిఁ దెలియుజెప్పుట విహిత కృత్యమైయున్నది. ఎట్లన భగవంతుఁడే.

**శ్లో॥ మచ్చిత్తా మద్గతప్రాణా, బోధయంతః పరస్పరమ్**
**కథయంతశ్చ మాం నిత్యం, తుష్యంతి చ రమంతి చ ॥**
**తేషాం సతతయుక్తానాం, భజతాం ప్రీతిపూర్వకమ్**
**దదామి బుద్ధియోగం తం, యేన మా ముపయాంతి తే ॥**
**తేషా మే వానుకంపార్థ, మహ మజ్ఞానజం తమః**
**నాశయా మ్యాత్మభావస్థో, జ్ఞానదీపేన భాస్వతా ॥ భగవ. 10.11**

తమ తమ మనస్సులు ప్రాణములు నా యందుంచినవారై నా భక్తులు నన్ను గురించి యొకరికొకరు తెలుపుచు నా కథలను వినిపించుచు నిట్లుచెప్పుటచేతను వినుటచేతను నెల్లప్పుడు సంతోషించుచు నానంద మనుభవించుచుందురు. ఈ విధముగ ధ్యానాదులచే నాతోడు గూడియుండు మనస్సు గలిగి ప్రీతితో నన్ను భజించువారికి నెట్టి తెలివి నొసఁగినచో వారు నన్నుఁ బొందుదురో యట్టి తెలివిని వారికి నేనే యొసఁగెదను. ఇట్టి వారికే వారి ననుగ్రహించు కొఱకు వారి మనోవృత్తులయందు నేనుండి ప్రకాశించు జ్ఞానదీపముచే వారి యజ్ఞానమను చీఁకటిని నాశము చేయుచున్నాను అని సెలవిచ్చెను.

అన్నలారా! అక్కలారా! కంటిరిగదా మనయందు భగవంతునకెంత ప్రీతియో. సత్యము అసమర్థులగు లేఁతబిడ్డలయందే కదా తల్లి దండ్రులకెక్కువ వాత్సల్యము. తన మీఁద మనము మనస్సుంచి తన కథలను మనము చెప్పుకొనుచుఁ బ్రొద్దుపోకకో దుష్టతనముచేతనో

యాయమ్మ యట్లుచేసెను ఈయమ్మ యిట్లు చేసెనని వీథీపురాణములు చెప్పుకొనుటయందెంత ప్రీతివహింతుమో యంతప్రీతి తన కథలయందు నవతారములఁ దాను జేసిన చర్యలయందుఁ జెప్పిన మాటలయందు వహించితిమేని తానే మన మనేకజన్మములందుఁ జేసిన పాపములను సవాసనముగ నాశముచేసి తన ప్రాప్తికి సాధనమైన తెలివి నిచ్చునట. ఇంతకంటె మనకుఁ గావలసినదేమి యున్నది? ఇంతకంటె సులభమార్గ మేదున్నది?

ప్రహ్లాదుఁడు శ్రీ నృసింహమూర్తిని గోరినవర మిదియే కదా!

**శ్లో॥ యా ప్రీతి రవివేకానాం, విషయే ష్వనపాయినీ ।**
**త్వా మనుస్మరత స్సా మే, హృదయా న్మాపసర్పతు ॥ వి.పు.**

బాలురకు నాటవస్తువుల యందువలె నవివేకులకు విషయములందు నెట్టి విడువని ప్రీతియుండునో యట్టిప్రీతి నిన్ను స్మరించు నా హృదయమునుండి తొలఁగిపోకుండఁ జేయుమని ప్రహ్లాదుడు కోరెను.

**శ్లో॥ ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైః, త్రేతాయాం ద్వాపరే ౾ర్చయన్**
**య దాప్నోతి త దాప్నోతి, కలౌ సంకీర్త్య కేశవమ్. వి.పు.**

కృతయుగమున జ్ఞానయోగముచేతను, త్రేతయందు యాగాది కర్మయోగముచేతను, ద్వాపరమం దర్చనాదులచేతను నేఫల మబ్బునో యాఫలమే కలియుగమందు హరినామకీర్తనముచేఁ గలుగును అని విష్ణుపురాణమును గలదు. ఇట్లు మనము సులభముగాఁ గడతేఱుమార్గ ముండఁగాఁ గృతయుగ త్రేతాయుగ ద్వాపర యుగములవారికిఁ జెప్పినమార్గములపాలై త్రిశంకు లగుచున్నారు. వీరిస్థితి యెంతయు శోచనీయము. కావున మనమట్టి పొరపాటుపడక సత్యఫలదము శీఘ్రఫలదము - నిరాయాసము - సుకరము - నిరపాయమునైన

భక్తిమార్గమున భగవంతు భజింతము. ఎందఱు యోగులు రోగులగుటయు, జ్ఞానులమనుకొనువా రజ్ఞానులయి యధోలోకముల పాలుగాఁదగిన వారగుటయు మనము కన్నారఁ జూచుచున్నారము. మనకిట్టి సమయోచిత శక్త్యుచిత బుద్ధినొసఁగిన భగవంతుని మనమెంతనికొని యాడఁగలము? [1]యోగిమానులయు [2]జ్ఞానిమానులయు భ్రాంతి మీకు గలుగకుండుట కే భక్తిప్రాశస్త్యము వివరించితిని. నేఁ డాచార్యుగుఱించి ప్రశంసించెదను.

గురువు లేకున్న నెట్టి విద్యయు సాధించుట దుష్కరమే. మట్టి ద్రోణాచార్యుఁడైన నొకఁడుండవలయును. ఏలయందు రేని గురువగు వాఁడు తన జీవితమంతయు నావిద్యను నేర్పుట యందు ధారవోసి తాఁకు దప్పులు సమర్మముగఁ దెలిసినవాఁడై యుండును. అట్టివాని నాశ్రయించితిమేని వాఁడు ప్రీతితో నావిద్యయందలి మర్మములు పదేశించును. ఈ లాభము మనకుఁ బిన్నవయస్సునందే కలిగినచో దానిపై మనమెంత దానిని వృద్ధి చేసికొనఁగూడదు? అటుగాక మనయంత మనమే పుస్తకముల మూలముననో యనుభవముననో సాధింపఁ బూనిన నంతమాత్రమైన విద్య సాధింపఁగలమని యేమినమ్మకము? ఇఁక నభివృద్ధి యెక్కడ? ఈవిధముగ క్షుద్ర విద్యలయందే గురువు కావలసియుండఁగా బ్రహ్మవిద్యా విషయమున నేమి చెప్పవలయును. కావున మనము తగిన గురువు నొకని సంపాదించుకొనవలయును. అట్టి గురువెట్టివాఁడై యుండవలయును? ఆయన చేయుకార్యమేది యను ప్రశ్నలు రాకపోవు. ఈ ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరముగాఁ బుస్తకములలోని సూత్రములను నప్పగించుట కంటె నిట్టి యాచార్యుని గుఱించి చెప్పిన మీకు మనస్సునకుఁ జక్కఁగ బోధపడును. కావున నట్టి యాచార్యుగుఱించి చెప్పెదను ఆయన

---

1. తమను యోగియని తలఁచువారు. 2. తమను జ్ఞానులమనుకొనువారు

మఱియెవ్వఁడో కాఁడు. మన సమాజాధ్యక్షుఁడే. సంజీవరాయఁడే. గురువుల లక్షణముగుఱించి మేలు కొలుపునందుఁ జెప్పితిని గదా!

పుంజికస్థలయను నప్సరస బ్రహ్మశాపవశమున వానరియై కుంజరుఁడను వానరునకు జనించి కేసరి యనువాని భార్యయై కామరూపిణి యగుట మానుషీ వేషంబున నొక పర్వతముపైఁ దిరుగుచుండ వాయుదేవుఁ డామెను గౌఁగిలించెను. ఆమె నాపాతివ్రత్యముఁ జెఱుపఁగోరు వాఁడెవఁడని పలికెను. నేను వాయుదేవుఁడను. నీ పాతివ్రత్యమును జెఱుపను. మఱియు లంఘనంబునఁ బ్లవనంబున వేగంబున నాతో సమానుఁడగు పుత్రుఁడు నీకుఁ గలుగ ననుగ్రహించితిననెను. ఆవరప్రకారమామె కాంజనేయుఁడు జనించెను.

హనుమంతుని తండ్రియగు వాయుదేవుఁడు దిక్పాలకులలో నొకఁడై వాయవ్యమూల కధికారియైన వాయువుగాఁడు.

**"ఓం నమో బ్రహ్మణే! నమ స్తే వాయో!**
**త్వ మేవ ప్రత్యక్షం బ్రహ్మాసి ।**
**త్వ మేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి"**
**ఓం తద్బ్రహ్మ ఓం తద్వాయుః ఓం తదాత్మా ।**

అనుచోట్లఁ జెప్పఁబడిన దేవతామూర్తియే. ప్రాణదేవతయే. ఎట్లందురేని బృహదారణ్యకోపనిషత్తు 3వ యధ్యాయము 8వ బ్రాహ్మణము 2వ మంత్రమందు "స హెూవాచ వాయు ర్వై గౌతమ తత్సూత్రమ్" వాయునా వై గౌతమ! సూత్రేణాయం చ లోకః పర శ్చ లోకః సర్వాణి చ భూతాని సంబద్ధాని భవంతి" యని యున్నది. ఓ గౌతమా! యాసూత్రము వాయువే. వాయువు చేతనే యాలోకము పరలోకము సర్వభూతములు గ్రుచ్చఁబడి యున్నవి అని యాజ్ఞవల్క్యుఁడు చెప్పెను.

దీనివలన వాయు వనఁగా సర్వవ్యాపియై జగత్ప్రాణమై జీవభూతమై యుండు సూత్రాత్మయని యేర్పడుచున్నది ఈ జగత్ప్రాణమున కుత్పత్తి నాలోచింపఁగాఁ బ్రశ్నోపనిషత్తు ప్రథమ ప్రశ్న 4వ మంత్రమున –

**"తస్మై స హోవాచ ప్రజాకామో వై ప్రజాపతిః స తపో ఽ తప్యత స తప స్తప్త్వా స మిథున ముత్పాదయతే రయిం చ ప్రాణం చేతి॥**

ప్రజాపతి ప్రజాసృష్టిచేయు కోరికగలవాఁడై యెట్లు చేయుదునా యని యాలోచించి రయి–ప్రాణమునను మిథునమును సృష్టించెను అని యున్నది. ఇచ్చటఁ బ్రజాపతి యనఁగా విష్ణువని మాధ్వభాష్యము. పరమాత్మ యని విశిష్టాద్వైత భాష్యము. సర్వాత్మయగు హిరణ్యగర్భుఁడని శంకరభాష్యము. రయి–ప్రాణమనఁగాఁ బ్రకృతిపురుషులని విశిష్టాద్వైతభాష్యము. అన్నము ప్రాణమని శంకరభాష్యము. సూర్యచంద్రులని మాధ్వభాష్యము. ఈ విషయమున శర్వానంద స్వాములవారిట్లు వ్రాసిరి.

"Matter and Energy : According to Sankara Charya Rayi of the text means food i.e., Moon and Prana means Fire i.e., eater. Sankara's interpretation is based upon the old Vedic notion that all foods are produced by the subtle influence of the Moon where proceeds the liquid principle Rasa of the earth and the Sun which gives the Earth its fire principle. Tejas is the consumer of the former. As it is physically true so physiologically; for life is substained and multiplied by food and respiration i.e., అన్న and ప్రాణ though such explanation seems to be apparently natural when read with the next Sruti, yet it would not commend itself in these days of Science unless we impute errors to the observations

of the Vedas. Hence we have translated Rayi by matter and Prana by Energy. Hiranya garbha, the cosmic mind, first created out of himself the double principles of matter and energy which produces the varieties of the universe. This interpretation is perfectly in accord with the discoveries of the Modern Science and more convincing when read with the subsequent Brahmanas with same light" అనఁగా వీరి యభిప్రాయప్రకారము రయి యనఁగాఁ బ్రకృతియుఁ, బ్రాణమనఁగా జీవశక్తియు. వీనివలనఁ జూడఁగా నమస్తే వాయోయని సంబోధింపఁ బడిన దేవత దిక్పాలాంతర్గతుఁడగు వాయువుగాఁడనియు మధ్వాచార్యాభిప్రాయప్రకారమైనచో విష్ణుసంభూతుఁడనియుఁ దక్కినవారి యభిప్రాయ ప్రకారమైనచో హిరణ్యగర్భ సంభూతుఁడనియు నేర్పడుచున్నది. త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసియను వాక్యముపై శర్వానంద స్వాములవా రిట్లు వ్రాసిరి.

(Thou art... Brahman : Here by Vayu is meant the all pervasive Universal life or Sutratman. In his macro cosmic aspect, he is the Cosmic energy and Universal mind; and in His Micro Cosmic aspect. He is the vitalising force of body and mind. The Sutratman is the first subtle manifestation of the Saguna Brahman. The other name for Sutratman is Hiranyagarbha. He is endowed with two-fold energy viz. Jnana Sakti and Kriya Sakti i.e. power of knowledge and power of action. He is called here visible Brahman because he is perceptible both by mind and the senses.

అనఁగా వాయువే సూత్రాత్మ - హిరణ్యగర్భుఁడనియు నీయనయందు జ్ఞానక్రియాశక్తులు రెండును గలవనియు మనస్సునకు

నింద్రియములకు గోచరించుటచేఁ బ్రత్యక్ష బ్రహ్మమని చెప్పఁబడెననియు నర్థము.

ఇవన్నియు నాలోచించి చూడఁగా నిట్లు లేర్పడుచున్నది.

**"పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ"**

యన్నట్లు భగవంతునియందు మనచే జ్ఞానశక్తియని బలశక్తియని క్రియాశక్తియని చెప్పఁబడు నానావిధశక్తులు గలవు. భగవంతుని పరశక్తియే కార్యస్వభావ భేదమునుబట్టి నానానామముల వ్యవహరింపఁబడుచున్నది. ఇంతయేల? భగవంతుఁడను మాటకే జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్యతేజస్సులు గలవాఁడని కదా యర్థము. బలమే ప్రాణము. కావున శ్రుతియందలి ప్రజాపతిశబ్దమునకు విష్ణువని యర్థము చెప్పినను బ్రహ్మయని యర్థము చెప్పినను నా యభిప్రాయమునకు విరోధములేదు. ఈ ప్రాణశక్తియే వాయుదేవత. వాయువునకుఁ బ్రాణమనియే పేరు. "ప్రాణవంత మిమం దృష్ట్వా, ప్రాణో గంధవహో ముదా" యనియుఁ గలదు. కావుననే మాధ్వులు వాయుదేవతను బరంపరయందు బ్రహ్మతో సమునిగఁ జెప్పుచుఁ బ్రాణదేవ రనుచున్నారు. ఇది న్యాయ్యమేకదా.

ఇంతవఱకు హనుమంతుని తండ్రి భగవంతునకు రెండవ వాఁడని తెలిసికొంటిమి. ఇఁకఁ దల్లినిగుఱించి యాలోచింతము. ఆమె దేవతా స్త్రీ. అంజనయని యామెపేరు. ఈ శబ్దమునందలి యాద్యంతాక్షరములు గ్రహించిన 'అన' యగుచున్నది. ఇట్లు గ్రహించుట శాస్త్రసమ్మతమైన విషయమే. 'అన ప్రాణనే' జీవింపఁజేయునది యని యర్థము. తండ్రిప్రాణ (ప్ర+అన) మైనపుడు తల్లి 'అన' (అంన) యగుట సముచితమేకదా. ఇట్టి తల్లిదండ్రులకు జనించినవాఁ డెట్టివాఁడై యుండవలయునో యాలోచింపుఁడు. కావుననే దేహబలముగోరు మహారాష్ట్రులు లోనగువారు హనుమంతుని విశేషముగ నుపాసింతురు.

దీనివలన నాచార్యుఁడు సద్వంశసంభవుఁడై సద్గుణములు గల తల్లిదండ్రులకు జనించినవాఁడుగా నుండవలయును. కీర్తిప్రతిష్ఠలుగలిగి పలువురకుఁ దెలిసినవాఁడై యుండవలయును అని యేర్పడుచున్నది.

ఇఁక హనుమంతుని నామధేయముఁబట్టి తెలియఁదగిన దేమో చూతము. బాల్యమున సూర్యుని మ్రింగఁబోయినపుడు వజ్రాయుధముచే నింద్రుఁడు గొట్టఁగాఁ జెంప (హనువు) నొచ్చెను గనుక హనుమంతుఁ డయ్యెనని పౌరాణికులందురు. ఇఁక వైయాకరణమతప్రకార మజ్ఞానమును హననము చేయునదిగావున జ్ఞానమునకు హనువని పేరుగలదు. ప్రశస్తమైన జ్ఞానముగలవాఁడు కావున హనుమంతుఁ డయ్యెనని వైయాకరణులందురు. ప్రశస్తార్థమున మతుప్. ఇది యంగీకరింపఁదగినదే. కారణగుణము కార్యమునం దుండును. గావున జ్ఞానబలస్వరూపుఁడై సూత్రాత్మయగు వాయువునకు జనించినవాఁడు జ్ఞానియు బలవంతుఁడుగా నుండుటేమి చిత్రము.

బాల్యమునందే యీయన కీపేరు కలిగెఁగదా. అప్పటి కీయన కేమాత్రము జ్ఞానముగలదో చూతము. మార్గశిరమున శుద్ధ చతుర్దశినాఁడు హనుమంతుని జననము. ఇట్లు జనించిన హనుమంతుని నంజనాదేవి యొకనాఁడు తొట్లెలోఁ బరుండఁ బెట్టి ఫలములు తేర నడవికిఁ బోయెను. అప్పుడు సూర్యోదయవేళ కావున నుదయించు సూర్యబింబమును జూచి హనుమంతుఁ డెఱ్ఱనిపండని దానిని గ్రహింప నా కాశమున కెగిరెను. అది సూర్యోపరాగదివసము. కావున నది యమావాస్యయై యుండవలయును. ఆకారణముచే నప్పటికి హనుమంతునకుఁ బదునాఱుదినముల ప్రాయమై యుండవచ్చును. అంతలేఁత శిశువైనచో మర్కటకిశోరన్యాయము ననుసరించి చూచినఁ దల్లి పొదిగిటనే శిశువుండవలసివచ్చును. కావునఁ బెద్దవాఁడై యుండవచ్చునని యూహింతమా యనినఁ బెద్దవాఁడై యుండినచోఁ

దొట్లెలోఁ గ్రోఁతిపిల్ల పరుండియుండునా యను నాక్షేపము రాకపోదు. శిశువు వానరకిశోరమైనను దల్లి స్వభావమున వానరకాంతగాదు. కామరూపిణియు దేవతా స్త్రీయునగుట చేతనే యంజన మనుష్యస్త్రీస్వరూపముతోనే సంచరించుచుండెనని రామాయణమువలనఁ దెలియవచ్చుచున్నది. కావున సహజ వానరజాతికి నన్వయించు మర్కటకిశోర న్యాయ మిం దన్వయింపదు. ఇంతకు వయోవిచార మప్రధానము. 16 దినములైనను 46 దినములైనను ప్రస్తావ విషయమునకు హానిలేదు.

ఎఱ్ఱని పండని సూర్యునిఁ బట్టుకొనఁబోయి యావల నా సూర్యుని గ్రహింపవచ్చిన రాహువును జూచి నల్లని పండని పట్టుకొనఁబోయి యావల నతనికి సహాయుఁడై వచ్చిన యింద్రుని యైరావతమును జూచి తెల్లని పండని పట్టుకొనఁబోయెనఁట. ఇందు మూఁడు రంగులఫలములు చెప్పఁబడినవి. ఎఱుపు రక్తవర్ణము. ఇది రజోగుణసూచకము. నలుపు తమోగుణ సూచకము రాహువు తమోగ్రహమేకదా. తెలుపు సత్త్వగుణ సూచకము. ఈ మూఁటిని బట్టుకొని మ్రింగఁబోయి నాఁడన బాల్యమునందే త్రిగుణాతీతుఁడై ప్రకృతిని జయింప నుద్యమించెనని యేర్పడుచున్నది. ఇదియే కదా జ్ఞానిలక్షణము.

అటైనఁ బ్రయత్నమున విఫలుఁడై భ్రష్టుఁడయ్యెఁగదా యందురేమో. అట్లనరాదు. "యత్నే కృతే యది న సిధ్య కోఽత్రదోషః" యత్నము చేసి యది కొనసాగకుండిన నందేమి దోషము గలదు? అనియు

**శ్లో॥ కర్మణ్యే వాధికార స్తే, మా ఫలేషు కదాచన**

కర్మమందే యధికారంబు నీకుఁ, గర్మఫలంబులఁ గా దీవు కోర.

ననియుఁ బ్రమాణములు గలవుగదా. విఘ్నము రాఁ బోవునను భీతిఁ జేయవలసినకార్యము చేయకుండుట యుత్తమ పురుష

లక్షణముకాదు. పతనభీతి గుఱ్ఱముబండి యెక్కకుండ వచ్చునా? భార్య చచ్చునేమోయని పెండ్లాడకుండవచ్చునా? శ్రేయాంసి బహువిఘ్నాని యని మంచికార్యములకే విఘ్నములు మెండు. అందు ముముక్షువై సత్కార్యములు చేయువానికి దేవత లెన్నియో విఘ్నములు కల్పింతురు. వీనికి భయపడరాదు. పునః పునః ప్రయత్నములు చేయవలయును. చేసెనేని జయము తప్పకకలుగును. "న హి కల్యాణకృత్కశ్చి ద్దుర్గతిం తాత గచ్ఛతి" యని భగవంతుఁడే సెలవిచ్చెను. ఎఱ్ఱని పండని బాలదివాకరుఁ బట్టఁబోయినవాఁ డట్టికార్యము చేయక నల్ల పండని తెల్లపండని చంచలత్వమునఁ బరువుపాఱుట కపిత్వమన వస్థితమ్మన్నమాట దృఢపఱుచుచున్నది. కపియనఁగాఁ జంచలుఁడని యర్థము. అన్నలారా కపియని హనుమంతు నాక్షేపింపఁ బనిలేదు. మనమందఱము కపులమే. మనమనస్సే కపి. అంతకంటెఁ జంచలమైనది లోకమునఁ గలదా.

**శ్లో॥ చంచలం హి మనః కృష్ణ, ప్రమాథి బలవ ద్దృఢమ్।**
**త స్యాహం నిగ్రహం మన్యే, వాయో రివ సుదుష్కరమ్ ॥**

కృష్ణా! మనస్సు చంచలమైనది. బలమైనది దృఢమైనది. వానిని గ్రహించుట గాలిని మూటకట్టుటవలెఁ గష్టకార్యమని తలఁచెదను.

అనియర్జునుఁడు చెప్పెఁగదా. ప్రత్యక్షమునకు సాక్ష్యమేల? మన మనస్థితులు మనకుఁ దెలియవా? అయినను హనుమకు మనకు నొకభేదము. సహజకపిత్వము నాయన జయించెను. మనము జయింపఁజాలక యున్నాము.

ఆవల బ్రహ్మాదిదేవతలచే వరములొంది బాల్యచేష్టల వలన మునీశ్వర శప్తుఁడై తనబలము తాను మఱచెనఁట.

ఈవిషయము భర్తృహరి నీతిశతకములోని యొకపద్యమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది.

చం. తెలివి యొకింత లేనియెడ దృప్తుఁడ నై కరిభంగి సర్వమున్
దెలిసితి నంచు గర్వితమతిన్ విహరించితిఁ దొల్లి; యిప్పుడు
జ్ఞులమతు లైనపండితులసన్నిధి నించుక బోధశాలి నై
తెలియనివాఁడ నై మెలఁగితిన్ గత మయ్యె నితాంతగర్వమున్.

హనుమంతుఁడు నిట్టిస్థితికి వచ్చెను. జ్ఞాని యిట్లుగాక మఱియెట్లు కాఁగలఁడు? ఆవల సూర్యు నాశ్రయించి సమస్త విద్యలు నేర్చుకొనెను. ఈ విషయమై యగస్త్యమహర్షి శ్రీరామునితో నిట్లు చెప్పెను.

కం. [1]పుట్టుమలనుండి [2]గ్రుంకుడు
గట్టుదనుక సూర్యుతోడఁ గడువడిఁ జనుచున్
బట్టుగ వ్యాకరణంబును
గట్టిగ వల్లించె నితఁడు కంజదళాక్షా

తే. సూత్రములతోడ వృత్తియు సూత్రములను
నర్థము పదంబు మఱియు మహార్థమన్య
శాస్త్రనిచయంబు ఛందస్సుఁ జక్క నేర్చెఁ
గీర్తితచరిత్రుఁ డీతండు కేవలుండె

గీ. సకలవిద్యల దేవతాచార్యుతోడ
నెనయఁజాలెడి యీతండు జనవరేణ్య
యభ్యసించెను దొమ్మిది వ్యాకరణము
లగును బ్రహ్మగఁ దావకీనానుకంప ఆం-వా.రా.

ఇట్లు హనుమంతుఁడు విద్యలన్నియు నేర్చి నైష్ఠికబ్రహ్మచారి యయ్యెను.

1. ఉదయపర్వతం 2. అస్తాద్రి

దేవతాంశ సంభూతులయిన వానరులందఱు గృహస్థులై యుండ హనుమంతుఁడు మాత్రము బ్రహ్మచారి గానేల యని విచారింపవలసియున్నది.

గృహస్థుఁడగుట యేల? "దార సంగ్రహంబు ధరణీశ! రతిపుత్రఫల" మన్నట్లు సంభోగమునకుఁ బుత్రులఁ గనుటకు. సంభోగము నిమిత్తమై సంభోగించుట పశుధర్మము. తనకు గతులుకల్పించు పుత్రుఁడు పుట్టుటకై సంభోగించుట గృహస్థధర్మము. ఈ విషయమున నొక్కటి విచారణీయము. మనుష్యుఁడు తనకుఁ దాను గతులుకల్పించుకొనుట బుద్ధిమంతుని లక్షణమా? మఱియొకనిపై నాధారపడియుండుటయా?కాశీయాత్ర చేయఁదలఁచినవాఁడు తనకా ళ్లుపయోగించి నడచి పోవలయునా? మఱియెవఁడో యొకఁడువచ్చి తన్ను వెూచికొని పోవునని కాచియుండవలయునా? బుద్ధిమంతున కేది తగిన కార్యము? ఇంతకుఁ బుత్రులేమిగతులు గల్పింపఁగలరు? మోక్షమీయఁగలరా? పునర్జన్మము లేకుండఁ జేయఁగలరా? నరక బాధ తప్పింపఁగలరా? ఐహికదుఃఖములైన నణఁపఁగలరా? పున్నామనరకమునుండి తప్పింపఁగలరు. అంతతో నేమాయెం? పుత్రులు పెట్టు శ్రాద్ధమూలమునఁగాక వేఱుమార్గమున గతులు గలుగవా? శ్రుతి యేమిచెప్పుచున్నది. "అథయదు చైవాస్మి ఞ్ఛవ్యం కుర్వన్తి యది చనార్చిషమేవాభి సంభవంతి........సఏ తాన్ బ్రహ్మగమయ త్యేష దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తంతే" ఛాందో 4 అధ్యా. 15 ఖండము. 4-6 మంత్రములు.

ఈ వేదమంత్రములవలన నాత్మజ్ఞానముగలవానికి వాని బంధువులు ప్రేతకార్యములు చేసినను జేయకున్నను బునర్జన్మము లేదని యేర్పడుచున్నది. ఇట్లు గాకున్నచో

**శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య, మా మేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మా శుచః ॥**

ఇత్యాద్యనేక ప్రమాణవాక్యంబులు, న్యాసము, సన్న్యాసము వ్యర్థములగుచున్నవి. కావున జ్ఞానమను కన్నులులేక యజ్ఞానాంధకారమున మునిఁగియుండువానికిఁ గొడుకులు యూఁతకోలలై యుండవలయును గాని జ్ఞానచక్షుస్సులను గలవానికి వారులేకున్న నేకొఱఁతయు లేదు.

ఈ విషయమై శ్రీ శంకరాచార్యులవారు వివేకచూడామణియందు వ్రాసిన శ్లోకము లనువదింపఁదగినవి.

**శ్లో॥ ఋణమోచనకర్తారః, పితుః సంతి సుతాదయః**
**బంధమోచనకర్తా తు, స్వస్మా దన్యో న కశ్చన ॥**
**మస్తకన్యస్తభారాదే, ర్దుఃఖ మన్యై ర్నివార్యతే**
**క్షుదాధికృతదుఃఖం తు, వినా స్వేన న కేనచిత్ ॥**
**పథ్య మౌషధసేవా చ, క్రియతే యేన రోగిణా**
**ఆరోగ్యసిద్ధి ర్దృష్టాస్య, నాన్యానుష్ఠితకర్మణా.**

తండ్రిచేసిన యప్పులను దీర్చు కొడుకులు గలరుగాని సంసారబంధము నుండి విడిపింపఁగలవాఁడు తనకంటె నితరుఁడు లేఁడు. తలమీఁదనుండు బరువువలనఁ గలుగు దుఃఖము నితరులు వారింపఁగలరుగాని యాఁకలిదప్పులవలనఁ గలిగిన దుఃఖము తానుగాక మఱియెవఁడు వారింపఁగలఁడు. రోగమువచ్చినవాఁడు మందు తినిననే యారోగ్యముగలుగుట చూచుచున్నాము కాని యొకఁడు మందుతినిన వేఱొకనికి రోగముకుదురుట లేదుకదా. కావున హనుమంతునివలన నేర్చుకొనవలసిన మూఁడవవిషయము ముముక్షువు బ్రహ్మచర్యవ్రతస్థుఁడై యుండవలయుననుట.

అన్నలారా! యక్కలారా! బ్రహ్మచర్యము శ్రేష్ఠమని చెప్పితినని మీ గృహస్థధర్మము నికృష్టమని తలంపకుఁడు. బాల్యమునందే

జ్ఞానవైరాగ్యములు స్థిరపడెనేని యట్టివారు హనుమంతునివలె శుకునివలె నైష్ఠికబ్రహ్మచారులై యుండవచ్చును; లేదా భీష్మునివలె వ్రతమూనియైన నుండవచ్చును. ఎట్లున్నను బ్రహ్మచర్యమునకంటెను గార్హస్థ్యమే శ్రేష్ఠము. బ్రహ్మచర్య వానప్రస్థ సన్యాసములు కష్టైకసాధ్యములు. వ్రతభంగ మేమాత్రమైనను బతనకారణ మగును. గృహస్థధర్మము నిరపాయము. గృహస్థధర్మమనఁగా భార్యతోఁ గూడియుండి భార్యాసాహాయ్యముచే నడపు ధర్మము. గృహమనఁగా భార్యయనియు నర్థము. అయిన నిందొక్క భయముగలదు. వివాహకాలమందుఁ బురుషుఁడు భార్యనుద్దేశించి "ధర్మమునందు నర్థమునందుఁ గామమునందు నిన్ను నతిక్రమించి నేను బోను" అని యగ్నిసాక్షికముగఁ బ్రమాణముచేయును. దీని నతిక్రమించి కొందఱుపురుషులు కామమునకుఁ గ్రోధమునకు దాసులై తమ ధర్మపత్నులను నలక్ష్యపఱుచుచున్నారు. కామముచే నితర స్త్రీల మరగి జారులై కొందఱు రెండులోకంబులఁ జెడుచున్నారు. భార్యమీఁదనో యామె తల్లిదండ్రులమీఁదనో కోపించి కొందఱు భార్యల ననాదరదృష్టిఁ జూచుచున్నారు. ఇట్టివారు సజ్జనులని చెప్పరాదు. వేము వివాహకాలమునఁ జెప్పిన మంత్రముల యర్థము మాకుఁ దెలియునా? తెలియక చేసినపుడు మేమెట్లు బద్ధులమని కొంద ఱందురు. కొందఱు మా కిష్టము లేకున్న మా తల్లిదండ్రులు బలవంత పెట్టి చేసిరి. కావున దానిని మే మాదరింపమని కొందఱందురు. ఇరువురు మతిమాలినవారే. తాము మనుష్యులమని తలఁచువారు తాము చేయు కార్యములకుఁ దా ముత్తరవాదులని యెఱుఁగరా? అర్థము తెలిసికొని చేయవలదని యెవరనిరి? తెలిసికొనవలసిన విషయము తెలిసికొనకపోవుట యెవరిదోషము? అది యెట్టులైన నగుఁగాక. పురుషుఁడుగాని స్త్రీగాని తల్లిదండ్రుల స్వాధీనమందుండువఱకు వారుచేసిన పని తన కిష్టముండినను లేకుండినను నాదరింపవలసినది విధి. తండ్రిచేసిన కార్యమును దిరస్కరించువారు తండ్రిని ధిక్కరించువారేగదా. అది

మహాదోషము. శ్రీరామునంతటివాఁడు తన తండ్రి సమ్మతించి చేసిన వివాహము కావున సీతను విశేషగౌరవముతో నాదరించుచుండెనని శ్రీమద్రామాయణంబునఁ గలదు. సీత యనసూయాదేవితో

**ఉ. అంతట సత్యవాది జనకావనినాథుఁడు నన్ను రామభూ**
**కాంతున కీజలంబుఁ గొనెఁ, గైకొనఁ డయ్యెను దండ్రి యిష్టమా**
**వంత నెఱుంగరామి** నని

తండ్రి యిష్టము లేక రాముఁడు తన్నుఁ బరిణయమాడఁ డయ్యెనని చెప్పెను.

**కం. ప్రణతామరునకు యోషి**
**న్మణి పితృకృతదార యగుట మదిఁ బ్రియ యయ్యెన్**

అని వాల్మీకి చెప్పెను. ఇట్లుండఁ దల్లి దండ్రులు చేసిన వివాహమును గౌరవింపకుండవచ్చునా?

ఇట్లు భార్యను నిరాదరణ పఱుచువానికిఁ దల్లి దండ్రులను ధిక్కరించిన పాపము మొదటిది. రెండవది నిష్కారణముగ నిర్దోషురాలైన చిన్నదాని నుభయలోకభ్రష్టచేయుట. తన్ను భర్తయని పతియని ప్రాణనాథుఁడని యనన్యగతి యని సుఖముల కాధారమని విశ్వసించి తనకై దేహము ప్రాణము లర్పించియుండు దానిని దుఃఖపెట్టుటకంటె మహాదోషమేది గలదు? అది అంకుటా లయ్యేనేని యావలి కీడ్వవచ్చునుగాని యాదోషములేని వారిని మగలు బాధించుట చాల దోషము. ఇంతకుఁ దానెప్పుడు వివాహమాడెనో యప్పుడే పురుషుఁడు తన దేహము సగము దానికిఁ బంచి యిచ్చెను. ఒక సగము దుఃఖించుచుండఁ దక్కిన సగమున కెట్లు సుఖముగలదు? పురుషునకు భార్యయే యాత్మ. ఆత్మ దుఃఖించుచుండ దేహమునకు సుఖముగలదా? ఇంతకు భార్యాభర్తృ సంబంధమొక జన్మముతోఁ దొలఁగునదికాదు.

తల్లి దండ్రులు బిడ్డలు జన్మజన్మమున మాఱుదురుగాని భార్యాభర్తలు మాఱరు. ఎన్ని జన్మములైన వారే భార్యాభర్తలగుదురు. ఈ విషయము సతీపతి హితచర్య లందు వ్రాసితినిగదా. కావున బాటసారు లిరువురుకూడి ప్రయాణము చేయవలసివచ్చినపుడు పరస్పరము కలహించుచుఁ జేయుట బాగో యనుకూలురై చేయుటబాగో బుద్ధిగల వా రాలోచింపవలయును. గృహస్థుఁడై యుండియు భార్యాసంగమము మానినవాఁడు వేదానుశాసనమునకు విరుద్ధముగ వర్తించి సంతానతంతువు ఛేదించి తన నెత్తిపైఁ దానేమన్ను వేసికొనిన వాఁడగును. పుత్రునిఁగని పతి కర్పించినఁగాని భార్య ఋణము తీరదు. పతిని విడనాడిన భార్య యీ ఋణమెట్లు తీర్చుకోఁగలదు? వీరుసరిగానుండి భగవంతుఁడు సంతాన మీయకుండిన దోషము వీరిదిగాదు మనము శ్రీరామసేవకులము. వారి మార్గమే మన కనుష్ఠేయము. వారెట్లు వర్తించిరో యాలోచింపుఁడు. అట్టులే స్త్రీలును బతిని విడిచి చేయు దానధర్మములు జపతపములు సర్వము వ్యర్థము. మగని పేరిని మించిన మంత్రము లేదు. మగనిని మించిన దైవము లేఁడు. ఇట్టి భావానుష్ఠానములు గల వారికే దేవసేవ ఫలించును. కావున గార్హస్థ్యమందుండు నీ దోషమునకు మీరు పాలుపడకుందురని ప్రార్థించెదను. భార్యయందుఁ బ్రీతిలేనివాఁడు శ్రీసీతారాముల యెదుట నేమని నిలువఁగలఁడు? పతి భక్తిలేనిది సీతయెదుట నెట్లు నిలువఁగలదు. నిష్కారణముగ భార్య నాదరింపని భర్తను భర్త నాదరింపని భార్యనుజూచి దాంపత్య ధర్మ మెఱిఁగిన వారేమందురు? ఎట్లను గ్రహింతురు? కావున నిట్టివారు మీలో నెవరైన నుండిరేని మీశ్రేయస్సు సుఖము క్షేమముఁగోరి వచించు నామాట విని పరస్పర మనుకూలురై వర్తింతురుగాక యని వేఁడెదను. ఈ సమాజము వారికి సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమంతులే మార్గదర్శకులు. సందిగ్ధవిషయము లందెల్ల వారివలె

మనము వర్తింపవలయును. ఒక భార్య మరణించిన మరల వివాహముచేసికొనక యుండ వచ్చునుగాని యున్న భార్యను ననుకూలవతిని దుఃఖపెట్టువాఁడు గడియ గడియకుఁ బాపము సంపాదించు వాఁడగుటచేఁ నెన్ని జపతపంబులఁ గడదేఱఁ జాలఁడు. తా మనాదరించినట్లు వారు తమ్ము నాదరించినఁ దమ మనస్సెట్లుండునో యోజించి యా విషయమున స్త్రీలుగాని పురుషులుగాని ప్రమాదపడకుందురుగాక. సీతారాములు మిమ్మనుగ్రహింతురుగాక. దాంపత్య విషయమున లక్ష్మీనారాయణ, పార్వతీపరమేశ్వర, సరస్వతీ బ్రహ్మల తత్త్వము గ్రహింతురుగాక. ఇదిగాక యింకొకమనవి. సోదరులారా సోదరీరత్నములారా! మీ శ్రేయస్సుగోరి మీరీ సమాజమున సభ్యులరగుట మఱవకుఁడు. ఈ సమాజము మీకున్నత పదవులఁగాని బిరుదములఁగాని యీయఁజాలదు, గాని మీరు సాధింపఁగల రేని యుత్తమోత్తమ పదవి నీయఁగలదు. ఇది మీకు సాధ్యమేకాని యది సాధించుట మీ యిష్టమునందుఁ గలదు. ప్రతిదినము నుదయమున నిద్రలేవఁగానేకాని నిద్రించుటకుఁ బూర్వముగాని యేకాంతమున నిశ్చంచలమనమున మిమ్ము మీరే శోధించుకొనవలయును. మనయందు నితరులను బాధించు గుణము లేవియున్నవి? మన శ్రేయస్సునకు హాని కలిగించునవి యేం దుర్గుణములున్నవి? అని విమర్శించి శోధింపవలయును. తొలుతొల్త పరులకు బాధాకరములైన దుర్గుణములను వెంటనే మానవలయును. ఆవలఁ దనకు హాని గూర్చువాని నొకటివెంట నొకటియైన మానవలయును. తనతప్పు తాను దెలిసికొనువాఁడే పురుషుఁడు. ఆ తప్పులు సవరించుకొనినవాఁడు పురుషోత్తముఁడు. తన తప్పు తాను దెలిసికోలేనివాఁడు పశువు. తెలిసి సవరించుకొననివాఁ డెవఁడో. కావున మీ శ్రేయస్సుగోరి మీ రీ ప్రకారము శోధించుకొనుచు రాఁగా నెప్పుడు మీ పరిశుద్ధాంతరాత్మ నిర్వంచనముగ

నిర్దోషమని చెప్పునో యప్పుడు మీరు బాగుపడితిరనుకొండు. ఈసమాజము కీర్తిప్రతిష్ఠలు మీ కరగతములు. మీ శ్రేయస్సు మీ కరగతము. కావున నింతవఱ కెట్టుండినను నిఁకమీఁదఁ గామక్రోధలోభ మదమాత్సర్యాదుల వదలి యుభయలోక సౌఖ్యముఁ గాంచుఁడు. ఇది స్త్రీలకు నన్వయించును.

తమ పాపమున సగముపంచుకొని వారిపుణ్యమున సగము దేహమున సగమిచ్చిన భర్తల వంచించుచువా రేగతికిఁ బోదురో స్త్రీ లాలోచింపవలయును. గృహస్థుఁడుగా నుండువాఁడు

**సీ. "ఋతుకాలములఁ దనసతితోడ రమియించు,**
**పరమశీలుఁడు సదా బ్రహ్మచారి"**

యన్నట్టు నిషిద్ధకాలముల భార్యాసంగమము చేయకుండిన బ్రహ్మచర్య నిష్ఠుఁడేయగు. ఇట్లు నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతమూని హనుమంతుఁడు తల్లిదండ్రుల యాజ్ఞచొప్పున సుగ్రీవు నొద్ద మంత్రియైయుండె. ఇచ్చట నొక యాక్షేపము రావచ్చును. జ్ఞానిగానుండు వాఁడెందో యరణ్యముల వసించి స్వతంత్రుఁడై కాలక్షేపము చేయక శ్వవృత్తి నెట్లభిలషించె? ప్రతిఫలాపేక్ష లేదనినను బరాధీనపు బ్రదుకేకదా. పారతంత్ర్యము నిషిద్ధము కదా యందురు కాఁబోలు. ఉదరపోషణార్థమై దేహమును విక్రయించి యస్వతంత్రుఁడై యవమానము సహించి బ్రదుకు పారతంత్ర్యము నిషిద్ధముగాని భగవత్పారతంత్ర్యము భాగవత పారతంత్ర్యము సర్వథా నిషిద్ధముగాదు. శ్లాఘ్యమేయగు. సూర్యవంశమున భగవంతుఁడు శ్రీరాముఁడై జనించునని తెలిసి యాయనకుఁ గురువు పురోహితుఁడై తరింపఁగోరి నీచమైన రాజపురోహితత్వమును నంగీకరించిన వసిష్ఠమహర్షివలెనే శ్రీరామపద సేవాభిలాషియై హనుమంతుఁడు సుగ్రీవు నొద్దఁ జేరెను. నీవు సుగ్రీవునొద్ద నుండుము.

ఆయన నిమిత్తమై యొక మహాపురుషుఁడు కాలాంతరమున వచ్చును. ఆయనను జూడఁగానే నీకుఁగడుపులోఁ బ్రేవులు కరఁగిపోయినట్లయి భక్తి జనించును. ఆయన నీకు సేవ్యుఁడు అను జనకునియాజ్ఞచొప్పున సూర్యశిష్యుఁడైన హనుమంతుఁడు సూర్యపుత్రుఁడయిన సుగ్రీవునొద్ద సూర్యవంశజుఁడైన శ్రీరాముల సేవింపఁ దరుణము వేచి నిలుచుట శ్లాఘ్యమేయగునుగాని దూష్యముగాదు. సుగ్రీవుఁడు శ్లాఘ్యచరిత్రుఁడే కాని నింద్యుఁడు కాఁడు. ఆయనయొద్ద నుండుట నీచసేవగాదు. అదియునుగాక జ్ఞానికి జ్ఞానము కలుగువఱకే యరణ్యావాసము గుహావాసము లోనైనవికాని జ్ఞానము స్థిరపడినపిమ్మట నట్టివానితోఁ బనిలేదు. తీర్థమును దీర్థముగాను క్షేత్రమును క్షేత్రమునుగాను జేయు శక్తి వీనికేకలుగును.

**శ్లో॥ తస్మా త్సర్వనియంతారం, సర్వేషాం చ హృది స్థితమ్**
**భగవంతం ప్రసన్నా యే, తీర్థాది స్తై ర్విశుద్ధ్యతి**
**తావ ద్గచ్ఛే త్తు తీర్థాని, సరిత శ్చ సరాంసి చ**
**యావ న్నాభూ చ్ఛ భూపాల, విష్ణుభక్తిపరం మనః**
**కంఠావరోధరోమాశ్రుభిః, పరస్పరం లసమానాః**
**పావయంతి కులాని పృథివీం చ తీర్థీకుర్వంతి తీర్థాని**
**సుకర్మ కుర్వంతి కర్మాణి, సచ్ఛాస్త్రీకుర్వంతి శాస్త్రాణి.**

సర్వము నియమించు వాఁడును, నన్ని హృదయంబు నుండు వాఁడునునగు భగవంతుని గూర్చియెవఁడు ప్రపత్తి చేయునో యట్టి భక్తునిచేఁ దీర్థములు పవిత్రములగుచున్నవి. అట్టివారు తీర్థములను దీర్థములుగఁ జేయుదురు. కర్మములను సత్కర్మములుగఁ జేయుదురు. శాస్త్రములను సత్‌శాస్త్రములుగఁ జేయుదురు. ఎంతవఱకు విష్ణువుపై మనస్సు నిల్వదో యంత వఱకుఁ దీర్థయాత్రలునేళ్లలోఁ బుష్కరిణులలో స్నానములు చేయవలయును. భగవన్నామస్మరణము చేయునప్పుడు

డగ్గుత్తిక గగ్గురుపాటు, ఆనంద బాష్పములు నెవరికిఁ గలుగునో వారు కులమును దేశమునుఁ బావనము చేయుదురు.

ఇత్యాద్యనేక ప్రమాణములు గలవు. కావున జ్ఞానులు చేయరాని కార్యము హనుమంతుఁ డేదియుఁజేసిన వాఁడు కాఁడు.

ఇట్లు సుగ్రీవు నొద్దనుండు కాలంబున నొకానొకనాఁడు సీతాన్వేషణ తత్పరులైన రామలక్ష్మణులు పంపాసరస్తీరమునకు వచ్చుటయు సుగ్రీవుఁడు వారిని జూచి వాలిపంపిన చారులని భయపడి వారియొద్దకు హనుమంతుని బంపుటయుఁ దటస్థించెను. ఇచ్చట నొకటి రెండు విషయములు సూచించి యావలఁ గథాసరణి ననుసరించెదను.

ఇచ్చటనుండి హనుమంతుని యాచార్యత్వము ప్రారంభమగుచున్నది. హనుమంతుని యాచార్యత్వమును విశిష్టాద్వైతు లంగీకరించియున్న వారని ముందే విన్నవించితిని. ద్వైతులు నంగీకరించి యున్నవారు. ఎట్లన ఋగ్వేదములోని

**"వటిత్థా తద్వపుషే ధాయి దర్శతమ్ దేవస్య భర్గః**
**సహసో యతో జని యదో ముపహ్వరతే సాధతే మతిః**
**ఋతస్య ధేనాః అనయంత సస్రుతః" ఋగ్వే-I-141-1.**

ఈ మంత్రమునకు మధ్వాచార్యుల వ్యాఖ్యననుసరించి శ్రీశచంద్ర విద్యార్ణవుల వారిట్లు వ్రాసియున్నారు.

"The translation of these Verses according to Madhwa is given below.

Of the powerful God Vayu, the root-form consists of strength and wisdom, which supports the world and moves through it. He, thus, for the sake of three-fold forms, was born under the command of the Lord. His first form is called

wisdom (Hanumat) who stands near the throne of the Lord and fulfills all his commands and who carries the life-giving words of the True to Sita (or to mankind)

Note - The first function of Vayu or Christ is that of Hanumat or wisdom. It is the angel that brings the message of hope to the desponding soul as Hanuman carried the words of Rama to Sita.

The word 'han' denotes wisdom, therefore, Hanuman means he who possess wisdom, the word 'mati' also means he who possesses wisdom.

Therefore when the Rigveda uses the words "yadim upahavarga te sadhate matih", it refers to Hanuman. Similarly the words "Ritasya dhena anyant sa (su) srutah" means he who carries anantya the words (dhena) of Rama, the over truthful, su ritasya to Sita".

ఈ వాక్యములు వాయువు జ్ఞానబలాత్మకుఁడైన హిరణ్యగర్భుఁడేకాని దిక్పాలుఁడు కాఁడని నేనుజెప్పిన దానిని సిద్ధాంతీకరించుటయే కాక హనుమదాచార్యత్వమును స్థాపించుచున్నవి. హనుమంతుఁ డనఁగా జ్ఞానియని యేర్పడెను గనుక జ్ఞానియననెవఁడో విచారింతము. జితేంద్రియుఁడై ప్రత్యగాత్మ స్వరూపానుసంధానము చేయువాఁడు జ్ఞానియని కొందఱమతము. "జ్ఞానయోగోజితస్వాంతైః పరిశుద్ధాత్మని స్థితిః" ఐకాంతికాత్యంతికభక్తి గలిగి భగవత్స్వరూపానుసంధానముచేయు వాఁడని భక్తులమతము.

త్రిగుణాతీతుఁడైన హనుమంతుఁడు దాసోహమ్మను పరమభక్తుఁడేకాని స్వస్వరూపానుసంధానమాత్రము చేయుజ్ఞానికాఁడు ఏలన.

**శ్లో॥ సఏవ భక్తియోగాఖ్య, ఆత్యంతిక ఉదాహృతః**
**యేనాతివ్రజ్యత్రిగుణా, న్మద్భావా యోపపద్యతే.**
**శ్రీభాగ. 3 స్కం. 19 అధ్యా. 14**

దీనివలనఁ ద్రిగుణాతీతుఁ డాత్యంతిక భక్తుఁడని యేర్పడు చున్నది.

భక్తమతప్రకారము సంసారకారణము భక్తిహీనతగాని యజ్ఞానముగాదు కావున సంసారమోక్షకారణము భక్తియే కాని జ్ఞానముగాదు. గీతోపదేశము చూడుఁడు.

భగవద్గీతలో "జ్ఞానీ త్వా త్మై వ మే మతమ్" తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే "ప్రియో హి జ్ఞానినో ఽ త్యర్థ మహం సచ మమ ప్రియః".

ఇత్యాదులందు జ్ఞానశబ్దమునకును, ఛాందోగ్యమందలి "బ్రహ్మసంస్థోఽ మృతత్వమేతి" యిత్యాదులందలి సంస్థాశబ్దమునకును భక్తియే యర్థమని శాండిల్యాది మహర్షులే సిద్ధాంతీకరించి యున్నారు. కావున నాశ్రమ మనపేక్షితము.

**శ్లో॥ జ్ఞానీ తు పరమైకాంతీ, తదాయత్తాత్మజీవనః**
**తత్సంయోగవియోగైక, సుఖదుఃఖ స్త దేకధీః**
**భగవద్ధ్యానయోగోక్తి, వందనస్తుతికీర్తనైః**
**లబ్ధాత్మా తద్గతప్రాణ, మనోబుద్ధీంద్రియక్రియః**
**నిజకర్మాదిభక్త్యంతం, కుర్యా త్ప్రీ త్యేవ కారితః**
**ఉపాయతాం పరిత్యజ్య, న్యసే ద్దేవే తు తా మభీః**
**ఐకాంతాత్యంతదాస్యైకరతి స్తత్పద మాప్నుయాత్.**

ఇష్టదేవతయందు మాత్రమే భక్తిగలవాఁడు ఏకాంతి. వారలలో శ్రేష్ఠుఁడు పరమైకాంతి. వీఁడు అనన్యదేవతాకుఁడు గాకుండుటయేగాక

యనన్యప్రయోజనుఁడును గాఁడు. అనఁగా భగవత్ప్రాప్తి తద్దాస్యము దప్ప వేఱొకప్రయోజనమును వీఁడు గోరఁడు. భక్తియే యతనికి ముక్తి. ఇట్టిపరమై కాంతి జ్ఞానియనఁబడును. సత్యం శపేవారణశైలనాథ! వైకుంఠవాసే పి నఉ మేభిలాష" యనికదా భక్తాగ్రగణ్యులు చెప్పుదురు. ఈయన జీవనము పరమాత్మ స్వాధీనము. అనఁగాఁ బరమాత్మ పరముగానే తన జీవనము పుచ్చును. శాస్త్రోక్త భగవత్కైంకర్యసంయోగమే సుఖము. తద్వియోగవే యీయనకు దుఃఖము. ఈవిధముగ భగవంతునియందే చింతగలిగి యుండును. ఇట్టిజ్ఞాని భగవద్ధ్యానము (చింతన) భగవద్దర్శనము. భగవద్విషయము నుపదేశించుట, భగవన్నమస్కార స్తోత్ర కీర్తనములు చేయుట యను నీ కార్యములచేత నాత్మలాభము గలవాఁడై ప్రాణము మనస్సు బుద్ధీంద్రియ వ్యాపారములు భగవత్పరము చేయును. ఇట్టివాఁడు కేవల ప్రీతిచేతనే స్వవర్ణాశ్రమోచితములైన కర్మములను భక్తివఱకును జేయును. ఈ కార్యములను భగవత్కైంకర్యము లనుభావముతోఁ జేయునే కాని యివి భగవత్ప్రాప్తికి నుపాయములని చేయఁడు కావున నిర్భయుఁడై వర్తించును. అన్యదేవతా విషయముగానిదై యంతములేనట్టి భగవద్దాస్యమునందే యాసక్తిగలవాఁడు పరమపదమును బొందును. స్పష్ట మగ్రే భవిష్యతి యన్నట్టు హనుమంతుఁడెట్టి జ్ఞానియైనది యాయన చర్యయే తెలుపఁగలదు.

అట్టైన జ్ఞానము వ్యర్థమా యందురేని మోక్షసంపాదనమున కది సమర్థము కాకపోయినను మనోమాలిన్యమును హరించు సామర్థ్యముగలది కావున నది వ్యర్థము కాదు. శాస్త్రార్థతత్త్వజ్ఞానమువలనఁ గర్మయోగము, దానిచే జితేంద్రియుఁడైన వానికిఁ బరిశుద్ధాత్మ భావనారూపజ్ఞానయోగము, కేవల కర్మయోగముచేనైనను స్వరూపానుసంధానముచేనైనను నాత్మావలోకనము. దానివలన

నధికారియైనవానికి భక్తియోగము ఆవలఁ దత్ప్రాప్తియని పూర్వులు చెప్పిరి. ఇట్టిజ్ఞానయోగము లేకున్నను ముక్తి కధికారి కావచ్చును.

**శ్లో॥ శరణం త్వాం ప్రపన్నా యే, ధ్యానయోగవివర్జితాః ।**
**తేఽపి మృత్యు మతిక్రమ్య, యాంతి తద్వైష్ణవం పదమ్ ॥**

జ్ఞానయోగము లేనివాఁడును భగవంతుశరణు చొచ్చె నేని ముక్తుఁడగువని దీనియర్థము. భక్తికి నంగమైన జ్ఞానమే మోక్షాధికారము గలిగించునుగాని యితరమైనది కలిగింపఁజాలదు.

ఇఁక నాచార్యుఁ డనఁగా నెట్టివాఁడు. ఆయన కృత్యమేది? యని విచారింతము.

**శ్లో॥ ఆచినోతి హి శాస్త్రార్థా, నాచారే స్థాపయ త్యపి ।**
**స్వయ మాచరతే యస్మా, త్తస్మా దాచార్య ఉచ్యతే ॥**

యితరులకట్టిది పట్టుపడఁజేయు వాఁ డాచార్యుఁడు. ఈయన శిష్యునకు భగవంతునకు మధ్యస్థుఁడు. శిష్యుని దుఃఖము నివారింపఁ జేయువాఁడు. ఇది యాచార్యకృత్యము. ఈ రెంటిలో హనుమంతుఁడు శాస్త్రాధ్యయనము సూర్యునొద్దఁ జేసెననియు ముముక్షు వగుటచే నైష్ఠిక బ్రహ్మచారియై సదాచార సంపత్తి భగవద్దాస్యమున నెదురు చూచుచున్న వాఁడనియుఁ దెలిసికొంటిమి. ఇఁక నాచార్యకృత్యము నిర్వహించిన విధముఁజూతము. ఈ కార్యమును హనుమంతుఁడు ముమ్మాఱు గావించెను.

(1) రామ సుగ్రీవుల కైక్యము (2) సీతారాముల కైక్యము (3) రామ భరతుల కైక్యము. ఇట్టి యైక్యమే సాయుజ్యమని భక్తుల సిద్ధాంతము.

"రామ సుగ్రీవయో రైక్యం, దేవ్యేవం సమజాయత"యని హనుమంతుఁడే సీతాదేవితోఁ జెప్పెను.

**"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిష స్వజాతే తయో రన్యః పిప్పలం స్వా ద్వ త్త్యనశ్న న్నన్యో అభిచాకశీతి"**

ఒక వృక్షము (దేహము) నందే సమానముగఁగూడి సఖ్యము గలిగిన రెండు పక్షులు (జీవాత్మ పరమాత్మలు) గలవు. అందొకపక్షి తియ్యని ఫలములను (కర్మఫలములను) భుజించును. రెండవది భుజింపక మిక్కిలి ప్రకాశించుచుండును.

ఇట్టి యర్థమే యీ శ్రుతియందును గాన నయ్యెడి.

హనుమంతుఁడు సుగ్రీవుని మంత్రి. తనతో నాలోచించువానిని రక్షించువాఁడు మంత్రి. పంపాతీరముననున్న రామలక్ష్మణులఁజూచి భయపడి పరువెత్తుచున్న సుగ్రీవునకు ధైర్యముఁజెప్పి దూతయై రామలక్ష్మణుల యొద్దకుఁ బోవఁదలఁచి కపిరూపమువదలి సన్న్యాసివేషము ధరించి పంపాతీరమునకు దాఁటి రామలక్ష్మణులఁగని వారికి నమస్కరించి మీ రెవ్వరని వారిని నెన్నివిధములనో ప్రశ్నించెనుగాని వారు ప్రత్యుత్తర మీయరైరి. అప్పుడు తాను సుగ్రీవుని మంత్రినని యాయన పంపఁగా నతని హితంబుఁగోరి సన్న్యాసి వేషముతో వచ్చితినని నిజముగఁ దాను వానరుఁడనని హనుమంతుఁడు చెప్పెను.

సన్న్యాసము బ్రాహ్మణులకే కాని యితర వర్ణముల వారికి లేకుండుటచే సన్న్యాసి వేషముతో వచ్చిన హనుమంతునకు క్షత్రియులైన రామలక్ష్మణులు తొలుత నమస్కరింపవలసి యుండఁగా వారు నమస్కరింపకుండుట యటుండ హనుమత్సన్న్యాసియే వారికి నమస్కరించెను. రామలక్ష్మణు లింగితజ్ఞులు కావున నితఁడు దొంగసన్న్యాసియేకాని నిజమైన సన్న్యాసి గాఁడనివారు నమస్కరింపరైరి. దీనివలన వైరాగ్య జ్ఞానేతర కారణములచే నీకాలమునందువలె సన్న్యాసులైనవారు నమస్కారార్హులు కారని యేర్పడుచున్నది. 'కాషాయ

దండమాత్రేణ యతిః పూజ్యో నసంశయ' యనునది జ్ఞానవైరాగ్యములు పరిపక్వములు గాకున్నను, వానిని సాధించు సదభిప్రాయముతో సన్న్యాసులైన వారి విషయమేకాని పొట్టపోసి కొనుటకో భార్యలతోఁ గలహించియో యిత్యాది కారణములచే వేషమున మాత్రము సన్న్యాసులయిన వారి విషయముగాదు. జ్ఞానవైరాగ్యములు లేకున్నను శాస్త్రవిహితాచారములైన నుండవలయును. ఇఁక హనుమంతుఁడు నమస్కరించుటకుఁ గారణము కలదేమో చూతము. దానివలన మనము నేర్చుకొనఁదగినదేది? ఈ విషయమున గోవింద రాజీయ వ్యాఖ్యానమందీ వాక్యములు గాననయ్యెడి.

''అత్ర భిక్షురూపస్య హనుమతః ప్రణామా దన్యత్రాపి భిక్షోర్గృహస్థాదివిషయే ప్రణామః కర్తవ్యఏవేతి విజ్ఞాయతే. సన్న్యాసినో గృహస్థాది ప్రణామనిషేధ వచనాన్యజ్ఞ విషయాణీతిమంతవ్యాని. యది హి జ్ఞానాధికందృష్ట్వా కర్మమాత్రేణాధి కో యతిర్నప్రణమేత్, తర్హి "విప్రాణాం జ్ఞానతో జ్యేష్ఠ" మితి మనువచనం విరుధ్యేత న హి తత్ప్రణామనిషేధకం మనువచనం కించిద్దృశ్యతే. కింత్వనారభ్యాధీత మదృష్టాకరం యత్కించిద్యతి ప్రణామనిషేధవచనం కింవదంతీ సిద్ధం తస్యచ విషయోఽజ్ఞ గృహస్థాదిరూపః"

అని సన్న్యాసులు విజ్ఞులైన గృహస్థులకు నమస్కరింప వచ్చునని వచించిరి. ''రాజర్షిదేవప్రతిమౌ తాపసౌ సంశ్రితవ్రతౌ'' అని ప్రారంభించుటచేతనే రామలక్ష్మణులు సామాన్యమనుష్యులుగారనియు దేవాంశజులనియు హనుమ గ్రహించెననుట స్పష్టము. ఈ కారణముచేఁ దానెంత గొప్పవాఁడైనను దనకంటె గొప్పవారని తోఁచినపుడు వృథాభిమానముచే బిఱ్ఱబిగిసికొని యుండక హనుమంతునివలె "వినీతవదుపగమ్య" వినయముతో సమీపించి 'సంపూజ్య విధివత్' శాస్త్రప్రకారము పూజింపవలయునని గ్రహింపనగు.

మఱియొకటి విచార్యము. హనుమంతుఁడు శ్రీరాముల నుత్తమోత్త మనుష్యుఁడని మాత్రము గ్రహించెనా. లేక భగవంతుఁడని భక్తిచేసెనా యనియు నాలోచింపవలసి యున్నది. ఉత్తమోత్తమపురుషుఁడని మాత్రము తోఁచియుండినచో నప్పుడు కార్యములు దీర్చుటయేకాక "యత్ర యత్ర రఘునాథ కీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్ బాష్పవారి పరిపూర్ణలోచన" మై యామూర్తి యుండఁ గారణములేదు. ఈవిషయమై శ్రీమద్రామాయణము మనకేమైన నుపకరించునా యని చూచినచో హనుమద్వాక్యంబులందు

**"పద్మపత్రేక్షణౌ వీరౌ, జటామండలధారిణౌ**
**అన్యోన్యసదృశౌ వీరౌ, దేవలోకా ది వాగతౌ**

యని ద్వివచనమును

**ఆయతా శ్చ సువృత్తా శ్చ బాహవః పరిఘోపమాః"**

యని బాహువులవిషయంబున బహువచనంబును గాననయ్యె. రామలక్ష్మణులకు నిరువురకుఁ గలసి నాలుగుచేతులు గావున బహువచన ప్రయోగమందమా యనిన నిరువురకుఁ గలసి నాలుగుకన్నులు లేవా? ద్వివచనమేల ప్రయోగింపఁబడియెనను నాక్షేపము రాకపోదు. కావున రెండేసికన్నులు నాలుగేసి బాహువులనియే యర్థము చెప్పవలసి యుండును. ఈ విషయము గోవిందరాజీయమున నిట్లు సూచింపఁబడినది. "యద్వా హనుమతో భక్తత్వేన తస్య చతుర్భుజ వేషేణ దృశ్యోఽభవత్" హనుమంతుఁడు భక్తుఁడగుటచే నాయనకు శ్రీరాముఁడు చతుర్భుజుఁడై కానవచ్చెను.

దీనివలన నాచార్యుఁడు భగవద్భక్తిగలవాఁ డగుటయే కాక భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడయియు నుండవలెనని యేర్పడుచున్నది. ఇట్టివాఁడు భక్తులవిషయమై భగవంతునకుఁ

జెప్పఁగలఁడుగాని శిష్యునివలె గురువును భగవంతునకుఁ గ్రొత్త వాఁడైనచో నతఁడేమి చెప్పఁగలఁడు? ప్రభుపరిచితిగలవాఁడు కదా మఱియొక దీనునిగుఱించి యాయనకుఁ జెప్పఁగలఁడు?

ఇట్లు వారు గోచరింపఁగా నిఁకఁ దనవంచన పనికిరాదని యెంచి హనుమ తనవృత్తాంతము సుగ్రీవుని వృత్తాంతము సర్వముఁ దెలిపి వారిని మోచి తెచ్చి సుగ్రీవు సమ్ముఖమున నునిచి వారికి సఖ్యమొనర్చి సుగ్రీవున కభయ మిప్పించెను. సుగ్రీవుఁడు హనుమంతుని శ్రీరాములయొద్దకుఁ బంపుటచే నార్తుఁడే భగవదాభిముఖ్యము కలిగించుకొనుటకై యాచార్యు నాశ్రయింపవలయునని యేర్పడుచున్నది. ఈ సంభాషణమందు హనుమంతునిఁ గూర్చి శ్రీరాములు చెప్పిన వాక్యములు కొన్ని గలవు.

సీ. నెయ్యంబుఁ దియ్యంబు నేర్పు దీపింప నీ
వాక్యజ్ఞునకుఁ బ్రతివచన మిమ్ము
ఋగ్వేదమును జక్క నెఱుఁగనివాఁడు య
జుర్వేదధారణాశూన్యబుద్ధి
సామవేదమునఁ బ్రాజ్ఞత్వంబు లేనివాఁ
డీరీతి భాషింపనేరఁ డెపుడు
వ్యాకృతి యంతయు వల్లించె నిజముగ
నెన్నిమాఱులో యీతఁ డింతసేపు

గీ. మాటలాడ నొక్కమాట యేనియు నప
శబ్దితంబు గాదు చక్షువులనొ
ముఖముననొ లలాటమున బొమలందునొ
దోష మొక్కఁ డైనఁ దోఁప దెందు

చ. కొతుకులు లేక విస్తరము గూడక శంకకు సందు నీక య
ద్రుత మవిలంబితంబు నయి తొట్రులు పోవక లోగళైకసు

**స్థితమయి మధ్యమస్వరముచే నలరారెడి వీనివాక్కు సం**
**స్కృతమును సక్రమంబు శుభ మెంతయు హృద్యమునై రహించెడిన్.**

**గీ. అనఘ యీతని త్రిస్థలవ్యంజనస్థ**
**మైన చిత్రవచోగతి యాగ్రహమునఁ**
**జంపఁ గత్తిని బైకెత్తు శత్రు నైన**
**నెలమిఁ బొందింపఁజాలక యేల పోవు.**

వీనివలనఁ దాను జదివినఁ జదువును బుస్తకములందు గురువునందును మాత్రమే యుంచక హనుమంతుఁ డనుష్ఠాన మందుంచెనని యేర్పడుచున్నది. ఎవ్వరు మీరు? ఎక్కడివారు? ఏల వచ్చితిరి? అని యడిగిన మాటలలోనే సర్వశాస్త్రపాండిత్యమును వెడలఁ బుచ్చిన వాఁడెంతటి వాఁడుగా నుండవలయును?

ఇఁక రెండవ యాచార్యత్వము నెట్లు నిర్వహించెనో చూతము.

సీతారామలక్ష్మణులు పంచవటియందు వసించు సమయంబున మారీచుఁడు మాయామృగమై వచ్చుటయు సీతాదేవి దానియందా సక్తిగలిగి తనయొద్దనయున్న శ్రీరాముని దానిఁ బట్టి దేరనంపుటయు రామలక్ష్మణు లిరువురులేని సమయంబున దశకంఠుఁడు వచ్చి సీతను హరించుకొని పోయిలంకయందుంచుటయు రామలక్ష్మణులు సీతను వెదకుచువచ్చి సుగ్రీవునితోఁ జెలిమిచేసి సీతాదేవిని వెదక వానరులఁ బంపఁజేయుటయు నందు దక్షిణదిశ వెదకఁబోవు హనుమంతుని చేతికి శ్రీరాముఁడు తన ముద్దు టుంగరమునిచ్చి దీనిని నీవు సీతకుఁ జూపితివేని నిర్భయముగ నీతో నామె మాటలాడునని చెప్పి పంపుటయు హనుమంతుఁడు సముద్రముదాఁటి లంకఁజొచ్చి సీతనుగని ధైర్యము చెప్పి మరలివచ్చి శ్రీరామున కావార్త చెప్పుటయు శ్రీరాములు సకలసేనలతోడఁ బోయి సముద్రము దాఁటి లంక ముట్టడించి

రావణాదుల వధించి సీతను బరీక్షాపూర్వముగ గ్రహించి యయోధ్యకు వచ్చుటయు మీరంద ఱెఱింగిన విషయమే కదా!

ఇందు సీతయే జీవుఁడు. శ్రీరాముఁడే భగవంతుఁడు ఆయన సాన్నిధ్యమును విడుచుటచే దశగ్రీవుఁడను దశేంద్రియములకు వశపడి సీతయను జీవుఁడు లంకయను దేహమునఁ బ్రవేశించి కన్న కడగండ్ల పాలాయెనని పెద్దలు వచించిరి. జ్ఞానానందమయుఁడైన ప్రత్యగాత్మ ప్రకృతికి వశపడుట దేహమునఁ బ్రవేశించుటయు భగవత్సన్నిధానవాసము తొలఁగుట చేతనే. కావున సీత శ్రీరాముల నెడఁబాయుటకు స్వరూపజ్ఞానము లేమిచేతనా? మరల లంకయందు శ్రీరాములతోఁ గూడుట స్వస్వరూప జ్ఞానము కలుగుట చేతనా? భక్తిచేతనా? ఇవి విమర్శించితి మేని జీవుని దేహప్రాప్తికిఁ తద్విముక్తికిఁ గారణములు తెలియఁ గలము.

మారీచుఁడు మాయామృగమై రాఁగా సీత దానియందు స్నేహము గలదై దానినిబట్టి తెమ్మని శ్రీరామునిఁబంపెను. శ్రీరాములవియోగమును సీత యజ్ఞానముచే సహించినదికాదు. ఏలన శ్రీమద్రామాయణమున

**శ్లో॥ సా తం రుచిరదంతోష్ఠీ, రూప్యధాతుతనూరుహమ్ ।**
**విస్మయోత్ఫుల్లనయనా, సస్నేహం సముదైక్షత ॥**

**గీ. హారిదంతోష్ఠి విస్మయ హసితనేత్ర**
**స్నేహపూర్వంబుగాఁ జూచెఁ జిత్రమృగము.**

అని యున్నది. దీనివలన సీత రాముని యందెంతో ప్రేమ గలదయ్యును దత్కాలమున రాముని యందుండు స్నేహమునకంటెఁ జిత్రమృగమం దెక్కువ స్నేహము వహించినదయ్యెను. ఎక్కువ ప్రీతిగల పదార్థమును సేకరింపఁ దక్కువ ప్రీతిగలపదార్థమును విడనాడుట

సహజమేకదా. కావున రామ వియోగమునకుఁ బ్రేమలోపము కారణమని యేర్పడుచున్నది. కాని యజ్ఞానము కారణమని యేర్పడదు.

ఏలన. సీత రామలక్ష్మణులను బిలిచి మాయామృగమును జూపఁగానే సీత తన యభిప్రాయమును దెలుపకముందే లక్ష్మణుఁ డిది మారీచుని మాయ యని స్పష్టముగఁ దెలిపెను. కావున నది మాయామృగమని యజ్ఞానముచేఁ దెలియక సీత కోరినదని చెప్పవలను పడదు. ఇట్లు లక్ష్మణుఁడు చెప్పిన పిమ్మటఁ గూడ సీత దానియందలి మక్కువచే దానినిబట్టి తేర రాముని నియోగించెను.

**శ్లో॥ ఏవం బ్రువాణం కాకుత్స్థం, ప్రతివార్య శుచిస్మితా**
**ఉవాచ సీతా సంహృష్టా, చర్మణా హృతచేతనా ॥**
**ఆర్యపుత్రాభిరామో ఽసౌ, మృగో హరతి మే మనః**
**ఆనయైనం మహాబాహో, క్రీడార్థం నో భవిష్యతి.**

**ఉ. కంటిమె వింటిమే కనకకాంతిమణీమయమౌ మృగంబునా**
**కంటికిఁ జూడ మాయ యనఁగా, శుచిహాసిని భర్తఁ జేరి వా**
**ల్గంటి మఱంది నాఁగ నిజకాంతునితో మృగచర్మమందు లో**
**నంటిన మక్కువం బలికెఁ బ్రాణధవా! విను మాసగొల్పెడిన్.**

**ఉ. దాని మహాభుజా! లఘువిధంబునఁ బట్టుమ కేళి కౌను**

అని యిట్లు మగని నెత్తిపొడుపుమాటలతో మృగముఁ బట్టఁ బొమ్మని ప్రేరించెను. దీనివలన మృగమునందలి స్నేహమే సీతను భర్తృవియోగమును సహింపఁ జేసెనని స్పష్టపడియె.

చిత్రవిచిత్రవికారములు గలదని ప్రకృతిశబ్దార్థము. మాయామృగ మిదియే. దీని వికారచేష్టలుగని మక్కువపడి నిజధారణ పోషణకర్తయు భర్తయునగు భగవంతునియందు భక్తి పాయుటయే జీవాత్మకు

దేహప్రాప్తికిఁ గారణమయ్యెను. కావున జీవుని సంసారస్థితికి భక్తిహీనత కారణముగాని యజ్ఞానము కాదు.

కోరక కోరక సీత కోరినదగుటచే నామె కోరిక రిత్తపుచ్చరాదని శ్రీరాము డరిగెను. జీవాత్మవిషయమందోయన జీవాత్మకుఁ గించిత్స్వాతంత్ర్యము గలదు దానిచే జీవునకు సంకల్పించు నధికారముగలదు. ఆ సంకల్పము నెఱవేర్చుభారము భగవంతునిది. జీవుఁ డేదికోరినను భగవంతుఁడు నెఱవేర్చును గాని దానిఫలము నీవే యనుభవింపుమనును. ఒకదొంగ దృఢమైన భక్తితో దోఁపుగోరెనేని వానికోరిక నెఱవేర్చునుగాని దాని ఫలము దండనము నీవే యనుభవింపుమనును. అనుభవముచే బుద్ధివచ్చినట్లు బోధచేరాదు. రాముఁడు సీతను విడిచిపోవుట కిది కారణము.

తరువాత సీత లక్ష్మణుని బొమ్మనెను. శ్రీరాముఁడు భగవంతుఁడైనచో లక్ష్మణుఁడు భాగవతుఁడు. భగవంతునియందే భక్తిహీనయైనది భాగవతునియందు భక్తియుంచునా? ఇరువుర సాహాయ్య మెపుడు లేదయ్యెనో యప్పుడే సీత రావణుపాలయ్యెను. అట్లులే జీవుఁడు భగవంతునకు దూరమైనను భాగవతానుగ్రహమైనఁ గలవాఁడయ్యెనేని దుఃఖపడఁడు. ఏలన భాగవతుఁడే భగవంతునిఁ దోడితెచ్చును. ఆయన వచ్చువఱకు నరివర్గముపాలుగాకుండ రక్షించును. భగవంతుఁడు కోపించిన వానిని భక్తుఁడు కాపాడఁగలఁడుగాని భక్తుఁడు కోపించినవానిని భగవంతుఁడును గాపాడలేఁడు. క్షణమాత్ర వియోగసహనము భక్తిహీనత తెలుపునా యనిన

**"పున ర్విశ్లేషభీరుత్వం పరమా భక్తి రుచ్యతే"**

ఏమాత్రపు వియోగమునకైన భయపడుటే పరమభక్తి లక్షణము.

ఇంతియగాక 'జ్ఞానీ తు పరమైకాంతీ'యను శ్లోకమును జూడుఁడు.

**శ్లో॥ యన్ముహూర్తం క్షణం వాపి, వాసుదేవో న చింతితః**
**సా హాని స్తన్మహచ్ఛిద్రం, సాభ్రాంతి స్సా చ విక్రియా**
**ఏకస్మి న్న ప్యతిక్రాంతే, ముహూర్తే ధ్యానవర్జితే**
**దస్యుభి ర్ముషితే నేవ, యుక్త మాక్రందితుం భృశమ్**

అని ప్రమాణము లుండుటచే భర్తృవియోగసహిష్ణుత సీతయందలి భక్తిలోపమును సూచించుచున్నది.

ఇఁక లంకలో నశోకవనములో మరలఁ బతిప్రాప్తికై సీతచేసిన కార్యమేమి? ఆత్మానుసంధానము చేసెనా? అసంప్రజ్ఞాత సమాధియం దుండెనా? రెండునులేదు. హృదయమున రాముఁడువచ్చి తన్ను రక్షించునను దృఢవిశ్వాసము, నోర సర్వదా రామనామోచ్చారణముతప్ప మఱి యేదియుఁ జేసినది కాదు. కావున జీవాత్మ కివి రెండే తరణోపాయములు.

హనుమంతుఁడు సీతను వృక్షముపైనుండి దర్శించినపుడామె.

**గీ.** **పాపజీవిత నయి రామభద్రుఁ బాసి**
**యొడలఁ బ్రాణంబులను నిల్పియున్నదాన**
**ఛీ యనార్యను నసతిని శీలహీన**
**నేమి బ్రదు కిది తలప నా దేమివ్రతము.**

**సీ.** **ఈ వొక్కఁడవు దక్క నితరదైవము లే ద**
**టంచు నేఁ దలఁచినయట్టితలఁపు**
**వినఁ గోరి నీసూక్తి వికటరాక్షసపరు**
**షాలాపముల వినునట్టియోర్పు**
**నీతోడ శయనించు ప్రీతిమై నీనేలఁ**
**బడియున్నయట్టియాకడిఁదిదిటము**
**రాముఁ దేటికి నన్ను రక్షింపకుండు నన్**
**ధర్మమార్గంబున స్థైర్యవిధము**

**గీ. నాదు పరమపాతివ్రత్యనవ్యతపము**
**పాడు గాఁబోయె నాదుదౌర్భాగ్యముసను**
**ధరఁ గృతఘ్నున కొనరించుపరమకృతిని**
**బోలి నాపాప మెంత ప్రభూత మౌర.**

యీా ప్రకార మేడ్చుచుండెను. మీఁద నేను వివరించిన మహావిశ్వాసము.

ఇంతయేల? సీతావిలాప మంతయు నార్తుఁడైన భక్తుని విలాపమేకాని యితరము కాదు.

**శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్.**
**నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపం దగున్ దీనునిన్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!**

యని కరిరాజు మొఱవెట్టినట్లు మొఱపెట్టిపెట్టి తన దుఃఖమునకుఁ బ్రతీకార మేదియుఁగానరామిని నురిఁబోసి కొన సిద్ధపడియె. అట్టి దశయందు హనుమంతుఁడామెను జూచి పలుకరించి

**సీ. కావున నీవు శోకంబు మానుము తల్లి!**
**దుఃఖకాలం బెల్లఁ దొలఁగిపోయె**
**నిదె పోయి నేఁ జెప్ప ముదితులై క్రోఁతులు**
**వచ్చెద రొకగంతు వైచి యిటకు**
**నావీఁపుపై నెక్కి భూవిభుల్ శశిభాస్క**
**రులపోల్కి నీప్రోల నిలుచువార**
**లిట వచ్చి యీలంక నెల్ల సాయకములఁ**
**దుత్తుమురుగఁ బోవఁ ద్రుంచువారు**

**గీ. రామచంద్రవిభుఁడు రణరంగమం దిందు**
**సబలుఁ బంక్తికంఠు సంహరించి**
**నిన్నుఁ దోడుకొనుచు నెమ్మి నయోధ్యకుఁ**
**బోవువాఁడు పువ్వుఁబోఁణి వినుము.**

ఈ పద్యము చదివినపుడు

**శ్లో॥ సోఽహ మాశ్రితతంత్రాత్మా, స్మరామి చ తథా స్వయమ్**
**ఇమం మద్భోగయోగ్యంతు, కృపాపూరప్రకాశనాత్**
**నయామి పరమం స్థాన, మర్చిరాదిగతిం వినా**
**గరుడస్కంధ మారోప్య, యథేష్ట మనివారితః.**

పరమకారుణికుఁడనై భక్తవత్సలుఁడనై దీనజనరక్షాదీక్షుఁడనై సర్వశక్తుఁడనై సర్వస్వతంత్రుఁడనై యాశ్రితరక్షాపరతంత్రుఁడనైన నేను దన యవసానకాలంబునఁ గఫాది బాధచే యాదమఱచిపడియుండు భక్తుని నేనే స్మరించి నాదయ ప్రకాశింపఁ జేయుటకై నాకు భోగయోగ్యమైన పరమస్థానమునకు గరుడస్కంధమందెక్కించుకొని యర్చిరాది మార్గమునఁబోక యథేష్టముగ నడ్డములేక పరమపదమునకుఁ దీసికొనిపోయెదను.

అను భగవంతుని వాక్యములేల స్మరణమునకు లేకపోవును.

పరమైకాంతికులకు నర్చిరాదిమార్గముతోఁ బనిలేదు. సీతాదేవిని బుష్పకముపై నెక్కించుకొని చక్క నయోధ్యకు శ్రీరాముఁడు కొనిపోయినట్లే భగవంతుఁడు గరుడవాహనారూఢుఁడయి వచ్చి భక్తికాని ప్రపత్తిగాని చేసిన పరమైకాంతిని గొనిపోవును. ఇట్టిది యాచార్యనిష్ఠచే సాధ్యము. మన కిచట నాచార్యుఁడు హనుమంతుఁడే. పురుషకారముగా హనుమంతు గ్రహించితిమేని యాయనయే యానాఁడు సీతాదేవి యున్న చోటికి సుగ్రీవుఁ డున్నచోటికి భరతుఁ డున్నచోటికి శ్రీరాములను

బిలిచికొనివచ్చి రక్షింపఁజేసినట్టు నేఁడును దప్పక చేయునని స్వానుభవముచేఁ జెప్పఁగలను. ఇచ్చట హనుమంతుఁడు సీతాదేవికి రాముఁడే నీవని కాని నీవే రాముఁడనని తలఁచు కొనుచుండుమని కాని బోధింపలేదనుట భక్తులు గమనింపవలెను. ఇట్లు హనుమంతుఁడు రాముఁడు వచ్చును. నిన్నుఁ జెఱనుండి విడిపించి తనతోడఁ గొనిపోవునని సీతకు ధైర్యము చెప్పి రామునియొద్దకుఁ బోయి నియత, ప్రాణయుక్త, దేవియని మూఁడుమాటలలో విషయమంతయు సంగ్రహముగఁ దెలిపి యాపై

**ఉ. "నిన్ను మహానుభావ! కడునిర్మలచిత్తమునన్ స్మరించుచున్**
**సన్నుతభక్తిశీలములు సాధ్విగుణంబుఁ దపంబుఁ బాయకం**
**దున్నది నేను జూచితి"**

నని వివరించి చెప్పెను. ఇది యాచార్యకృత్యము. హనుమంతుఁడు దీని నిట్లు నిర్వహించెను. ఇట్టులే భరతునకు శ్రీరామాగమనవార్త చెప్పి రక్షించెను. తగిన యాచార్యుఁడు దొరకుటచే నాయన మూలమున సుగ్రీవునకు భగవత్సాన్నిధ్యము లభించెను. "హనుమద్వచనాచ్చైవ" హనుమంతుని మాటమీఁదనే శ్రీరాముఁడు సుగ్రీవుని రక్షించెనని నారదుఁడు వాల్మీకికి బోధించెను. సీత కట్టి భాగ్యము లేదు. యోగ్యుఁడగు నాచార్యుఁడు దొరకినవాఁడు గాఁడు. కావునఁ భగవంతుఁడే యాచార్యుఁ బంపువఱకు బరమాచార్యు భగవంతునే ప్రార్థించుచుండెను.

తల్లులారా! యిది మీ రెఱింగిన విషయమే. బిడ్డను నెడఁబాసి తల్లి యుండవలసివచ్చెనేని బిడ్డకంటెఁ దల్లియే యెక్కువ పరితాప పడుచుండును గదా. అందు బిడ్డ బాధపడునపుడు తల్లియే యెక్కువ బాధపడును. బిడ్డ తన బాధకై యేడ్చును. బిడ్డబాధకై తల్లి యేడ్చును.

"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖిత" యని మనుష్యులకు దుఃఖము కలిగినప్పు డంతకంటె నెక్కువగఁ దాను

దుఃఖించును అని శ్రీరాముని విషయమున వాల్మీకి చెప్పెను. అట్లులే జీవునకంటె వారి కష్టములకుఁగాను భగవంతుఁడే యెక్కువ దుఃఖించును. అందులఁ బరాధీనయై దుర్బలయై యొంటిచిక్కి యసహాయమై యున్నప్పుడు భగవంతుఁడే ధైర్యము చెప్పుటకై తగిన యాచార్యుని బంపును. కావున మనకును దగిన గురువు దొరకఁడేని యాయన నిమిత్తమై దేవురులాడి యెవనినో యొకని నిర్భాగ్యుని, ననాచారుని, దురాచారుని, కామినీకాంచనాసక్తుని, వంచకుని, భక్తిశూన్యుని నీచజాతివానిని గురువుగాఁగోరక భగవంతునే ప్రార్థించుచుంటిమేని యాయన యే యోగ్యుఁడగువాని నభిజ్ఞానముతోడ నంపును. అట్టివానిని సీత హనుమంతుని బరీక్షించినట్లు పరీక్షించి యావల విశ్వసింపవలెను గాని వేషధారులనెల్ల నమ్మరాదు. హనుమంతుఁడు సీతను బరీక్షించినట్లు గురువుశిష్యునిఁ బరీక్షించి నిజమైన శ్రద్ధాభక్తులు గలవాఁడని తోఁచిననే యుపదేశింపవలెను.

ఆచార్యకృత్యమును వచించితిని ఇఁక నాచార్యుఁ డెట్టివాఁడై యుండవలయునో యాయనలక్షణములను హనుమంతుని చర్యనుబట్టి కొంచెము వచించెదను. హనుమంతుఁడు వేదవేదాంగపారీణుఁడు. జ్ఞాని. బ్రహ్మచారి. ఈయన యెట్టి యస్ఖలితబ్రహ్మచారియైనది జితేంద్రియుఁడైనది రావణు నంతఃపురమున దిసమొలలతోఁ బరుండిన నూర్లకొలఁది సుందరుల నడుమ నేకాంతమున నిశ్చంచలమనస్కుఁడై సంచరించుటయే తెలుపుచున్నది. ఆహారము కేవల సాత్త్వికాహారమగు ఫలమూలములు. ధరించుటకా తెల్లని యేకవస్త్రము. "వివిధాభ్రఘనాపన్న గోచరో ధవళాంబర", యని ప్రయోగము. నివాసస్థానము. "పారిజాతతరు మూలవాసినమ్" అన్నట్లు వృక్షచ్ఛాయ. అత్యంతభక్తుఁడు. తానంతటి గొప్పవాఁడయ్యు దాసోహమ్మని నైచ్యాను సంధానముచేయువాఁడు. మహాయోగి. యత్ర యత్ర రఘునాథకీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలి

మ్మన్నట్టు భగవత్కథా శ్రవణమం దత్యంతకుతూహలుఁడు. భగవదాశ్రితుల రక్షించుటయం దెంత సాహసమైనఁ జేయు నసహాయశూరుఁడు. సాధువిరోధులు లోకవంచకులు మాయావులు నగు రాక్షసులపాలిపిడుగు. రాక్షసులు మఱెవ్వరోకారు విపరీత సాక్షరులే.

ఇట్లు నయమున భయమునఁ గార్యము దీర్పఁగలవాఁడే యాచార్యుఁడు. ఇట్టివాఁడే యీ కాలమున కుపకరించువాఁడు. భక్తలక్షణము సీతాదేవిచర్యవలనఁ దెలియనగు హనుమంతునిగుఱించిన తక్కు విషయములు హనుమంతుని చరిత్రమందును, సుందరకాండ పీఠికయందును వ్రాసియున్నవాఁడను. చర్వితచర్వణమనియు గ్రంథవిస్తరభీతిని, బ్రస్తావోచితవిషయము గాకుండుటను నవి యిందు వివరింపమానితిని. మన కోదండరామ సమాజాధ్యక్షుఁ డీ రామదాస సంజీవరాయఁడేకదా. ఆయన విషయమంతయుఁ దెలియఁగోరువా రా పుస్తకములఁ జదువవలయును.

సీతాదేవిని దొలుత హనుమంతుఁడు చూచినప్పుడు నమస్కరించుటయేకాక యామెతోఁ బ్రసంగించునపుడును జేతులుమోడ్చియే యుండెను. సెలవుతీసికొనునపుడును నమస్కరించెను. ఇంతయేకాదు. ఆమెనుగూర్చి ప్రసంగించునపుడంతయు నామెను స్మరించి యామెయుండు దిక్కునకు మరలి నమస్కరించుచుండెను. కావునఁ బురుషులు తామెంత గొప్పవారైనను నుత్తమస్త్రీల యెడ భయభక్తులుగలిగి వారిని నమస్కారపూర్వకముగ నాదరింపవలయునని యేర్పడుచున్నది. కావున మన మట్లే చేయవలయును. ప్రతిదినము నుదయమున నిద్దురలేవఁగానే మన యింటిలోనుండు పెద్దవారికెల్లఁ బాదము లంటి సాష్టాంగనమస్కారము చేయవలయును. ఈ కార్యమునందు నభిమానము లజ్జ పనికిరాదు. ప్రత్యక్ష దేవతలైన జననీజనకులయెడను స్త్రీ లత్తమామలయెడను భర్తయెడను భక్తి

నుంచఁజాలరేని పరోక్షముననుండు దేవునిపై నేమి భక్తి యుంచఁగలరు. కావున భక్తియోగము సాధింపఁదలచువారు దీనిని మానరాదు. పండుకొనియుండికాని పండుకొనియుండువారికిఁ గాని రోగులుగా నుండినఁ దప్ప నమస్కారము చేయరాదు.

జన్మముచేఁగాని, శీలముచేఁగాని, భక్తిజ్ఞాన వైరాగ్యములచేఁగాని యుత్తమలగు స్త్రీ లందఱకు వందనీయులే. ఎట్లనిన గొల్లచెలువల గుఱించి

"వందే నందవ్రజస్త్రీణాం, పాదరేణుమభీక్ష్ణశ" యని మహాయోగి యగునుద్ధవుఁడు వచించినపుడు మనబోంట్లమాట యేమిలెక్క.

ఈయన సనకాది మహర్షులకేమి బోధించెనో వినుఁడు.

**శ్లో॥ ఐహికేషు చ కార్యేషు, మహాపత్సు చ సర్వదా ।**
**నైవ యోజ్యో రామమంత్రః, కేవలం మోక్షసాధకః ॥**
**ఐహికే సమనుప్రాప్తే, మాం స్మరే ద్రామసేవకమ్ ।**
**యో రామం సంస్మరే న్నిత్యం, భక్త్యా మనుపరాయణః ।**
**తస్యాహ మిష్టసంసిద్ధ్యై, దీక్షితోఽస్మి మునీశ్వరాః ॥**
**వాంచితార్థం ప్రదాస్యామి, భక్తానాం రాఘవస్య తు ।**
**సర్వదా జాగరూకోఽస్మి, రామకార్యధురంధరః ॥**

**రామరహస్యోపనిషత్తు 3 అధ్యా.**

ఐహికకార్యములు సాధించుట యందుఁగాని యాపద లందుఁగాని కేవలమోక్ష సాధకమైన రామమంత్రమును గూర్పనేరాదు. అట్టియైహికములందు రామ సేవకుఁడనైన నన్ను స్మరింపవలసినది. ఎవఁడు నిత్యము మంత్రాసక్తి గలిగి రాముని స్మరించునో యట్టివాని కోరికలు దీర్ప నేను గంకణము కట్టుకొని దీక్షవహించి యున్నాను. రామభక్తుల కోరికలను నేనే యిచ్చెదను. రామకార్య ధురంధరుఁడ

నగుటచే ఆ విషయమున నెప్పుడు జాగరూకుఁడనై యున్నాఁడను. అని హనుమంతుఁడు చెప్పెనని రామరహస్యోపనిషత్తునందుఁ గలదు. దీనివలన మనము శ్రీరామమంత్రమును సర్వదా జపింపవలయును గాని కోరికలు కోరరాదు. అట్లు చేసితిమేని మన కష్టములను దీర్చి కోరిక లొసంగుటకు నాంజనేయుఁడు పూఁట పడియున్నవాఁడు. అట్టి సందర్భముల మనము హనుమంతునిఁ బ్రార్థించి యాయనకుఁ బ్రదక్షిణములు చేయుటో సుందరకాండము పారాయణము చేయుటో చేసితిమేని మన కోరికలు నెఱవేఱును; కష్టములు తీఱును. భక్తికొలఁది ఫలము.

శ్రీరాములు వైకుంఠమునకుఁ బోవు సమయంబున

**చం. ........పావమాని వినయంబు దొలంకఁగ హర్షవార్ధిలో**
**మునుఁగుచు విన్నవించెఁ గడుఁ బుణ్యము త్వత్కథ లోకమందుఁబా**
**వనగతి నుండుదాఁక ధర వర్తిలుచుందు భవన్నిదేశముం**
**గొని** యని వేఁడెను. దీని యభిప్రాయము గ్రహింపుఁడు.

పుణ్యమిచ్చునదియై లోకమును బావనము చేయునది యైన రాము కథ యెంతదాఁక నీ లోకమందుండునో యంతవఱకుందు ననుటచే రామ కథ యేనాఁడు లోకములో మఱవఁబడునో యావల నీ లోకము వసింపఁదగినది కాదని యేర్పడుచున్నది. దీనివలన రామస్మరణములేని గ్రామము – రామస్మరణము లేని గృహము శ్మశానమువలె వాసయోగ్యములు గావు. రామస్మరణము లేనివాయి పాడుగోయి. "యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలి"మ్మని యుండుటచే మనము సర్వదా రామనామస్మరణ చేయుచుంటిమేని హనుమంతుఁడు మన యింఢ్ల నిలుకడగా నిలుచును. అట్టి మహానుభావుఁడు మన యింటికి వచ్చుటయు దీర్ఘకాలముండుటయుఁ గలిగెనేని మనకంటె ధన్యులెవరు? మఱచితిమా వెడలిపోవును గావున సర్వదా

శ్రీరామరామరామయని రామనామస్మరణ మందే మనకాలము గడుపుదము. ఇంతకంటె మనకు సుఖమై క్షేమకరమైన మార్గములేదు. ఇది నమ్మితిమా బాగుపడుదుము – నమ్మకపోయితిమా చెడుదుము. ఎట్లందురేని యింద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రమున బంధించెను. మూఢులకు భక్తిబలము తెలియనట్లే యితరరాక్షసు లాబంధములందు నమ్మకము లేక త్రాళ్లతోఁ దలుగులతో హనుమంతుని గట్టిరి. వెంటనే యస్త్రబంధము లూడిపోయెను. రాముఁడే దైవము. భక్తియే యుపాయమని నమ్మియుంటిమా మనకే భయము లేదు. అటు నమ్మక యందఱు దేవతలే, యందఱు రక్షించువారే, యన్నియు నుపాయము లేయని పాఱెడిబండ్లకుఁ బదములు చాఁచితిమా మనకధోగతియే. పాతివ్రత్యము, భక్తి, ప్రపత్తి వ్యభిచారము సహింపవు.

అన్నలారా! తల్లులారా! నిద్రించు మిమ్ము 'మేలుకొలుపు'చే మేలుకొలిపితిని. శ్రీరాములసేవకుల మైన మనకు శ్రేయస్కర మార్గమేదియో తెలిసికొనుటముఖ్యమగుటచేఁ నింతకుఁ బూర్వము భక్తిప్రాశస్త్యము గుఱించి చెప్పితిని. శ్రీరాములను భక్తిపూర్వకముగ నాచార్యమూలమున సమీపింపవలయును గనుక నిప్పు డాచార్యులను గుఱించి చెప్పితిని. మన దైవమగు శ్రీరాములనామము మాహాత్మ్య మింతకుముందే చెప్పితిని. రామపరత్త్వమును జెప్పితిని. ఆయనదయ సంపాదించుకొను విధము సీతోపదేశమునఁ జెప్పితిని. మనమెట్టిదేవుని సేవించుచున్నాము. ఆయన మనకేమి చేయఁగలఁడు లోనగు విషయము తెలిసికొనవలయునుగదా. మనమిట్లు పరస్పరము శ్రీరామచంద్ర విషయము చెప్పుచుఁ గాలక్షేపముచేసి సంసారము దరింతము. వేఱొండుమార్గములు మనకు వలదు. ఇంతకంటె మంచిమార్గము లేదు.

హనుమంతుని విషయమై మఱి కొన్నిటిని జెప్పి యీ యుపన్యాసము ముగించెదను. శ్రీరాములయందు షడ్గుణము లున్నను "బలాఢ్యాద్భోధాత్

సంకర్షణస్త్వ" మ్మన్నట్టు బలజ్ఞానము లధికములని యొక వైష్ణవ గ్రంథమునఁ జదివితిని. అట్లైనచో బలజ్ఞానాధికునకు బలజ్ఞానాధికుఁడు బంటౌట సమంజసమేకదా.

సీత యాత్మయని ముందే చెప్పితిని హనుమంతుఁడు జ్ఞానియనఁగా బరమభక్తుఁడనియుఁ జెప్పితిని, భక్తునకు నాత్మావలోకనము కావలసినదే కావున నాయన సీతను జూచుటకై పోవునప్పు డెన్నివిఘ్నములు కలిగెనో యన్నియు నాత్మావలోకనపరుఁడై సంసారము దాఁటఁ గోరువానికిని గలుగును సుందరకాండ పీఠిక చూడుఁడు.

ఇట్టివాఁడు విరాగియై హనుమంతునివలెఁ గౌపీనధారియై యిల్లువెడలఁగానే వీని మేలుకోరిన వీని మిత్రులే మైత్రిచేతనే వీనికి విఘ్న కారకులగుదురు. మైనాకుఁ డడ్డపడుట యిదియేకదా. ఆవల వీనికి దేవతలే కొన్ని విఘ్నములు కల్పింతురు. సురసావృత్తాంతమిదియే కదా! ఆవల దేహమునుండి యాత్మను వెలికిఁదీసి యభ్యసించునపు డాకాశసంచారములగు దుష్టభూతములు పీడించును. ఇదియే సింహికావృత్తాంతము. ఆవల ననాహత చక్రముఁగాచు శక్తు లడ్డుపడును. ఇదియేం లంకారాక్షసి ఇన్ని గండములు దప్పించుకొని హృదయారామమున నాత్మను వెదకవలయును. లంక హృదయ మెట్లగునందురేమో, 'లంకా' - యనుదానిని తలక్రిందుగఁ జదివిన 'కాలం' అని యగును. క. యనినను కం అనినను జలమునకుఁ బేరు. దానికి నలంకారమైనది కాలం-కమలం-గావున లంకా యనునది పద్మమని యేర్పడెను. లంకయనఁగా దేహమని పూర్వులే వ్రాసియున్నారు. ఆత్మవాసస్థానము హృదయము. ఇంటిగదిలో నుండు వాఁ డింటిలో నున్నవాఁడేకదా.

"నాయమాత్మా బలహీనేన లభ్యః న చ ప్రమాదాత్" అన్నట్టు బలహీనునకు హెచ్చరిక తప్పియుండువానికి నాత్మసాక్షాత్కారము లేదు.

రాముఁడు సీతను జూచిరమ్మనిన హనుమంతుఁడు స్త్రీయుఁ బతివ్రతయునైన సీతకు దుష్టులు గలిగించు బాధచూచి సైరింపఁజాలక దుష్ట శిక్షణార్థము శిష్టరక్షణార్థము పుట్టిన శ్రీరాముల బంటగుటచే నాయన ధర్మమందే ప్రవర్తించుట న్యాయమని రాక్షసులతోఁ బోరొనరించెను. కావున శుష్క వేదాంతులు - దొంగయోగులు మాయసన్యాసులను రాక్షసులవాదములను విష్ణుభక్తులు ధ్వంసము చేయవలయును.

'న మే భక్తః ప్రణశ్యతి' యను వాక్యము సత్యపడుటకై సీతారాములు హనుమంతునకు యుద్ధవేళఁగాని తోఁకఁ గాల్చినపుడుగాని యాపదలు కలుగనీక కాపాడిరి. కావున "రాముని నమ్మినవారికి నెన్నఁడు రావుర యాపద" లనుట సత్యము. మఱియును "గురుం ప్రకాశయే ద్ధీమాన్, మంత్రం యత్నేన గోపయేత్" అను ప్రమాణము కలుగుటఁబట్టి శిష్యుఁడు తన గురువుపేరు ప్రకాశపఱుపవచ్చును గాని మంత్రమును మాత్రము బయలుపఱుపరాదు కావుననే హనుమంతుఁడు ''దాసోహం కోసలేంద్రస్య, రామస్యాక్లిష్టకర్మణ" యని తాను రామదాసుఁడనని మాత్రము చెప్పెను. గురువు ప్రసిద్ధుఁడును సమర్థుఁడును జనులకుఁ బూజ్యుఁడునై యాయనపేరు చెప్పినంత శిష్యునకు గౌరవము గలిగించువాఁడునై యుండవలయును.

**శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే ॥**

అనఁగా భక్తులగు సాధువుల రక్షించుటకును దుష్టులను శిక్షించుటకును ధర్మము లోకమున స్థాపించుటకును నేను యుగయుగమున నవతరించుచుందునని భగవంతుఁడు సెలవిచ్చెను. శ్రీరాములొకచేత విల్లు రెండవచేత జ్ఞానముద్ర ధరించుటయు జ్ఞానబలసంపన్నుఁడని తెలుపుచున్నది. ఆయనచేసిన కార్యము

లట్టివేయైయున్నవి. ఆయనదానుఁ డాంజనేయు లొకచేత సంజీవనీపర్వతమును, రెండవచేత గదయును ధరించి యున్న వాఁడు దీనివలన నాయన భక్తరక్షణము - దుష్టశిక్షణము చేయువాఁడని స్పష్టమయ్యెను. దీనివలన గురు వేధర్మమందుండునో శిష్యుఁడు నాధర్మమందే యుండవలయుననుట స్పష్టపడియె. అధర్మ మనుసరణీయము గాదు.

కాలనేమికథ శ్రీమద్రామాయణంబున లేదు. అది ప్రక్షిప్తము. అయినను నది మీకందఱకుఁ దెలిసియుండుటచే దానిని గొంచెముగ వివరించెదను.

రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛపోయినపుడు సంజీవనిఁ దెచ్చుటకై హనుమంతుఁడు గగనమార్గంబునఁ బోవుచుండెను. ఈవార్త యెఱిఁగి రావణాసురుఁడు కాలనేమియనువానిని బిలిచి నీవు త్రోవలో ధాన్యమాలినియుండు సరస్సునొద్ద మాయచే ఋష్యాశ్రమముగఁ గల్పించుకొనియుండి హనుమంతుని సంజీవని దేకుండ నుదయమువఱకు విఘ్నపఱుపుమని బోధించి పంపెను. వాఁడట్టులే మునివేషము వహించియుండెను. ఆకాశమార్గమునఁబోవు హనుమంతుఁ డాయాశ్రమమును జూచి మునుపు నేనీత్రోవఁ బోయినపు డీయాశ్రమము లేదే. నేను దోవతప్పితినాయని సందేహించి యాఋషి నడిగి తెలిసికొనిపోదమని యందు దిగి యామునినిగాంచి నమస్కరించి నిలఁబడి "స్వామీ! నేను హనుమంతుఁడను. రామకార్యార్థమై సంజీవనిఁ దేర హిమవంతమునకుఁ బోవుచున్నాను. త్రోవతప్పితినను సందేహము కలిగినది. అదియునుగాక దప్పియగుచున్నది. మంచినీళ్లమడుఁగుండినఁ జెప్పుము" అని యడిగెను. ఆమునియు నవునవును నీ చరిత్రమంతయు జ్ఞానదృష్టిచే నెఱిఁగితిని. రావణుశక్తిచే మూర్ఛపోయిన లక్ష్మణు బ్రదికింపఁ సంజీవనికై పోవుచున్నావు. అదిగోఁ గొంచెముదూరమున నొక పెద్ద

తటాకమున్నది దానియం దమృతతుల్యములైన జలములు గలవు. పోయి త్రావిరమ్ము. నీకుఁ జక్కనిబోధ చేసెదనని చెప్పెను. వాఁడు చూపినమార్గమున హనుమంతుఁడు పోయి మడుఁగులో దిగి నీళ్లు ద్రావుచుండఁ బెనుమొసలివచ్చి కాలుపట్టుకొని నీళ్లలోనికి లాగెను. హనుమంతుఁడు దానిని లాగితీరమున వేయఁగానే యది యప్సరసయై హనుమంతునితో నిట్లనియె. ఆంజనేయా! రామకార్యధురంధరా! నేనొక యప్సరసను. ధాన్యమాలినియనుపేరిదానను ఒక మునీశ్వరు శాపంబున మకరినై యీ సరస్సునందుంటిని. నిన్నేనాఁడు రామకార్యార్థమై పోవు హనుమంతుఁడు బయటవేయునో యానాఁడు నీకు శాపముపోవునని ముని యనుగ్రహించెను. వీఁడు మునిగాఁడు. మాయావి. కాలనేమియను రాక్షసుఁడు. నీకు విఘ్నము కలిగింప రావణప్రేరితుఁడై వచ్చినవాఁడు. వానిని వధించి యీ మార్గముననే హిమవంతమునకుఁ బొమ్ము. కార్యసిద్ధి యగుయ్యెడుమని యది యాకాశమార్గమునఁ బోయెను. హనుమంతుఁడును మరలి దొంగమునియొద్దకు వచ్చి నమ్రునివలె నిలఁబడెను, వాడాంజనేయునిఁ జూచి “హనుమంతా! నీకెట్టి భ్రాంతి కలిగెను. నీవు నావంటి వేదాంతులసేవ చేసినవాఁడవు కావు. జ్ఞానమార్గము నీవెఱుంగవు. రాముఁడెవఁడు. లక్ష్మణుఁ డెవఁడు – రావణుఁడెవఁడు – రావణశక్తిచే లక్ష్మణుఁడు మూర్ఛపోవుట యననేమి? నాయనా చెప్పెద వినుము. ఇదంతయు మిథ్య. ప్రపంచమే మిథ్య. అది ఎండమావివంటిది. కలవంటిది. నీవు నిద్రపోవుచున్నావు. చీఁకటిలోఁ బరువులు పాఱుచున్నావు. మేలుకొమ్ము. ముత్తెపుఁజిప్ప వెండివలెఁగనిపించుటెట్టిదో – త్రాఁడు పామువలెఁ దోఁచుటెట్టిదో ప్రపంచము నట్టిద. కావున దీనిని సత్యమని నమ్మకుము. రాముఁడు మిథ్య – లక్ష్మణుఁడు మిథ్య – రావణుఁడు మిథ్య – శక్తిమిథ్య – మూర్ఛమిథ్య. కావున నూరక గాసిపడకుము. పొమ్ము” అని యుపదేశించిన హనుమంతుఁడు వానిని జూచి “మునీశ్వరా సర్వము

మిథ్యయేకదా. అటైన నిదియు మిథ్యయేకదాయని గట్టి పిడికిట వానితలపై నొక గ్రుద్దు గ్రుద్దెను. వాఁడు మాయవిడిచి తనతో యుద్ధముచేయఁగా వానిని వధించిమరలఁ బయనించి సంజీవనిఁ చేకొని వచ్చుచుండెను. హనుమంతుఁడు సంజీవనిఁ దెచ్చువార్తవిని రావణుఁడు మాల్యవంతుని బంపెను. అతఁడు రాక్షససేనతోడఁ బోయి సముద్రము పై వచ్చు హనుమతో యుద్ధముచేసెను. హనుమంతుఁడు వానిని సపరివారముగ వధించి సంజీవనిఁ దెచ్చి లక్ష్మణు బ్రతికించెను.

కాలనేమివంటి దొంగవేదాంతు లీ కాలమునఁ బెక్కురు గలరు. శంకరాద్వైతప్రకారమైనను బ్రపంచము పారమార్థిక దశయందు బ్రహ్మము దృష్టికి మిథ్యగాని వ్యావహారికదశ యందు మనకుఁగాదు. ఇది తెలియని మూఢులు వ్యవహారదశ యందును జగత్తుమిథ్యయని బోధింతురు. ఇట్టివారిని జక్కఁబెట్టుటకు హనుమంతుఁడు చూపినదే సరియైన మార్గము. నిజమైన యద్వైతజ్ఞానముగలవా రట్లనరు.

మాల్యవంతుఁ డనఁగాఁ బూలహారములు గలవాఁడని యర్థము. దానివలన మాల్యవంతులనఁగా ధనికులు భోగులని యేర్పడుచున్నది. ఇట్టివారు సత్కార్యములందు సాహాయ్యము చేయుటకు మాఱు విఘ్నములను జేయుదురు. స్త్రీలు నందుఁ గష్టదశయం దుండువారు సత్కార్యములకు సహాయపడుదురు.

లంకాదహనమునకు ముందు బద్ధుఁడై తేఁబడిన హనుమంతునిఁజూచి రావణుఁడు నీ వెవ్వఁడవు? ని న్నెవరు పంపిరి? ఇంద్రుఁడు పంపెనా? వరుణుఁడు పంపెనా? యముఁడు పంపెనా? విష్ణువు పంపెనా? యని యడిగెను. రాముఁడు సాక్షాద్విష్ణువని యెఱింగియు హనుమంతుఁడు నన్ను విష్ణువు పంపలేదని చెప్పెను. శ్రీరామచంద్రమూర్తి మనకిట్టి భక్తి ననుగ్రహించునుగాక.

హనుమంతుఁడు తన బుద్ధిబల దేహబలములచే నెట్టే యోగ్యతాపత్రికలు సంపాదించెనో కొన్ని తెలిపి యీ యుపన్యాసమునుండి విరమించెదను.

**ఉ. వానరలోకనాయక! భవత్కృత మన్యదురాసదంబు నీ**
**యూనినకార్యముం జలుప నొయ్యనఁ బొమ్ము శుభంబు గల్గు నె**
**వ్వానికి ధైర్యమున్ మతియు వారక దాక్ష్యము దృష్టి నీవలెన్**
**జానుగఁ గల్గువానికి నసాధ్యము లే దది యెట్టికార్య మేన్.**

ఇది దేవతల వాక్యము.

'ఈవె శూరుండవు నీవె సమర్థుండ వీవె ప్రాజ్ఞుఁడవు కపీంద్ర చంద్ర సామాన్యవానరుఁగా మది నమ్మంగఁజాల'. ఇది సీతాదేవి వాక్యము.

**ఉ. నాకుఁ గలట్టిసర్వము ధనంబు నొసంగినఁ గాని పోదు హృ**
**ద్వ్యాకులతావిధంబు, ధనవంతుఁడఁ గా నిఁక మాఱుమేలు నే**
**నేకరణిం ఘటింపఁగల నియ్యెడఁ గావున నాదుకౌఁగిలిన్**
**గైకొనవయ్య దాని ప్రతిగా మహితాత్మక! మారుతాత్మజా ॥**

ఇది శ్రీరామవాక్యము.

**కం. అతిలక్షణసంపన్నం**
**బతిమాధుర్యగుణభూషణాంచితమును స**
**మ్మత మష్టాంగయుతం బగు**
**మతి యొప్పఁగ నీవ నేర్తు మాటాడంగన్**

**చం. అనిలునకున్ సుతుండవు మహాత్మపరంబగు ధార్మికుండవున్**
**ఘనబలశౌర్యసత్త్వశ్రుతకాంతిపరాక్రమధీరతాక్షమా**
**వినయధృతిప్రశస్తగుణవిశ్రుతదాక్ష్యగుణాదు లెల్ల నో**
**యనఘ! త్వదాశ్రయంబున మహారుచిసంపదఁ దాల్చి వెల్గెడిన్.**

ఇవి సీతాదేవివాక్యంబులు.

కం. శౌర్యము నయసాధనమును
ధైర్యంబు పరాక్రమంబు దాక్ష్యము బలమున్
స్థైర్యము ప్రాజ్ఞతమహిమయు
నార్యగుణాన నెలవుకొనియె హనుమంతునెడన్.

ఇది రామవాక్యము.

మత్తకో. స్థైర్యధైర్యపరాక్రమక్రమసాహసంబుల శౌర్యగాం
భీర్యబుద్ధులఁ జాతురీనయవీర్యయుక్తుల సూక్తిమా
ధుర్యకార్యధురీణతాజనతుష్టికారణచర్యలన్
సూర్యశిష్యత కీప్రభంజనసూతికిన్ సము లుందురే

ఇది యగస్త్యమహర్షివాక్యము.

ఇంతటి మహానుభావుఁడు మన సమాజమున కధ్యక్షుఁడు కావున నాయన యందు మనము భయభక్తివిశ్వాసములుగల వారమై వర్తించితిమేని శ్రీసీతారామానుగ్రహంబు సులభంబగు. దీనిని జ్ఞప్తియందుందుఁడు. ఇఁక నొండువిషయము చెప్పెదను. అంతటితో శ్రీసీతారామస్మరణముతో నీసభ చాలింతము.

శ్లో॥ అన్నం పానం ధనం వస్త్ర, మాయు రారోగ్య మాస్పదమ్
ఆప ద్యపి న యాచేత పూజకః పురుషోత్తమమ్
తత్పాదభక్తిజ్ఞానాభ్యాం, ఫల మన్య త్కదాచన
న యాచే త్తృణతో విఘ్నం, యాచనా న్నశ్యతి ధ్రువమ్.

అన్నము – పానము – ధనము – వస్త్రము – ఆయుస్సు. ఆరోగ్యము – ఇల్లు – వీనిని భక్తుఁడగువాఁ డాపదవేళలందైనను భగవంతుని యాచింపరాదు. ఆయనభక్తి జ్ఞానములను దప్ప భగవంతుని మఱి దేనిని నెప్పుడైనఁ గోరరాదు. అట్లు గోరెనా చెడుట సత్యము అను నియతి భక్తులు పాటింపవలసినది విధి. ఇట్లుండ నాంజనేయుఁడు శ్రీరాములను

"కదుపుణ్యము త్వత్కథ లోకమందుఁ బావనగతి నుండు దాఁక ధరవర్తిలుచుందు"నని కోరెను. ఇది దీర్ఘాయువును గోరుటయేకదా అయిన నిది దోషముగాదు. గుణమేయగును. మనము నట్లు గోరవచ్చును.

"గంగా యమునయోర్మధ్యే యే యే వసంతి, తేమే ప్రసన్నాత్మానః చిరంజీవితం వర్ధయంతి"యని సంధ్యవార్చు నపుడు చెప్పుదురు. ఇట్లు దీర్ఘకాలజీవితము గోరుట యైహిక సుఖానుభవాభిలాషచేఁగాదు. దీర్ఘకాలము భగవత్సేవచేయుట కనుకూలపదుటకే కావున నట్టి తలంపుతో దీర్ఘాయువు కోరవచ్చును. శాండిల్య భక్తిసూత్రములందు 2-1-18.

తదర్థప్రాణస్థాన మవశ్యకర్తవ్యముగాఁ జెప్పఁబడెను. ఇట్టిస్థితి కృతకృత్యులుగాఁ గోరువారికి మాత్రమేకాదు. కృతకృత్యులైన నారదాదులును తదేకారాధనార్థము ప్రాణధారణము చేయుచున్నారు. నృసింహతాపనియందు "యం సర్వే దేవాన మంతి ముముక్షవో బ్రహ్మావాదినశ్చ" యని కలదు కదా. కావున మనము యావజ్జీవము- సర్వస్వము - శ్రీరామపదారవిందారాధనమందే వినియోగింపవలయును. ఏదికోరినను ఆయన యారాధననిమిత్తమే కోరవలయును. స్వప్రయోజనార్థమేదియుఁ కోరరాదు.

**శ్లో॥ నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ**
**నమోఽస్తు దేవ్యై జనకాత్మజాయై**
**నమోఽస్తు వాతాత్మభువే వరాయ**
**నమోఽస్తు వల్మీకభవాయ తస్మై.**

**శ్రీరామార్పణ మస్తు**

# శ్రీ సీతోపదేశము

# శ్రీ సీతోపదేశము

శ్రీమత్కోదండరామసేవక సమాజ సభ్యులైన తల్లులారా తండ్రులారా! ఏమతమం దుండువారైనను నామతధర్మములను బూర్ణముగ నెఱుంగవలయును. అట్లు తెలియని వాఁడు తా నామతము వాడనిఁ చెప్పుకొనుటకు యోగ్యుదు కాఁడు. నేఁటికాలమున నద్వైతలక్షణ మెఱుఁగని యద్వైతులును, విశిష్టాద్వైతమన నేమో యెఱుఁగని విశిష్టాద్వైతులును, ద్వైత మన నేమోతెలియని ద్వైతులును వేయింటికి 999 మంది గలరు. మతధర్మమే తెలియకుండిన నెట్లా ధర్మమును వీరనుష్ఠింపఁగలరు? ఎట్లు కృతార్థులుగాఁగలరు? విబూదులు, తిరుమణులు, బొగ్గలు మోక్ష మియ్యఁగలవా? కావున నేమతమం దెవఁడుండునో వాఁడామత ధర్మములను దెలిసి యాప్రకారమనుష్ఠించిననే బాగుపడును.

మనది భక్తిమతము. మనము రామసేవకులము. ఈ మతధర్మము లిరువది యైదని మీకీయఁబడిన యంగీకారపత్రముల వెనుకప్రక్కను, ద్వితీయసోపానమందును ముద్రింపఁబడెను గదా. కావున వీని విషయము మీరెరుగుట యావశ్యకము. ఆకారణముచేతనే జ్ఞానవాదుల మతము కంటెను, గర్మవాదుల మతముకంటెను, యోగవాదుల మతముకంటెను భక్తిమతము శ్రేష్ఠమైనదని భక్తిప్రాశస్త్య మనుగ్రంథమున సిద్ధాంతీకరింపఁబడెను. అట్టిభక్తిచే నుపాస్యుఁడగుపరదైవతము శ్రీరాముఁడని శ్రీరామపరత్వ మనుగ్రంథమున వచించితిని. అట్టిఁ శ్రీరామచంద్రమూర్తియనుగ్రహము మన కెట్లు సులభసాధ్యమగునో యిఁక నుపన్యసించెదను.

ఒక ప్రభువుదయ మనము సంపాదింపవలసియుండినచో నాయనకు నాప్తులైనవారిదయను ముందు సంపాదింపవలయును. అట్లు సంపాదింప మేని మనకుఁ బ్రభుననుగ్రహము గలుగుట దుష్కరము. స్వశక్తిచే రాజును

మెప్పించి యాయనదయను సంపాదించెద ననుటయందు నహంకార లోపము గలుగుటయే కాక యది కష్టతమసాధ్యము నగును. రాజు వినయవంతుని మెచ్చునట్లు గర్విని మెచ్చఁడు. పెద్దమ్రాఁకులు వెల్లువపాలై పోవుచుండ వినయముచేఁగదా తుంగలు క్షేమముగానుండుట. కావున వినయవంతునకు హాని యెన్నఁడు లేదు. ఒకవేళ స్వశక్తిచే రాజానుగ్రహమును మనము సంపాదించుకొనినను రాజున కాప్తులుగా నుండువారి నలక్ష్యపఱిచితిమేని యేనాఁడైన నొకనాడు మనగర్వముచే చెడుట సత్యము. ఎట్లందురేని వినుండు.

ఒక నబాబునకుఁ జెల్లెలి మగఁడొకడు కలదు నబాబు నాకు బావ గదా. యికఁ మంత్రులతో నా కేమిపని యని గర్వించి వారలను నలక్ష్యపఱచి తిరుగుచుండువాడు. ఈ నబాబుమఱఁది బంధుత్వబలమున నబాబుదయ సంపాదించుకొని తనజీవనార్థము కొన్ని గ్రామము లిమ్మని యాయనను గోరెను. నబాబు దానికి సమ్మతించి మంత్రిని బిలిచి యీయనకుఁ బెద్దగ్రామములుగ 10-12 గ్రామములు జహగీర్ వ్రాసి యిమ్మని యాజ్ఞాపించెను. ఆ మంత్రియు సమ్మతించి మేలైన పత్రము దెప్పించి దానిచుట్టు బంగారునీటితోఁదీఁగెలుగను బుష్పములుగను నలంకరించి దానియందుఁ బెద్దయక్షరములతో సుందరముగ నుండునట్లు పేరు పెద్దవిగా నుండు కుగ్రామములను నొకదాని కొకటి సంబంధము లేక దిక్కున కొకటిగాఁ బదిపండ్రెండు గ్రామములను వ్రాసి నబాబు చేవ్రాలు చేయించి యాయన మఱఁది కిచ్చెను. దానిని వాఁడు గైకొని మహాసంతోషముతోఁ బల్లకీ నెక్కి తగినపరివారముతో నాగ్రామములను స్వాధీనపఱిచికొనఁ బోయి యొక్కొక్క గ్రామమును విచారింపఁగా నొకదాని కొకటి 10-12 ఆమడలకంటె సమీపమున నుండునది యొక్కటియు లేకుండెను. అవియైనను,

**సీ. ఆకాల మీకాల మేకాల మనకుండఁ బల్లేరుగాయలు పట్టెఁదేసి**
**ఆకాల మీకాల మేకాల మనకుండ జిల్లేడుకాయలు జిట్టెఁదేసి**

ఫలించునవియే కాని ధాన్యము పండునది యొకటియు లేదు.

ఆ సాహేబుగారు దిమ్మతిరిగి యిది మంత్రి చేసిన వంచనయని కోపో ద్రేకమునఁ గన్ను లెఱ్ఱచేసికొని మండిపడుచు గడ్డమాడించుచు, మీసములు దువ్వుచు మంత్రినిఁ భస్మభూతునిఁ జేయవలయునని చయ్యన నవాబునొద్దకు వచ్చి నీవు చిన్న చిన్న గ్రామములను నొకదానికొకటి చాలదూరమున నున్నవిగా వ్రాసియిచ్చితివి. నిన్ను మంత్రి మోసగించె నని మంత్రిని దూషించి నీది గ్రుడ్డిదొరతనముగా నున్నది యని యతనిని నోనాడెను. నవాబు మంత్రిని బిలిపించి యేమి మంత్రీ! గ్రామములు చాల దూరదూరమున వ్రాసితివఁట చిన్నవట యని యడిగెను. అట్లు నేనేల చేయుదును? పెద్ద గ్రామములను దగ్గఱదగ్గఱగా నుండునట్లు చూచి వ్రాసితి నని యాదానపత్రముఁ దెప్పించి చదివిచూడుఁడు నవాబు గారు! ఎంతదగ్గఱ వ్రాసితినో యెంతెంతపెద్దవో యని పత్రమును జూపెను నీవు చెప్పినదే సత్య మని నవాబు మఱదిని జీవాట్లు పెట్టి పంపెను.

మఱియొకకథ వినుఁడు. భుక్కుండుఁ డనునొక బ్రాహ్మణుఁడు చతుష్షష్టివిద్యలు నేర్చిన సుప్రసిద్ధుఁడు కలఁడు. ఈయన సదాచారసంపన్నుఁడై యోగియై యొకగుహయందుఁ దపస్సు చేసికొనుచుండెను. ఈయన మహిమను బాండిత్యమును మేధాబలమును విని యొకరా జాపండితుని దర్శించి యతని మహిమఁగొనియాడి యతనిదయ సంపాదించుకొని యా గుహయొద్దనే కాచికొనియుండి కొన్నినాళ్లు సమస్తపదార్థములాయనకు సమర్పించుచు నాయన ధ్యానకాలమందుఁ దప్పఁ దక్కినవేళల నాయనతో నిష్టగోష్ఠి నుండుచుఁ గాలము గడుపుచుఁడా నేవ్యవహారము పరిష్కరించినను నేయేర్పాటు చేసినను నే గృహకృత్యము నిర్వర్తించినను నాయన సమ్మతి

గైకొనియాయనచెప్పినచొప్పునఁ జేయుచుండెను. ఇట్లు చేయుచుఁ గొన్నినాళ్లకుఁ దనరాజధానికిఁ బిలిచికొనిపోయి తగినగృహ మేర్పాటుచేసి యందుగాఁపుర ముంచి సమస్తకార్యము లాయన యనుమతిచొప్పునఁ జేయుచుండెను. దీనివలన రాజు నామకార్థమే కాని నిజమైనరాజా పండితుఁడే యయ్యెను. ఆయనను జూచి సేవకు లందఱు భయపడి మంత్రులసేవ యును వదలి యాయననే సేవించుచుండిరి. తుదకారా జాపండితునియాజ్ఞ లేక భార్యతో సల్లాపమాడుటయుఁ జాలించెను. ఇది యందఱకు సహింపరాని దయ్యెను. అప్పుడు మంత్రి యాలోచించి యొకయుక్తి పన్ని ద్వారపాలకులను నితరసేవకులను బిలిచి రహస్యముగ వారితో రేపటినుండి ఘక్కండుఁడు రాచనగిరికి వచ్చెనేని భయపడక మెడపట్టి గెంటుఁడనియు దానివలన వారికేమైన విపత్తు వచ్చినఁ దాను రక్షించెద ననియుఁ జెప్పెను. మఱుసటినాఁ డుదయమున ఘక్కండుఁడు యథాప్రకారము రాచనగరికి వచ్చెను. రాజాజ్ఞ నీవు లోపలికిఁ బోరాదని ద్వారపాలకు లడ్డగించి దురాయి పెట్టిరి. బలాత్కారముగఁ బోయి మెడపట్టి గెంటిరి. గట్టిగ నఱచిన దూరముగఁ జేయిపట్టి లాగి కొనిపోయిరి. అతఁడు వచ్చినప్పుడంతయు నతని కిదే గతి.

ఘక్కండుఁ డేలరాలేదని రాజు విచారించెను. మంత్రి నేను బోయి తెలిసికొని వచ్చెద నని చెప్పి కొంతసేపు తన యింటనుండి వచ్చి ఘక్కండునకు దలనొప్పి యఁట. పట్టు పెట్టుకొని పండుకొని యున్నాఁడు. నేఁడురాలేను రేపు వచ్చెదను, క్షమింపుఁడని మీతో మనవి చేయుమని నాఁడు. ఆయనకు మందు లీయ మన నగరివైద్యుల నేర్పఱిచి వచ్చితి నని చెప్పెను. రాజు నిజమే యను కొనెను. అందఱు సేవకు లట్లే చెప్పిరి. ఆ మఱుసటి నాఁడుమంత్రి వచ్చి నిన్నటి రాత్రి జ్వరముకూడ వచ్చిన దఁట. అక్కడనే కనిపెట్టి యుండ వైద్యులను బనివాండ్రను నేర్పఱిచి వచ్చితి నని చెప్పెనుఁ మూఁడవనాడు సాయంకాలము మంత్రి వచ్చి మహారాజా!

యేమిచెప్పుదును! మనభుక్కుందునకు జన్ని పుట్టి లేచిలేచి పరువెత్తుచుఁ జూడ వచ్చినవారి నెల్లఁదిట్టుచు గుడ్డ విప్పి పాఱ వైచి యున్నాఁడు. మానము గల స్త్రీపురుషులచ్చటికిఁ బోవుటే కష్టముగా నున్నది. వైద్యులు మాత్రము తీవ్రమైన యౌషధముల నిర్వంచనముగఁ బ్రయోగించుచున్నారని చెప్పెను.

అయ్యో యట్లుండిన నేను బోయి చూడవలయునే యని రా జనెను. రామరామ యిప్పుడు మీవంటివారు పోరాదు. ఆయనకు దేహము స్మృతిదప్పి యెంతమాటనిన నంతమాట యెవరనైన ననుచున్నాఁడు. దిగంబరుఁడై యున్నాఁడు. మనుష్యులను గుర్తింపఁజాలఁడు. ఆయనను జూచుట కెవ్వరు రాఁగూడదని వైద్యులు కట్టుదిట్టములు చేసి యేకాంతమున నతని నుంచి వాకిట కావలివారి నుంచి యున్నారు. బ్రతికి బాగుండిన రేపు చూడవచ్చు ననెను. రాజట్టులే కానిమ్మనెను.

మఱుసటినాఁడు మంత్రిని రాజుగారు భుక్కుందున కెట్లున్నదని విచారించిరి. భుక్కుందుదు రాత్రియే మరణించె ననియు దహనముచేయుటకై పీనుఁగును శ్మశానమునకుఁ గొనిపోయి రనియు నిప్పటికిఁ గార్యమంతయు ముగించి యందఱు నింటికి వచ్చియుందు రనియు మంత్రి చెప్పెను. ఏ సేవకుని విచారించినను మంత్రి చెప్పినట్లే చెప్పుచుండిరి. రాజు చాలవిచారపడి యాయన యుత్తరక్రియలు యథావిధి దానములతోఁ జేయుఁడని చెప్పెను. దానికేమి కొఱఁత యని మంత్రి చెప్పెను. ఇన్నిదినములు భుక్కుందుదు వాకిటికి వచ్చినప్పు డెల్ల నెట్టఁబడుచుండెను.

ఆవలఁ బదిపదునైదు దినములకు రాజు మరల భుక్కుందుని గుఱించి ప్రస్తావించెను. రాజా! భుక్కుందుఁడు భూతమై తిరుగుచుఁ బ్రజలకుఁ బూర్వరూపముతోఁ గాన వచ్చుచు బెదరించుచున్నాఁడనియు మన నగరవాసులు భయపడి భూతవైద్యులఁ బిలిపించి రక్షలు కట్టుకొనుచుఁ జికిత్సలు చేయించు కొనుచున్నారనియు మంత్రి చెప్పెను. వాస్తవముగ

నతఁడు భూతమువలెనే తిరుగుచుండెను. రాజు సభకు రానీయవల దనినాఁడని వినుటయు సేవకులు తన్ను నెట్టుటయు విని కని నంతన యతనికిఁ బిచ్చి పట్టినట్టయ్యెను. సేవకు లెల్లరు నవమానింపఁ జొచ్చిరి. ప్రజలు నవ్వఁజొచ్చిరి. అతఁ డుండిన యింట నతని నుండనీక మంత్రి వెడలఁగొట్టించి కూటికి గుడ్డకు మొగము వాఁడునట్లు చేసెను. ఆకారణమున వాఁడు తలవిరియఁ బోసికొని దిసమొలతో వీధుల వెంటఁ దిరుగుచుండెను. పిల్లవాండ్రందఱు పిశాచ మని బూఁచి యని వానిని జూచి యఱవసాగిరి. కొందరు ఱాల ఱువ్విరి.

ఇట్లుండ నావలఁ గొన్నినాళ్లకు రాజు నగరముచూడఁ దలఁచి యేనుఁగుపై నెక్కి వీధులవెంటఁ బోవుచుండెను. రాజు కనుచూపు మేరలో భుక్కుందుని రానీయవలదని సేవకుల కెల్ల మంత్రి యాజ్ఞాపించెను. ఇది తెలిసికొని భుక్కుందుఁడు ముందు గానే దూరముగాఁబోయి యెవరికిఁగాన రాకుండున ట్లొక చెట్టెక్కి కొమ్మలసందున దాఁగియుండెను. రాజెక్కినయేనుఁగా చెట్టుక్రిందికి రాఁగానే రాజా రాజాయని యఱచుచు దిసమొలతోఁ జింపిరితలతో మాసినమేనితో భుక్కుందుఁడు నేల దుమికెను. రాజులికిపడెను, భుక్కుందుఁడు భూతమై తిరుగుచున్నాఁడని ముందుగానే మనవిచేసితినిగదా యని మంత్రి చెప్పి యీద్దుఁ డతని దూరముగానని సేవకుల కాజ్ఞాపించెను. రాజానుగ్రహము గలదు గదాయని గర్వించి రాజుల కాప్తులగువారిని నలక్ష్య పఱుచువానిగతి యిట్టి దగును.

రాజులు మనుష్యులు అజ్ఞులు. భగవంతుఁడు నట్టివాఁడా? యని మీరు ప్రశ్నింపవచ్చును. భగవంతుఁడు సర్వజ్ఞుఁ డగుట నిశ్చయమే కాని యాయన యందొకగుణము గలదు. తన్నలక్ష్యపఱిచిన భగవంతుఁడు సహించును గాని తన భక్తులను నాప్తులను నలక్ష్యపఱిచిన సహింపఁడు. భక్తులు చెఱుపఁదలచిన భగవంతుఁడడ్డ పడఁడు. ప్రహ్లాదుఁడు విభీషణుఁడు

ద్రౌపది అంబరీషుఁడు మొదలైనవారి చరిత్రములు నిదర్శనములు. అంతియకాదు. పార్వతి నలక్ష్యదృష్టిఁజూచి కదా చిత్రకేతుఁడు రాక్షసుఁడయ్యెను. నంది నవమానముగ మాటలాడి రావణుఁడు శప్తుఁడయెను. రావణవధానంతరమున శ్రీరామదర్శనార్థమై లంకలో సీతాదేవి యశోకవనమునుండి వచ్చునపుడు విభీషణుఁడు సీతాలోకనతత్పరులై మూఁగియున్న వానరులనెల్ల ద్రోవదీయుఁ డని యదలించెను. అప్పుడు శ్రీరాముఁడు కోపించి

**కం. ఏలా నన్ను విభీషణ**
**యేలిద మొనరించి జనము నిటు వేఁచె దిసీ**
**చాలింపుము నీయత్నము**
**చాలున్ వీరెల్ల నాకు స్వజనులు చుమ్మీ. (ఆ.వారా.యుద్ధ 2647)**

అని చెప్పెను.

**శ్లో॥ పశు ర్మనుష్యః పక్షీ వా, యే చ వైష్ణవసంశ్రయాః**
**తే నైవ తే ప్రయాస్యంతి, త ద్విష్ణోః పరమం పదమ్ ॥**

విష్ణుభక్తుల నాశ్రయించిన పశువులు గాని, మనుష్యులు గాని, పక్షులు గాని వారియనుగ్రహముచేతనే విష్ణువుయొక్క పరమపదమును బొందఁగలరు.

**శ్లో॥ మమ మద్భక్తభక్తేషు, ప్రీతి రభ్యధికా భవేత్**
**తస్మా న్మద్భక్తభక్తా శ్చ, పూజనీయా విశేషతః ॥**

నాకు నా భక్తుల భక్తులయం దధికప్రీతి గలదు. కావున నాభక్తభక్తులే విశేషముగఁ బూజింపఁదగువారు.

**శ్లో॥ సిద్ధి ర్భవతి వా నేతి, సంశయో ఽ చ్యుతసేవినామ్ ।**
**న సంశయో ఽ త్ర తద్భక్త, పరిచర్యారతాత్మనామ్ ॥**

భగవంతుని సేవించువారికి మోక్షసిద్ధి కలుగునో లేదో యని సంశయము కలుగవచ్చును గాని యాయనభక్తుల సేవించువారికి నిస్సంశయముగ మోక్షము కలదు.

**శ్లో॥ కేవలం భగవత్పాద, సేవయా విమలం మనః**
**న జాయతే యథా నిత్యం, తద్భక్తచరణార్చనాత్ ॥**

భక్తులపాదముల సేవించుటచే మనస్సు నిర్మలమైనట్టు కేవలభగవత్పాద సేవచేఁ గాదు. భక్తు లనఁగా శుష్కవేదాంతులు దొంగయోగులు మాయాసన్యాసులు గారు.

**శ్లో॥ దుర్లభా భగవద్యోగ, భావినో భువి మానవాః**
**తద్దర్శనా త్తదాలాపా, త్సులభం శాశ్వతం పదమ్ ॥**

భగవంతునియందే మనస్సు నిలిపి యుండుమనుష్యులు దుర్లభులు. అట్టివారు దొరికిరేని వారిదర్శనముచేతను, వారితో సంభాషించుటచేతను శాశ్వతమైన మోక్షపదము సులభ మగును.

**శ్లో॥ ఆరాధనానాం సర్వేషాం, విష్ణో రారాధనం పరమ్**
**తస్మా త్పరతరం ప్రోక్తం, తదీయారాధనం పరమ్ ॥**

అందఱ యారాధనములలో విష్ణ్వారాధనము శ్రేష్ఠము, దానికంటె నాయన భక్తులయారాధనము శ్రేష్ఠము.

ఈ వాక్యములవలన భగవదనుగ్రహమునకు భాగవతానుగ్రహమే సాధన మనియు, నదియే యమోఘము, సంసారసాగరము తరింప నుపాయ మనియు నేర్పడెను. ఈ విషయమున శ్రీశంకరాచార్యులవారు

"సత్సంగత్వే నిస్సంగత్వ" మనియు, వారిశిష్యులు "త్రిజగతి సజ్జనసంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా" యని సత్సాంగత్యమే జీవన్ముక్తికి సంసారమును దరించుటకు సాధనమని చెప్పిరి.

పరమపదసోపానమందు విశిష్టాద్వైతులు సత్సంగాద్భవనిస్పృహయని సాధుసాంగత్యము ప్రథమసోపానముగఁ జెప్పిరి.

ఇఁక నారదుఁడో

**ముఖ్యత స్తు మహత్కృపయైవ భగవత్కృపావేశా ద్వా**
**మహత్సంగ స్తు దుర్లభోఽ_గమ్యోఽ_మోఘ శ్చ**
**లభ్యతేఽ_పి తత్కృపయైవ తస్మిం స్తజ్జనే భేదాభావాత్**

అని సూత్రించెను.

అనఁగా మనుష్యులు సంసారమును దరింపవలయు ననిన మహాత్ముల దయయైనను భగవత్కృపావేశమైనను గలుగవలయును. సాధుసాంగత్యము దుర్లభము. సులభముగా దొరకునది గాదు. దొరకెనా వ్యర్థము గాదు. అట్లు దొరకుట భగవత్కృపచేతనే. భగవంతునకు భగవద్భక్తులకు భేదము లేదు అని యర్థము.

శ్రీభాగవతంబునఁ దృతీయస్కంధమందు

**శ్లో॥ సతాం ప్రసంగా న్మమవీర్యసంవిదో,**
**భవంతి హృత్కర్ణరసాయనాః కథాః**
**తజ్జోషణా దాశ్వపవర్గవర్త్మని**
**శ్రద్ధా రతి ర్భక్తి రనుక్రమిష్యతి**

సజ్జనగోష్ఠియందు వినుట కింపై మనోహరమై నామహిమను దెలుపు కథలే కొనియాడఁబడుచుండును. అవి వినుటచే శ్రద్ధ–ప్రీతి–భక్తి వరుసగా నుదయించును. అవియే మోక్షకారణము లగును మధ్యవర్తితో మాకుఁ బనిలే దను మతములవారుకూడ గురు వొకఁడు కావలయుననుచున్నారు.

**శ్లో॥ యే సంతుష్టా శ్ర్శుతోపేతా, స్సత్యార్జవదయాపరాః**
**జితేంద్రియా జితక్రోధా స్తా నుపాస్స్వ చ పృచ్ఛ చ.**

ఎప్పుడు సంతుష్టి గలవారు, పెద్దలవలన వినికిడి వేదాధ్యయనము గలవారు, సత్యము - ఋజుత్వము - దయగలవారు, జితేంద్రియులునై కోపమును జయించినవారు నయిన వారిని సేవించి యడుగుము.

**శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం, జ్ఞానిన స్తత్త్వదర్శినః భగవ. 4-34**

నీవీజ్ఞానమును సాష్టాంగనమస్కారముచేతను, ప్రశ్న చేతను సేవచేతను దెలిసి కొనవలయును. ఇట్లు చేసితివేని యథార్థ మెఱిగిఁన జ్ఞానులు నీకు జ్ఞాన ముపదేశింతురు అని కృష్ణుఁ డర్జుననకుఁ జెప్పెను.

**శ్లో॥ గురు రేవ పరం బ్రహ్మ, గురు రేవ పరం ధనమ్**
**గురు రేవ పరా విద్యా, గురు రేవ పరాయణమ్**
**గురు రేవ పరః కామో, గురు రేవ పరా గతిః**
**గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణుః, గురు స్సాక్షా న్మహేశ్వరః**
**గురు రేవ పరం బ్రహ్మ, తస్మై శ్రీగురవే నమః ॥**
**నాస్తి తత్త్వం గురోః పరమ్ ॥**

అని గురువును ధ్యానించెదరుగదా. ఇంతటియోగ్యత గలవారినే నేను సాధువులని మహాత్ములని మీఁదఁజెప్పితిని గాని యిప్పుడు పల్లెలవెంట సారాయి కల్లు బంగారు సంపాదించుకొనివచ్చుటకై శిష్యులను జేర్చుకొని గురువుల మని తిరుగు త్రాగుబోతులను మాంసభక్షకులను - వ్యభిచారులను శుష్కవేదాంతులను దొంగయోగులను నేను జెప్పలేదు. కావున మధ్యవర్తుల సాహాయ్య మక్కఱలేదనువారుకూడఁ దమకుఁ దెలియకయే మధ్యవర్తుల సాహాయ్య మపేక్షించుచున్నారు.

ప్రహ్లాదగజేంద్రులు గురుబోధలేకయే భక్తిసంపన్నులయిరికదా యందురేమో. అది పొరపాటభిప్రాయము. ప్రహ్లాదుఁడు మాతృగర్భమందుండఁగనే యాయనకు నారదుఁడు భక్తిమార్గ

ముపదేశించెను. గజేంద్రుఁడు పూర్వజన్మమున నుపదేశ మొంది శాపముచే దేహాంతరము కలిగినను దత్పూర్వజన్మ వాసన వదలినవాడు కాఁడు. శాప మడ్డపడకుండిన రాజుగా నున్నప్పుడే సారూప్య మందియుండును. కావున సాధుగురుకటాక్షము ముముక్షువున కావశ్యకమని యెఱుగువలయును.

వేదాంతము లనఁబడు నుపనిషత్తులు కేవలబ్రహ్మ విచారమునే కదాచేయును. అట్టివాని నధ్యయనము చేయునపుడు పఠించు శాంతి వాక్యములు తొలుత నెవ్వరిని బ్రార్థించుచున్నవో వినుఁడు.

**శం నో మిత్ర శ్శం వరుణః శం నో భవ త్వర్యమా**
**శం న ఇంద్రో బృహస్పతిః, శం నో విష్ణు రురుక్రమః ॥**

**స్వస్తి న ఇంద్రో వృద్ధశ్రవాః, స్వస్తి నః పూషా విశ్వదేవాః**
**స్వస్తి నః తార్క్ష్యో౽రిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతి ర్దధాతు ॥**

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యే మాక్షభి ర్యజత్రాః**
**స్థిరై రంగై స్తుష్టువాగ్ంస స్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః ॥**

తొలుత శుభకార్యములు చేయుటకు ముందు విఘ్నేశ్వరపూజయు విష్వక్సేనధ్యానము చేయుట యేల?

దేవత లనఁబడువారును మహాత్ములును భగవంతునకంటెఁ దక్కువ వారైనను మనకంటె గొప్పవారే. అందుఁ గొందఱు దేవతలు మనయంగములకు మనము చేయుకార్యములకు నధికారులై యున్నారు కావున వారిని నలక్ష్యపఱుపరాదు. వారికంటె మన మున్నతదశకు వచ్చినపుడు వారిని విసర్జింప వచ్చును.

ఒకప్రభువు ననుగ్రహమును మనము సంపాదింపఁ గోరినపుడు మధ్యవర్తు లావశ్యకమైనచో నట్టివారిలో రాజుభార్య యుత్తమురాలని

యంగీకరింపక తప్పదు. లోకానుభవమందును మన తండ్రివలనఁ గాఁదగినకార్యము నాయనచే మనతల్లి పూని చేయింపఁ గలిగిన ట్లితరులు చేయింపలేరుగదా తండ్రి కోపించి యుండినను నతనిని శాంతిపఱుచుచు శాంతిపడువఱకు రహస్యముగ రక్షించుచుఁ గ్రమముగ శాంతుని జేసి సమయ మెఱిఁగి మంచిమాటలచే బోధించి మరల మనయందుఁ దండ్రికి దయ వచ్చునట్లు చేయఁగలది తల్లియే.

భద్రాద్రిరామదాసుని రక్షింపఁజేసినది సీతయే కదా!

ముల్లోకములు సంచరించి రక్షకునిఁ గానక వచ్చి కాకాసురుఁడు సీతాదేవి కాళ్లపై శిరము దగులఁబడెను. అప్పుడు దయావతియైన యాలోకమాత యార్ద్రాపరాధుఁడై యెంతశిక్షకైనఁ బాత్రుఁడైనను వానిని బట్టి శ్రీరాములకాళ్లపై వైచెను. సీత క్షమించెనని యెఱిఁగి రాముఁడు రక్షించెను.

సీతాదేవి నలక్ష్యపఱిచి కదా శూర్పణఖ యాగతిఁ బట్టెను.

సీతాదేవి యెవ్వతె? సాక్షాల్లోకమాత లక్ష్మీదేవియే. మీ రీవిషయము సీతాదేవిచరిత్రయందుఁ జదివియున్నారు గనుక మరలఁ జెప్పవలసిన పనిలేదు. లక్ష్మీదేవి యెవ్వతె? ప్రపంచసృష్టిస్థితిసంహారములకుఁ గర్త్రియై జీవకోటి కాధారమై మోక్షదాత యగుశ్రీమన్నారాయణుని భార్య.

భర్తకు సగముదేహము భార్యయే, భర్తకు నాత్మయు భార్యయే, అయినప్పుడు భర్తకు భార్యకంటెఁ బ్రియురాలెవ్వతె?

అందు లక్ష్మీదేవి నారాయణహృదయవాసిని, నారాయణ ప్రేమస్వరూపిణి లక్ష్మీదేవి. (కృష్ణావతార తత్త్వము చూడుఁడు). నారాయణున కనపాయిని లక్ష్మీదేవి.

**శ్లో॥ యథా మయా జగద్వ్యాప్తం, స్వరూపేణ స్వభావతః**
**తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీ చ తథేశ్వరీ ॥**

నే నెట్లు స్వరూపముచేతను స్వభావముచేతను లోకమునం దంతయు వ్యాపించి యున్నవాఁడనో యట్లే యీవిశ్వ మంతయు లక్ష్మీదేవిచే వ్యాపింపఁబడియున్నది. ఆమెయే యీవిశ్వమునకు నియంత్రియు నీశ్వరియు, నని యర్థము.

**శ్లో॥ ప్రాయశ్చిత్తప్రసంగే తు, సర్వపాపసముద్భవే ।**
**మా మేకాం దేవదేవస్య, మహిషీం శరణం వ్రజేత్ ॥**

ఎట్టిపాపమునకైనఁ బ్రాయశ్చిత్తము పెట్టుకొనఁగోరు వారు దేవదేవుఁడైన శ్రీమన్నారాయణుని పట్టపుభార్యయైన నన్ను శరణుచొరవలయును.

**శ్లో॥ నిత్యైవేషా జగన్మాతా, విష్ణో శ్శ్రీ రనపాయినీ**

ఈ లోకమాతయైన లక్ష్మీదేవి విష్ణువు నెప్పుడు నెడఁబాయక కూడియే యుండును.

**శ్లో॥ సర్వకామప్రదాం రమ్యాం, సంసారార్ణవతారిణీమ్ ।**
**క్షిప్రప్రసాదినీం లక్ష్మీం, శరణ్యా మనుచింతయేత్ ॥**

సమస్తములైనకోరికలను గొనసాగించునదియుఁ, దల్లి వలెఁ గనుల కింపైనదియు, సంసార మనుసముద్రమునుండి తరింపఁజేయు నదియు శీఘ్రముగ ననుగ్రహించునదియు, రక్షించు యోగ్యత గలదగుటచే భక్తులు శరణుజొచ్చుటకు యోగ్యురాలైనదియు నగులక్ష్మీదేవిని నెప్పుడు ధ్యానించుచుండవలయును.

“భాస్కరేణ ప్రభా యథా” యన్నట్లు సూర్యునకు నెండ, చంద్రునకు వెన్నెల యెట్టిదో రామునకు సీత, నారాయణునకు లక్ష్మి యట్టిది.

ఇత్యాది ప్రమాణవాక్యము లనేకములు గలవు, వీనివలన లక్ష్మీనారాయణులు కూడియే యుందురు. లక్ష్మి యున్నచోట నారాయణుఁడు నారాయణుఁడున్నచోట లక్ష్మి లేక యుండదు. సీతాదేవిని నశోకవనములో బాధించుచున్న రాక్షసస్త్రీలను జూచి త్రిజట యేమిచెప్పెనో వినుఁడు.

**కం. అదరించియు బెదరించియు,**
**ముదలించియు గాసిపెట్టమో మన, మేలా**
**సదయ యగు? ననఁగ వలవదు**
**కదిసెంబో బెదద మనకుఁ గాకుత్థునిచేన్.**

**కం. ప్రణతిప్రసన్న జానకి,**
**యణుమాత్రంబైన సందియము లేదు సుఁడీ**
**క్షణదాచరసతులారా!**
**యణుమధ్యను వేఁడుఁడీ మహాపదఁబాపున్.**

ఇూప్రకారము బోధింపఁబడి రాక్షసస్త్రీలు సీతాదేవి కొకనమస్కారముచేసి రక్షింపు మని వేఁడఁగా వారి కాదయావతి యభయహస్తమిచ్చెను. హనుమంతుఁడు వారిని జంపెద నన్నప్పుడు సీతాదేవి యాయన కుపదేశించిన వాక్యరత్నముల వినుఁడు.

**కం. తన కపకార మొనర్చిన,**
**మనుజున కపకృతి నొనర్ప మదిఁ దలఁపఁడు స**
**జ్జనుఁ, డీనియతిం బ్రోవఁగఁ,**
**బొనరున్, సజ్జనులు శీలభూషణు లెందున్.**

**కం. కపివర! పుణ్యులలోఁ బా,**
**పపుజనములలోన వధకుఁ బాత్రులపట్లన్**
**గృపఁ జూపవలయు సజ్జనుఁ,**
**దపరాధముఁ జేయనట్టియతఁడుం గలఁడే ॥**

**తే. పాపములె చేయుచును గామరూపు లగుచు,**
**భువనహింసావిహారులై పొలచుచున్న,**
**యసురులకుఁ గీడుసేఁత కార్యంబు గాదు.**

అని బోధించెను.

ఇట్టివర్తనము జగన్మాత సీతకుఁ దగును గాని యితరులకుఁ దగునా?

**తే. మైత్రి భావించి తాన సంప్రాప్తుఁ డైన,**
**వాని నెటులేని చేవీడువాఁడఁ గాను**
**వానియెడ నుండెనేని నేదేనిదోష,**
**మద్ది గర్హ్యంబు గాదు సదాళులకును.**

తన్నాశ్రయించినవానియందు దోషమున్నను దత్కాలముచే వానిఁ ద్రోచిపుచ్చక రక్షించెద నని చెప్పి శ్రీరాములు కాకాసురుని కన్ను నూడఁబెఱికి శిక్షించిరక్షించెను. సీతాదేవియో తప్పునెంచి దండింపఁబూనినచో లోకమునఁ దప్పు చేయనివా రెవరు? అందఱు దండ్యులే కదా యగుదురు? ఇఁక మన మెవరిని రక్షింపఁగలుగుదుము? భక్తజనరక్షాదీక్ష నామకార్థమే కదాయగును? అని యేశిక్ష విధింపకయే రాక్షసస్త్రీల రక్షించెను. తల్లులారా! యీయిరువురిలో నెక్కువగ సేవింపఁదగినవా రెవ్వరో మీరేతెలుపుడు.

సీతారాము లిరువురు రావణు వధించి స్త్రీల పాతివ్రత్యమును దపస్వుల తపస్సును రక్షింప నవతరించినవారే కదా. ఈవిషయమునఁ బదునెనిమిది యేండ్లబాలిక సుకుమారి రాచకన్నె ఘోరకాంతారములలోఁ గాలినడ భయములేక నడచుచు నుపవాసములు చేయుచు రావణాసురుఁడు తన్ను లంకలో నుంచి బాధించినపు డొక్కతె దిక్కులేక పదినెలలు నిద్రాహారములు లేక యేకధారగాఁ గంటికిఁ గడవెఁడుగా నేడ్చుచు సీతాదేవి యెక్కువ దుఃఖించెనో, తమ్ముఁడు తోడుగా ఫలాహారములు మెక్కుచు వానరసహాయుఁడై రాముఁ డెక్కువ దుఃఖించెనో యాలోచింపుఁడు.

ఆవల నైనను దాను నిందమోచి తనమగనిని నిందనుండి తప్పింపనిండుగర్భముతో వనమలపాలై పోయి వాల్మీకి యాశ్రమంబున, బం(డెండుసంవత్సరములు నవయుచుండిన సీత దశ దుఃఖకరమో యేకపత్నీ వియోగదుఃఖము తప్ప మఱి యేదుఃఖములేక సమస్తరాజభోగము లనుభవించుచుండిన రామునిదశ దుఃఖకరమో యోజింపుఁడు.

పరుల రక్షింప నింత దుఃఖములపాలైన సీతాదేవికంటె నాశ్రయణీయ యెవ్వతె దొరకును?

కావున రామానుగ్రహము సంపాదింపఁగోరువారు తొలుత సీతానుగ్రహము సంపాదింప యత్నింపవలయును.

భార్యలు చెప్పినమాట లన్నియు భర్త లాదరించు చున్నారా యందురేమో.

ఎట్టివారియందును నభిప్రాయభేదము లొకప్పుడు గాకున్న నొకప్పుడైనఁ గలుగుట స్వభావసిద్ధమే కాని యేకాభిప్రాయముతో భార్యాభర్త లొకధర్మకార్యము నిర్వహింపఁ బూని నిర్వంచనముగ వర్తించునపుడు భార్యమాట భర్త నిష్కారణముగఁ ద్రోచివేయఁజాలఁడు. నీసహధర్మచారిణి యని చెప్పి జనకుఁడు సీతాదేవిని రామున కొసఁగెను. ఈ వాక్యమునే సీతాదేవియు వాల్మీకియుఁ జెప్పియున్నారు. కావున సీతాదేవిమాట రాముఁడు నిరాకరింపఁడు.

శ్రీసీతారామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తమ నడవడిచే లోకమును ధర్మమునఁ బ్రవర్తింపజేయ నవతరించినవారు కావున వారినడవడివలననే మనము ధర్మతత్త్వము గ్రహింపవలసినవారమై యున్నారము. శ్రీరాములగురించి శ్రీరామపరత్వమును జర్చించునపుడు చెప్పితిని. ఇప్పుడు సీతాదేవిని గురించి ముచ్చటించెదను.

(1) పతివ్రతలును, సాధువు లగుభక్తులును దుష్టులచే మానప్రాణములు పోవు దుస్థితి తటస్థించి శోకించినపుడు వారిని రక్షించుటకై యవతరించి వారికై తాను దుఃఖపడి తన తేజము చేతను దనపతి బలపరాక్రమములచేతను వారిని నాశము గావించిన లోకమాత సీతాదేవి యని మున్నే చెప్పితిని. కావునఁ బతివ్రతలకును, భక్తులకును మానప్రాణహాని పరులచే నన్యాయముగ నిష్కారణముగఁ దటస్థించినపుడు వారిస్థానమున మనము నిలిచి వారిని రక్షించుట పరోపకారదీక్ష గల యీసామాజికులకు విధియైయున్నది.

(2) సీతాదేవి మహాపతివ్రతయై పతిహితరతయై తపశ్శీలినియై సత్యవంతునకు సావిత్రివంటిదై దుఃఖముల నెడఁ బాయనిదై కష్టవేళల సుఖములఁ గోరక యెట్టిశ్రమ మైన సహించిన దగుటచే భార్య లందఱు భర్తలపట్ల నట్టులే ప్రవర్తింపవలసినవారై భర్తయశము సుఖము గోరువారై యుండవలయును.

(3) నిరపరాధి యయిన లక్ష్మణుని దూషించి సీత దానిఫల మప్పుడే యనుభవించెను గావున నెవరినైన సాధువులను నిష్కారణముగ నిందలాడుట తగదు.

(4) స్త్రీకి భర్తయే పరమభూషణము. ఆయనయందలి భక్తి క్షణమేనిఁ బాయరాదు. కంటికింపైనంతమాత్రమున సన్యపదార్థములఁ దెచ్చియిమ్మని పీడింపరాదు. భర్తనెడబాయఁగోరరాదు. క్షుద్రమైన మాయామృగమున కాశపడిగదా సీతాదేవి యన్నికష్టములపాలాయెను.

(5) ఈవిషయమున గ్రహింపవలసిన ముఖ్యతత్త్వము వేఱొండుగలదు.

ఈశ్వరుఁడు జీవుఁడు ప్రకృతి ననాదులే. జీవుఁడు భగవత్కళాంశసంభూతుఁడు. జ్ఞానానందస్వరూపుడు – ఇట్టివానికిఁ బ్రకృతిపరిణామ మైనదేహ మనుకారాగృహమున దుఃఖింపవలసినవ్రాఁత

యెట్లు వచ్చె నని కొందఱు ప్రశ్నింతురు. అది యనాదివృత్తము. కావున విచారణీయము కాదని కొందఱందరు; జ్ఞానహీనతచే లభించె నని కొంద ఱందురు. భక్తిహీనతచే లభించె నని కొంద ఱందరు. అప్రాకృత భగవత్తత్త్వమును బ్రకృతిబద్ధులమై సంకుచితజ్ఞానుల మైనమన మిదమిత్థ మ్మని సిద్ధాంతీకరించునపు డిది మాత్రమిట్లుండు నని యేల యూహింపరాదు. ఇట్టిరహస్యవిషయముల బోధించుట కేకదా సీతారామలక్ష్మణాదు లవతరించుట. జ్ఞానమయుఁ డైన జీవునకు నజ్ఞానము తొలుతొల్త నిష్కారణముగ లభించె ననుట స్వోక్తివ్యాఘాతము. విరోధోక్తి. ఇఁక మూఁడవ వాదము సత్యము. స్త్రీప్రాయ మితర త్సర్వమ్మన్నట్టు పురుషోత్తముఁ డొకఁడే పురుషుఁడు. తక్కిన దంతయు స్త్రీప్రాయమే, జీవకోటియు దీనిలోఁ జేరినదే. కావున జీవస్థానమున సీతాదేవిని నిలిపినచో సర్వము స్పష్ట మగును.

సీతారాములు పంచవటియం దుండుసమయంబున మారీచుఁడు మాయలేడియై సీతను బ్రలోభింప నచ్చటికి వచ్చెను. శ్రీరామాయణమున నీజింకరూపమును వర్తనమును జదివితి రేని యిది ప్రకృతితత్త్వమును సూచించుచున్నదని చెప్పుటయందు సందేహింపవలసినపనియుండదు. "నిత్యా సతతవిక్రియా ప్రకృతిః" నిత్యమైనది ఎల్లప్పుడు మాఱుచుండు నది ప్రకృతి యను లక్షణము దానికిఁ బూర్ణముగ నన్వయించు చున్నది. ఇట్లు వివిధవికారచేష్టలఁ జేయుప్రకృతిని (జింకను) జూచి జీవుఁడు (సీతా) భగవంతునియందుఁ దైల ధారావదవిచ్ఛిన్నముగ భక్తిగలవాఁడయ్యు క్షణకాల మాప్రీతిని బాసి యాప్రకృతిపదార్థముపై మనస్సుంచి దానినిమిత్తము భగవద్వియోగమునకుఁ బాల్పడియెను. కావున నిచ్చట భక్తిలోపము చెప్పవలసియున్నది కాని జ్ఞానలోపము చెప్ప సాధ్యపడదు. ఏలన

శా. చేరన్ వచ్చి సుమిత్రపట్టి కని యాజింకం గడున్ శంకచే
శ్రీరాముం గని యిట్లు వాకొనియె మారీచాసురుం దేతదా
కారం బూని మునీశపాళి మృగయాకాంక్షాగతోర్వీశులన్
గ్రూరుండై వధియించు నీయడవిఁ గాకుత్థాన్వయ గ్రామణీ.

కం. మాయావి యల్లయసురుఁడెఁ
మాయామృగరూప మెత్తి మలయును గంధ
ర్వాయతపురి యట్టిది యీ
కాయము నిక్కంబుగాదు కంజదళాక్షా

ఉ. కంటిమె వింటిమే కనకకాంతిమణీమయమోమృగంబు, నా
కంటికిఁ జూడ మాయ యనఁగా, శుచిహాసిని భర్తఁ జేరి వా
ల్గంటి మఱంది, నాఁగి నిజకాంతునితో మృగచర్మ మందు లో
నంటినమక్కువం బలికెఁ బ్రాణధవా! విను మాస గొల్పెడిన్.

అని యిట్టిసంభాషణము జరగుటచే జానకి కది మాయామృగ మని తెలియని యజ్ఞానముచే దానికై యాసపడెనని చెప్ప సాధ్యపడదు. మక్కువ, ఆస యీపదములును దక్కిన వర్తనమును దానియందలి నామెకుఁ గల ప్రీతినే చాటించుచున్నవి. కావున సీతారాములవియోగమునకుఁ గారణము సీతకుఁ దత్కాలమున రామభక్తి లోపించుటచేతనే యని చెప్పక తప్పదు.

"పున ర్విశ్లేషభీరుత్వం పరమా భక్తి రుచ్యతే" యని మోక్షకారణమైన పరమ భక్తిలక్షణము. ఒకక్షణమైనను భగవద్వియోగమును సహింపలేక యుండుటయే పరమభక్తి, ఇదియే భగవత్ప్రాప్తికి సాధనము.

శ్లో॥ యన్ముహూర్తం క్షణం వాపి, వాసుదేవో న చింతితః ।
సా హాని స్తన్మహచ్ఛిద్రం, సాభ్రాంతి స్సా చ విక్రియా ॥

ఏకస్మిన్న ప్యతిక్రాంతే, ముహూర్తే ధ్యానవర్జితే
దస్యుభి ర్ముషితేనేవ, యుక్త మాక్రందితుం భృశమ్ ॥

ఏముహూర్తమైనను క్షణ మైనను, భగవంతుఁడు ధ్యానింపఁబడఁడో యదియే గొప్పకీడుగను లోపముగను, భ్రాంతిగను వికారముగను నెంచవలయును. అల్పకాలమైనను భగవంతుని ధ్యానము లేక కడచిపోయెనేని తనసర్వస్వము దొంగలు దోఁచుకొనిపోయిన ట్లేడ్చుట తగును అని భక్తిశాస్త్ర మిట్లుండుటచే సీతయందుఁ దత్కాలమున భక్తిలోపము చెప్పక తప్పదు. భక్తిలోపముచేతను, నాప్తవాక్యమును నలక్ష్యపఱుచుటచేతను సీతకు లంకాప్రాప్తియు జీవునకుదేహప్రాప్తియు నని యెఱుంగవలయును.

సీతాదేవి యుత్తరచర్య యీయభిప్రాయమునే స్థిరపఱుచుచున్నది. ఎట్లందురేని సీత లంకయందలి యశోక వనమునఁ దననిర్బంధమును దొలఁగించుకొనుటకై రామసాంగత్యలాభమునకై చేసిన కార్యమేమి?

యాగాదులుచేసి బ్రహ్మార్పణ మన లేదు. జాలంధ రోడ్డీయానబంధములతో సిద్ధాసనముననుండి కేవలకుంభక మభ్యసింపలేదు. షణ్ముఖీముద్రను, యోనిబంధమును సాధించి కపాలమును భేదింపలేదు. కొక్కువలె నేలబొరియలోకిఁ బోయి కూర్చుండలేదు. సోహ మని కాని అహం బ్రహ్మాస్మి యని కాని యనుచుండలేదు. ఇఁక నామె చేసినకార్యము సుందర కాండము ఘంటాఘోషముగా వచించుచున్నది. సీతాదేవి హనుమంతుఁడు చెట్టుపైనుండి పల్కినపలుకులు విని తనలో నిట్లనుకొనుచున్నది.

**చం.** **కల యిది గాదు, నిక్కువము గాదు, నిజం బలయంగ నెప్పుడున్**
**దలఁపున రామ రామ యని ధ్యానమొనర్చు, నోట నట్టులే**
**పలుకుచు నుంటఁ దద్విషయవాక్యములే వినుదాన, నమ్మహా**
**బలుని స్వరూపమే కనెద భావన తీవ్రబలంబు పెంపునన్.**

**ఉ.** **ఆరఘువీరుపై హృదయ మంతయు నిల్పి మనోభవ వ్యథా**
**భారముచేఁ దపించుటను భావనశక్తి రఘూత్తమాకృతిన్**

**సారెకుఁ గాంతు నెల్లయెడఁ జారుతదీయకథల్ వినంబడున్**
**వారక నాదుమోహ మొకవానరరూపముఁ గాంచి పల్కెనో.**

ఇఁక హనుమంతుఁడు సీతాదేవి చేయుకార్యమును నామె యున్నస్థితిని శ్రీరాములతో

ఆ రాక్షసేశ్వరునంతఃపురంబునస్వాభిలాషంబు నీయంద యునిచి జీవించి యుండెడి సీతను గంటి;

అనవరతంబు త్వద్ధ్యానరతాత్మయై యున్న నెలఁత నెట్టెట్టులో యేను గాంచి

**ఉ. నిన్ను మహానుభావ! కడునిర్మల చిత్తమునన్ స్మరించుచున్**
**సన్నుతభక్తిశీలములు సాధ్విగుణంబు దపంబుఁ బాయకం**
**దున్నది నేను జూచితి"**

నని చెప్పెను.

దీనివలన నామె రామనామస్మరణము రామధ్యానము తప్ప మఱియేదియుఁ జేయలేదని స్పష్టపడియెఁ గదా.

శత్రుమధ్యమునఁ బరాధీనయై దీనయై యుండుసీత యింతకాక మఱియేమిచేయఁ గలదందురేమో. అటైనను నయోధ్యయందు శ్రీరాముని నామెకోరినదేమో వినుఁడు.

**చ. "జనకగృహంబు చందమున సౌఖ్యముగా నివసింతు,**
**నీకునొయ్యనఁ <u>బరిచర్యసేయుదు నవన్యమనస్క,</u>**
**దృఢానురక్తచిత్తను, ననువీడితేని మెయిదాల్ప నిజంబుగ"**

**కం. ఓడక యడవులకును నీ,**
**తోడన చనుదెంచి శౌర్యధుర్యా! నీకున్**

**వీడక <u>సేవలు చేయఁగ</u>**
**వేడుకపడియెడి మనంబు వినవే మనవిన్ ॥**
**అనయంబును దాలిచి బ్రహ్మచర్యమున్**
**సమ్మతి <u>నీపదాబ్జభజనం</u> బొనరించుచు నిన్నుఁ గూడి నే**
**సమ్మద కేళిఁ దేలెదను శౌర్యధనా! యిదిసమ్మతింపవే ॥**

ఇట్టివాక్యములే మఱియును కొన్ని గానవచ్చు చున్నవి.

"పరిచర్య చేయుచు" "సేవలు చేయఁగ" నను వాక్యములను

"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా

ర్చనముల్ సేవయు" ననుభక్తిలక్షణములతోను

"అనన్యమనస్క" యను దానిని "అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే"

**శ్లో॥ చతుర్విధా మమ జనా, భక్తా ఏవ హి తే శ్రుతాః**
**తేషా మేకాంతినః శ్రేష్ఠా, యే చై వానన్యదేవతాః**
**అహ మేవ గత్తి స్తేషాం, నిరాశీః కర్మకారిణామ్ ॥**

నాభక్తులునాలుగు విధములవారు గలరు వారిలో నేకాంతులు శ్రేష్ఠులు. వీరొక్క దేవతనే యుపాసించువారు ఫలాపేక్ష లేక కార్యములు చేయువీరికి నేనేగతి.

అనుభక్తి లక్షణముతోను (భగవ-12-6) **"అనన్య చేతాః సతతం**
**యో మాం స్మరతి నిత్యశః త స్యాహం సులభః పార్థ!**
**నిత్య యుక్తస్య యోగినః**

అను (భగ-9-14) తోను.

దృఢానురక్తచిత్తను అనుదానిని "సా పరానురక్తి రీశ్వరే" యను శాండిల్య భక్తిసూత్రముతోను బోల్చి చూచినచో సీతసాధించినది భక్తియేకాని కర్మజ్ఞానాష్టాంగ యోగములు కావని స్పష్టపడును –

అయ్యా! శ్రీమద్రామాయణము శరణాగతిని స్థాపించు చున్నదని సంప్రదాయజ్ఞులు సిద్ధాంతముచేసియుండ నీవు సీత భక్తి చేసినదని చెప్పుచున్నావే నీయభిప్రాయ మేమని మీలో విజ్ఞు లగువా రడుగవచ్చును. అది న్యాయమైన యాక్షేపమే.

ప్రపత్తికి భక్తి విరోధి గాదు. ప్రతికూలించునది గాదు. ప్రపన్నులు భగవన్నామస్మరణము భగవత్కథాశ్రవణము లోనైనభక్తికార్యములు చేయరాదని ప్రపత్తిశాస్త్రము విధింపలేదు. స్వర్గఫలదములైన ధర్మకార్యములు చేయరాదని నిషేధించుచున్నది. ప్రపత్తిచేసినవాఁడు మరల బుణ్యకాంక్ష గార్యములు చేయఁరాదు గాని నిష్కామభక్తి చేయవచ్చును. ప్రకృతిసంబంధములైన పదార్థములను గోరుట కామ మనఁ బడును భగవదనుగ్రహము గోరుట కామముగాదు. సీత గోరినది భగవత్సంయోగమే. ప్రపన్నులైన యాళ్వందారులు

"భగవన్! భక్తి రపి ప్రయచ్ఛ మే" భగవంతుఁడా! భక్తిని గూడననుగ్రహింపుమా యని భగవంతువేఁడిరి. కులశేఖరులు

"త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తి రస్తు" నీ పాదకమలములందు నాకు దృఢభక్తి యగుఁగాక యని ప్రార్థించిరి.

ఇంత యేల ప్రపత్తిశాస్త్రమందు

**శ్లో॥ తత్పాదభక్తిజ్ఞానాభ్యాం, ఫల మన్య త్కదాచన**
**న యాచే త్రృణతో విష్ణుం, యాచనా న్నశ్యతి ధ్రువమ్ ॥**

అనియుండుటచే భక్తిప్రపత్తులు పరస్పరవిరోధులు గావు

ప్రపత్తిలక్షణము దానినభ్యసించువిధము భక్తిప్రపత్తుల గుఱించి యుపన్యసించునపుడు విశదముగఁ దెలిపెదను. ప్రకృతము సీత ప్రపన్నురాలని ప్రపన్నలక్షణము లాయమయందుఁ గలవనియు దానివలన నామె పొందినఫలమును దెలిపెదను. దానివలననే చాలభాగ మావిషయము తెలియఁగలదు. ప్రపత్తికిఁ గర్మముగాని ధర్మముగాని జ్ఞానముగాని భక్తిగాని యోగముగాని యిన్నిగాని సాహాయ్యముగాఁ గొనుటచేఁ ప్రపత్తిహాని లేదు. వీనిని ప్రత్యేకసాధనములుగా ననఁగా వీనివలన మోక్షము వచ్చునని యెంచి వానిని సాధింపఁ బ్రయత్నించిన యెడలఁ బ్రపత్తికి హాని గలదు, సహాయములుగాఁ దీసికొన్న యెడల హానిలేదు.

భక్తికిఁబ్రేమముఖ్యము – ప్రపత్తికి నాత్మ నిక్షేపము – దృఢ విశ్వాసము ముఖ్యములు, దృఢానురక్తచిత్తనని సీతదెలుపుటచే నామెయందుఁ భక్తియుఁగలదు.

“భార్యా భర్తవ్యమ్” అనున్యాయముచే నేనాఁడు శ్రీరాముఁడు సీతాదేవిపాణిని గ్రహించెనో యానాఁడే సీతారక్షణభరమును గ్రహించినాఁడని యెఱుంగనగు. గురుముఖముగ వలదా యందురేని

**కం. ఈసీత నాదుకూఁతురు,**
**నీసహధర్మచరి, దీనినిం గైకొనుమా**
**కౌసల్యాసుత! నీకును,**
**భాసురశుభ మగు గ్రహింపు పాణిం బాణిన్.**

అని జనకుఁడైన జనకుఁడే గురు వయి సీతను రామున కప్పగించెను.

అంతియగాక శ్రీరాముఁడు తా నరణ్యమునకు, బోయెద నని సీతతోఁ జెప్పవచ్చినపుడు తన్నుఁ జేవిడువవల దనియు విడిచినచోఁ బ్రాణములును దన్ను విడుచుననియు సీత చెప్పి యాయనను పట్టుకొని యేడ్చెను.

ఇంతకంటెను భరన్యాసము చేయు టెట్లు?

తరువాత నాంజనేయుఁడు నుపదేశించెను. ఎటు సూచినను సీతాదేవి గురుముఖముగఁ బ్రపత్తి చేసెనని యంగీకరింపక తప్పదు.

ప్రపత్తిలక్షణములు సీతయందుఁ గలవా యాలోచింతము. ప్రపత్తికి నంగము లాఱు.

(1) ఆనుకూల్యసంకల్పము, (2) ప్రాతికూల్యవర్జనము, (3) మహావిశ్వాసము, (4) గోప్తృత్వవరణము, (5) ఆత్మనిక్షేపము, (6) కృపణత్వము.

**1) ఆనుకూల్యసంకల్పము**

**"ఆనుకూల్య మిదం ప్రోక్తం, సర్వభూతానుకూలతా"** సర్వభూతములకు మేలుకోరి హింస చేయకుండుట యని యానుకూల్య లక్షణము.

రాక్షసస్త్రీలయం దామెచూపిన దయయు, నరణ్యమునఁ దిరుగువేళరాక్షసుల వధింప వలదనుచు "విపినతలంబులం దిరుగువేళ నహింసఁ జరింపరాదె" యని రామునకు బోధించుటయు నాలోచించినచో నీలక్షణ మామెయందుఁ బూర్ణముగఁ గలదని యెఱుఁగనగు. సీతప్రేమస్వరూపగదా.

**2) ప్రాతికూల్యవర్జనము** అనఁగాఁ బ్రతికూలమైన దానివిడుచుట

**శ్లో॥ ఆనుకూల్యస్య సంకల్పాత్, ప్రాతికూల్యస్య వర్జనమ్**
**హింసాద్యపాయవిరతి, రుక్తా సర్వేషు జంతుషు ॥**

ప్రపత్తికి హింసాదులు ప్రతికూలములైనవి. పైదాని వలననే యవిసీతయందు లేకుండుట స్పష్టపడెను.

**3) మహావిశ్వాసము :** నన్ను భగవంతుఁ డవశ్యము రక్షించును. ఎన్నఁటికి నుపేక్షింపఁడను దృఢమైననమ్మకము మహావిశ్వాసము. సీతాదేవి వాక్యములవినుఁడు.

చం. ఉడిగెడువాఁడు కాఁడు పురుషోత్తముఁ డేగతి నైన నాదుపో
బడి కనిపెట్టి యిచ్చటికి వచ్చుట సత్యము.

గీ. కంటి కెదుర నున్నఁ గడుఁ బ్రేమ గలుగును
మఱుఁగుపడినమైత్రి మఱపు గలుగు
దథ్య మద్ది యగుఁ గృతఘ్నులయం దెదఁ,
బ్రేమ మఱవఁ డెపుడు రామవిభుఁడు.

సీ. ఈ వొక్కఁడవు దక్క నితరదైవము లేద,
టంచు నేఁ దలఁచిన యిట్టితలఁపు
వినఁగోరి నీసూక్తి వికటరాక్షసపరు,
షాలాపముల వినునట్టియోర్పు
నీతోడ శయనించు ప్రీతిమై నీనేలఁ,
బడియున్నయట్టి యీకడిఁదిదిటము,
రాముఁ డేటికి నన్ను రక్షింపకుండునన్,
ధర్మమార్గంబున స్థైర్యవిధము.

గీ. నాదుపరమపాతివ్రత్యనవ్యతపము
పాడు గాఁబోయె నాదుదౌర్భాగ్యముననను.

ఉ. ఏ మనుదాన దూతుఁడ మదీశ్వరు నాపయి కూర్మికంటె శ్రీ
రామున కాత్మమాతపయి రాజగుతండ్రిపయిన్ హితాళిపైఁ
బ్రేమము హెచ్చు గాదు సరిప్రీతియుఁ గా దటుగావునం గదా
యామహితాత్మవార్త వినునంతకు నిల్పితి మేనఁ బ్రాణముల్ ॥

ఈవాక్యములవలన సీతాదేవికి శ్రీరామునం దెంత విశ్వాస ముండెనో తెలియనగు. సీతకు విశ్వాసము చాలమిని గదా యురిపోసికొనయత్నించె నందురేమో. అది సరిగాదు. అహం, మమ యనునవి రెండునుండి తన

ప్రయత్నముచేఁ దన్నుఁ దాను గాపాడుకొనఁగలుగుదు ననుధైర్యము ప్రయత్నము నుండువఱకు భగవంతుఁడు సహాయపడఁడు.

కలఁడు కలం డనెడివాఁడు కలఁడోలేఁడో

**శా. లా వొక్కింతయులేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువుం డస్సెన్ శ్రమం బయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపం దగుం దీనునిన్**
**రావే యీశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా ॥ శ్రీభాగ.**

యని నిర్వ్యాపారుఁడైనపుడు గదా గజేంద్రుని భగవంతుఁడు రక్షింపవచ్చెను. తనమానరక్షణమందు ద్రౌపది స్వశక్తికొలఁది పోరాడి యిఁకఁ బ్రయోజనములేదని నిరాశయై'కి మనాథా ముపేక్షసే' యని యూరక నిలఁబడినపుడు గదా భగవత్సాహాయ్యము గలిగెను. తననిమిత్తమై తమ మాన ప్రాణములు విడువనెవ్వ రెప్పుడు పూనెదరో యప్పు డొకనిమిషమైనఁ దడవులేక భగవంతుఁ డనుగ్రహించును.

**4) గోప్తృత్వవరణము**

**"గోప్తృత్వవరణం నామ స్వాభిప్రాయనివేదనమ్"** వరణము స్వీకారము. నన్నీ సంసారవార్ధినుండి తరింపఁజేసి నీ సన్నిధి చేర్చుకొనుమని భగవంతుని రక్షకునిఁగా గోరుట

**కం. రాముఁడు దశకంధరు సం**
**గ్రామంబున నింద చంపి కలబంధులతో**
**సేమముగ నన్నుఁ గైకొన**
**సామీరీ! యతని కదియె సముచితకృతియౌ.**

చం............... బాధలఁ బొందెడి నాయెడన్ దయం దలఁపుము నాథుఁ డీవఁట, యనాథగతిం బడియున్నదానఁగా

ఉ. సారెకుఁ జెప్పవయ్య కపిసత్తమ నేఁడిఁక నొక్కమాసమే
తీరున నైనఁ బ్రాణములు దేహమునన్ ధరియించుదాన నా
పై రఘుచంద్రమా! నిజము ప్రాణము నిల్వదు మున్నధోభువిన్
జేరినకౌశికిన్ హరిని జేర్చినరీతి సముద్ధరింపుమీ ॥

కం. అన్నా! రాఘవుఁ డెట్టులు,
నన్ను విపత్సాగరంబునం జెడకుండన్
జెన్నారఁ బ్రోచునాగతి
మన్నన మెయిఁ బలుకవన్న మఱవకుమన్నా ॥

**5. ఆత్మనిక్షేపము**

**ఆత్మాత్మీయభరన్యాస మాత్మనిక్షేప ఉచ్యతే.**

తన్నుఁ దనకు సంబంధించినవానిని రక్షించుభారము భగవంతునియందుంచుట యాత్మనిక్షేపము. తనయావును బరున కమ్మిన తరువాత దానిరక్షణపోషణ భారమందుఁ దనకెట్టి బాధ్యత లేదని యెట్లావును విక్రయించినవాఁడు తలఁచునో యట్లు తనరక్షణభారమును భగవంతునిపై వైచి నిర్భయుఁడై నిర్భరుఁడై యుండుట. భగవంతుఁడు వచ్చి తన్ను రక్షించు నాకేమిభయమను నిశ్చయ బుద్ధితోఁ దరించుటకు వేఱుపాయమును వెదకకుండుట నిర్భరత్వము. సీత హనుమంతునితో

కావున వేఱుపాయములఁ గార్యము లేదిటకున్ రయంబునన్
నావిభు లక్ష్మణాన్వితు వనాటసమూహధవోపసేవితున్
నీ వెటులేని తెమ్ము.

కం. బలములతో నిచటికి రఘు,
కులతిలకుఁడు వచ్చి కలనఁ గూల్చి దశాస్యున్
గెలుపొంది నన్నుఁ దనపురి,
కలవునఁ గొనిచనిన నాకు యశ మది గూర్చున్.

**కం. ప్రాకటశితనారాచా,**
**నీకంబున లంకఁ జలిపి నీఱుగఁ గడిమిన్**
**గైకొని నన్నేగినచోఁ**
**గాకుత్థ్సున కదియె తగినకార్యము చుమ్మీ.**

అని చెప్పెను.

**6. కార్పణ్యము** అనఁగాఁ గృపణత్వము దైన్యము.

**శ్లో॥ అంగసామగ్ర్యసంపత్తే, రశక్తే శ్చాపి కర్మణామ్**
**అధికారస్య చాసిద్ధే, ర్దేశకాలగుణక్షయాత్ ॥**
**ఉపాయా నైవ సిద్ధ్యంతి, వ్యాపాయా బహుళా స్తథా**
**ఇతి యా గర్వహాని స్త, ద్దైన్యం కార్పణ్య ముచ్యతే.**

కర్మ యోగ జ్ఞాన యోగములు నష్టాంగయోగములు నేను సాధింపవలయు ననిన నాకుఁ గావలసిన యంగసామగ్రి పూర్తిగాలేదు. కరములు చేయుటయందును శక్తిలేదు. దేనికిని నధికారినిగాను. దేశకాలగుణక్షయముల వలన నుపాయములా సిద్ధింపవు. విఘ్నములా మెండు. నాగతియేమి? ఎట్లు కడదేఱుదును? దేనికి నర్హతలేదే దైవమా యని ఖిన్నుఁడై గర్వముడిగి దీనుఁ డగుటయే కార్పణ్యలక్షణము

మీఁద నుదాహరించిన సీతవాక్యములం దీదైన్యము స్పష్టముగనున్నది – మఱియును

**చం. పరవశురాల, దుర్బలను, బ్రాపును లేద, యనాథ, నొంటి, నె**
**ప్పరుసున నేమి చేయఁగల బావని నీవ తలంచిచూడు మా ॥**

యనునవి యెంతటి దైన్యోక్తులో చూడుఁడు.

మేఘజలబిందువునకుఁ జాతకమువలె భగవంతుని కృపకుఁ బ్రపన్నుఁడు కాచుకొనియుండవలయును. చాతక మెట్లితరజల మపేక్షింపదో యట్లితర దేవతానుగ్రహమున నుజ్జీవింపఁ బ్రపన్నుఁ డాశింపరాదు.

**ఉ. చుట్టములం దొఱంగినను, జూఱలు వోయినఁ గామభోగముల్**
**నిట్టలమైనకష్టముల నెవ్వగఁ దాను మునింగియుండినన్**
**నెట్టనప్రాణనాథుఁ గన నిల్పి మనం బనయంబు నోర్పుతో**
**గిట్టక యున్న దీమె పిడికింట నయో బిగఁబట్టి ప్రాణముల్.**

తనకుఁ గలసర్వస్వము పోయినను నెట్టిదుఃఖములు ప్రాప్తించినను బొందిలోనుండి ప్రాణములు తమంతట నవి లేచి పోవువఱకు భగవచ్చింతను భక్తులుమానరాదు.

**ఉ. చూడదు రాక్షసాంగనలఁ, జూడదు పుష్పఫలద్రుమంబులన్**
**జూడదు రమ్యహర్మ్యముల సుందరి డెందమునందు నెప్పుడున్**
**జూడఁగఁ గోరుచున్ భువనశూరుని రాముని నొక్కని న్మదిన్**
**వేడుకసేయ దయ్యె నవ నీసుత, యుక్తమె కా తలంపఁగన్.**

ఇది హనుమద్వాక్యము. దీనివలన సీతాదేవి యెంత యేకాగ్రచిత్తయై శ్రీరాముధ్యానించుచుండెనో యెఱుఁగనగు. "దిశ శ్చానవలోకయన్" దిక్కులుచూడక యనుభగవద్గీతావాక్య మిచట ననుసంధించునది.

ప్రపన్నుఁ డకించనుఁడై యుండవలయును. అకించనుఁ డనఁగా నేమియులేనివాఁడు. ఉపాయాంతరసామర్థ్యమును లేనివాఁడు. శుష్కదరిద్రుఁ డయ్యును దనయోగక్షేమభారమును భగవంతునిపై వైచి ధనార్జననిమిత్తమై యెట్టిప్రయత్నమును జేయఁ జాలనివాఁడు. అట్టులే సిద్ధోపాయము. భగవంతుఁ డుండఁగా సాధ్యోపాయముల వెదకఁ జాలనివాఁ డకించనుఁడు. సీతయు నిట్టిది కావునను హనుమంతుఁడు గొనిపోయెద" నన్నప్పుడు సీత నేను రాననెను. అట్టులే చూడామణిని దప్పఁదక్కిన సమస్తాభరణములను దీసివైచి మానరక్షణార్థమై మాసిన యొంటిచీరతో నుండెను. చూడామణి రామునకు మనోహరమైనది కావున దాని నాయనకుఁ జేర్పవలయు ననుతలంపుతో, రావణుఁడు చూచిన

హరించునో యను భయముతోఁ జీరకొంగునఁ గానరాకుండఁ గట్టి రక్షించి శ్రీరామునకుఁ బంపెను.

**ఉ. దాఁచితి నీరజంబుమణి దాశరథీ! యిది నీమనోంబుజం**
**బాఁచికొనంగఁ జాలుట మహాత్మ! భవద్విరహానలంబు న**
**న్గ్రాఁచెడివేళ ని న్గనినకైవడి దీనిని గాంచి పొంగుదున్**
**సైఁచుట దోఁప దింక వెతసంద్రమునం దుసురుగ్గఁబట్టుచున్.**

అని చెప్పి సీత దానిని హనుమంతున కిచ్చెను.

దీనివలన నేపదార్థమును జూచిన భగవంతుఁడు స్మరణమునకు వచ్చునోయట్టిచిహ్నమును భక్తుఁడు ప్రపన్నుఁడు ధరించి దానిని జూచినప్పు డంతయు భగవంతుని స్మరించుచు నదిపోవుట ప్రాణముపోవుటగా భావింపవలయును. మీరు ధరించు రామపతక మిట్టిదిగా నెంచుఁడు.

ప్రపన్నుఁ డనన్యగతికుఁడై యుండవలయును అనన్యగతి యనఁగాఁ బ్రయోజనాంతర వైముఖ్యము. శరణ్యాంతర వైముఖ్యము. దేవతాంతరవైముఖ్యము. ప్రయోజనాంతర వైముఖ్యమనఁగా భగవత్ప్రాప్తితప్ప మఱియొక ప్రయోజనమందిచ్ఛ లేకుండుట.

శరణ్యాంతర వైముఖ్యము మోక్షప్రదానసామర్థ్యముగల దైవమును దప్ప మఱియొకరిని రక్షకుఁడుగాఁ గోరుటకు సమ్మతింపకుండుట.

దేవతాంతరవైముఖ్యము. తనయిష్టదైవమే దైవమనియుఁ దక్కినయందఱు నాయనకంటెఁ దక్కువవా రనియు నెంచి వారియందు దేవభావముంచకుండుట. "నాన్యం దేవం నమస్కుర్యాత్, నాన్యం దేవం నిరీక్షయే'' త్తని ప్రమాణము. ఇతరులను దేవతాభావముతో నమస్కరింపరాదు అట్టిభావముతోఁ జూడనురాదు. ఆయనదాసులు భక్తులు ననుతలంపుతోఁ జూడవచ్చును గౌరవింపవచ్చును. ఎవరి యందును ద్వేషబుద్ధి కారాదు

చం. అతులితసౌధవీథులను హాయిగఁ గ్రుమ్మరుకంటె, దేవతా
తతులవిమానసీమల సదావిహరించుటకంటె, వ్యోమప
ద్ధతులఁ జరించుకంటెను, వెతల్ పడుచున్నను నే యవస్థలన్
సతికిని భర్తృపాదపరిచర్యయె యుత్తమ మార్యసత్తమా.

చం. అలరుచు నీదుసంగతి శతాయుతవర్షములైనఁ గానలో
నలజడి లేక యుండెదను, నాకమ యైనను నాకు మోదమున్
గొలుపదు నిశ్చయంబు నినుఁ గూడఁగగల్గకయున్నఁ గావునన్
బలిముఖసింహవారణవిభాసము గానకు వెంట వచ్చెదన్.

చం. తలఁపను దల్లినిం, దలఁపఁ దండ్రి స్మరింపను దోడఁ బుట్టులన్
దలఁపను నిల్లు వాకిలి యథామతి నీవయి నాదు చేతిలో
పలఁ దమి నుంచు కాయలనొ పండ్లనొ మెక్కెద............
తేన త్యక్తేన భుంజీథాః ॥
భగవంతుఁ డిచ్చినదానిని భుజింపుము యను నుపనిషద్వాక్యము
స్మరింపుడు

కం. నీతోడ నున్నస్వర్గము, నీతోడు రహింపకున్న నిరయం బదియే॥

ఈవాక్యములవలన సీతాదేవి ప్రయోజనాంతర వైముఖ్యము తెలియఁగలదు.

కం. నీయిల్లాలను గొమరుం,
బ్రాయపుసుందరిని సతిని మఱి నధ్యుషితన్
జాయాజీవునిపోలికి
మాయురె యన్యుల కొసంగ మఁది దలఁచెదవే

కం. ఏరికి హితముం జలుపఁగ,
వారించెదు నన్ను నట్టివారికి నీవే

**కూరిమి వశ్యుఁడ వగుచున్,**
**ధీరత! చరియింపుమీ విధేయుఁ డవగుచున్**
శరణ్యాంతర వైముఖ్య మీవాక్యములవలనఁ దెలిసెడిని

**సీ. ఈవొక్కఁడవు తక్క నితరదైవము లేద**
**టంచు నేఁ దలఁచిన యట్టితలఁపు**
**"అనన్యమనస్క దృఢానురక్తచిత్తను"**

దీనివలన దేవతాంతరవైముఖ్యము స్పష్టపడియెడిని భక్తులు ప్రపన్నులు తమశరీరమును దృణప్రాయముగఁ జూతురు

**సీ. ప్రాణంబు లేటికి నర్థంబు లేటికి భూషణంబు లవేల పొక్కవేళ**
**రామచంద్రునిఁ బాసి రాక్షసీమధ్యంబునన్ వందుచుండఁగ.....**

**గీ. పాపజీవిత నయి రామభద్రుఁ బాసి,**
**యొడలఁ బ్రాణంబులను నిల్పి యున్నదాన**
**ఛీ యనార్యను నసతిని శీలహీన,**
**నేమి బ్రదు కిది తలఁప నా దేమివ్రతము?**

**మ. తిననీ వీరలు నాశరీరమును బ్రీతిం దీర ఖండింపనీ**
**మనఁజాలం జతురర్ణవీవలయితక్ష్మాభర్తఁ నాభర్తఁబా**
**సి నితాంతంబు దురంతమైనవ్యథ గాసిం బొందు చేనిట్టి రీ**
**తిని సౌఖ్యంబులఁ గోరుదాననె కదుం దీపో కదే ప్రాణముల్.**

భక్తులు ప్రపన్నులు దేశకాలపాత్రము లాలోచింపక క్షుత్తు వారింపఁగోరి యెవరేమి యిచ్చిన భుజింపరు. జారులు చోరులు దురాచారులు నాతతాయులు నగుపాపు లొసంగిన దాని భుజింపరు గాని యట్టివారిని దరింపఁజేయుతలంపుతోఁ గనికరించిరేని గైకొందురు. రావణుఁడు మహాపాపాత్ముఁ డగుటను దానుండునది శత్రుక్షేత్రంబగుటను

బతివియుక్తయై యుండుటను సీత పదిమాసము లుపవసించెను గాని రావణుఁడు పంపుపదార్థ మేదియు వ్రేలనైనఁ దాఁకినది కాదు.

**శ్లో॥ కులటా షండ పతిత వైరిభ్యః కాకణీ మపి**
**ఉద్యతా మపి గృహ్ణీయా, న్నాపద్యపి కదాచన ॥**

అంకుటాలు, నవుంసకుఁడు, కులభ్రష్టులులోనగు పతితులు, పగవారు తీసికొమ్మనువారై యయాచితముగ నీయ వచ్చినను నెంతటియాపదయందున్నను, నెప్పుడేని వీరివలన గ్రుడ్డిగవ్వయైన గ్రహింపరాదు.

తృతీయసోపానమునఁ జెప్పిన తొమ్మిదవతరగతి యధికారికిఁ దప్పఁదక్కినవారిలో ద్విజులగువారికి సప్తవిధస్నానములలో సందర్భము కొలఁది నొకవిధమైన స్నానమైనను సంధ్యయును విడువరాదని సీతాదేవి చర్యవలన నేర్పడుచున్నది.

**కం. సంధ్యాకాలంబునఁ దా,**
**సంధ్యావందనముఁ జలుపఁ జనుదెంచునుని**
**ర్వంధ్యోదక యీనది కడ**
**కుం ధ్యాన మొనర్చికొనుచుఁ గూర్మి హృదీశున్.**

ఈవిధముగఁ బ్రపన్నులయి భగవద్ధ్యానము చేయు చుండువారి కాజన్మాంతమందే సాయుజ్యము గలుగు నని సీతాదేవి చర్యవలన నేర్పడుచున్నది.

**శ్లో॥ ఏతద్దేహావసానే మాం, త్వత్పాదం ప్రాపయ స్వయమ్ ।**

ఈ దేహావసానమందు నన్ను నీపాదములకడఁ జేర్పుము అనియే ప్రపన్నులు ప్రార్థింతురు.

సీతకు దేహావసానము కాలేదు గదా యందురేని యగ్నిహోత్రమునఁ బడుట దేహావసానమును సూచించును. అగ్నిహోత్ర ప్రవేశమువలన మనము మఱియొకవిషయమును గ్రహింపవలసియున్నది.

పూర్ణముగఁ బుటమువేసినఁ గాని బంగారము మనము శుద్ధమని గ్రహింపముగదా. అట్టులే జీవుఁడు ముక్తుఁ డగుటకు నరకకారణము లైన నిందాదులచేతను స్వర్గకారణము లైన ధర్మాదులచేతను నింతయేల ప్రకృతిసంబంధలేశలేపముచే విముక్తుడు కావలయును. అగ్నిప్రవేశ మీయర్థమునే సూచించును. ప్రారబ్ధలేశమును బరిహరింపఁజేయ రాజకుమారునకువలె నల్పశిక్ష విధించి భగవంతుఁడు జీవి ననుగ్రహించును. పాపక్షేత్రవాసము - దానివలనఁగలిగిననింద యనుమలినము లామెయందు లేవని లోకమున కెఱిఁగింప శ్రీరాముఁడట్లు సీతను బరీక్షించెను. ఇట్లు పరీక్షింపఁబడినసీతను శ్రీరాముఁ డెట్లుగ్రహించెనో యట్లు ముక్తునకు భగవంతుఁడు సాయుజ్య మొసఁగును. సీత రామునిలోఁ గలసిపోలేదు; సమానపదవి నలంకరించెను. ఇట్టి సీతారాముల యైక్యమెట్టిదో జీవాత్మపర మాత్మలయైక్య మట్టిదని గ్రహింపుఁడు దీనియందు భిన్నాభిప్రాయములుండుటచే భక్తమతమును వివరించెదను.

మనభక్తిమతమున నీశ్వరుఁడుసత్యమే, జీవుఁడు సత్యమే బంధముసత్యమే, మోక్షము సత్యమే, యనిగ్రహింపుఁడు ఇవి మిథ్యలను పలుకులు మిథ్యలు. ఈవిషయము తత్త్వదర్శిని యనుగ్రంథమున విశదీకరింపబడును "పరిపూర్ణబ్రహ్మానుభవాత్మికాముక్తి" యని లక్షణ ముండుటచేఁ బరిపూర్ణబ్రహ్మాను భవాత్మకము మోక్ష మని యేర్పడుచున్నది. ఇట్టి యనుభవముకలవాఁడు ముక్తుఁడు. ఇట్లనుటచే (1) ననుభవము, (2) అనుభవించువాఁడు, (3) అనుభవింపఁబడునది మూఁడును కలవనుట సిద్ధమయ్యెను. అనుభవమే యానందము. అనుభవించువాఁడు జీవుఁడు. జీవుఁడానందరూపుఁడు. ఆనందగుణకుడు, అనుభవింపఁబడు వాఁడీశ్వరుఁడు ఆనందస్వరూపుఁడు. ఈదశయందుఁ బ్రకృతి సంబంధబంధము లన్నియుఁ దొలగిపోవుటచే జీవుఁడు ప్రకృతి మండలమును దాఁటి యప్రాకృతమండలమున (నిత్యవిభూతి)

మండలమునఁ బ్రవేశించును. ఒకరాజ కుమారుఁడు తండ్రిని ధిక్కరించి రాజసన్నిధిని రాజధానిని విడిచి పోయి పల్లెటూళ్లలోఁ బామరులఁ గలసి రాజశాసనముల నుల్లంఘించి యధికారులచే దండింపఁబడి తనరాజ కుమారత్వమును, దండ్రియందుభక్తియులేక యతనిశాసనముల నుల్లంఘించుటచేఁదనకుఁబ్రాప్తించిన దుర్దశను నాలోచించి రాజభక్తి కలవాఁడై మరల రాజసన్నిధికిఁ బోవుటకై రాజధానిలోఁ బ్రవేశించును. ఇట్లు నిత్యవిభూతి మండలమునఁ బ్రవేశించును. ఇట్లు నిత్యవిభూతి మండలమునఁ బ్రవేశించుటకే సాలోక్యమనిపేరు. రాజధానిలోఁ బ్రవేశించినవాఁడు రాజసన్నిధికిఁ బోవుటకు రాజోచితవేషమువేసికొనుట వంటిది సారూప్యముక్తి.

రా జుండుసభలోకిఁ బోవుట సామీప్యముక్తి. తన పుత్రుఁడు మరల భక్తిపరుఁడై తన్నుఁ జేరవచ్చెఁ గదాయని రాజు కుమారునిఁ జేరఁదీసి సింహాసనమునఁ దనతొడపైఁ గూర్చుండఁబెట్టుకొని తనతో సమునిఁగ నాదరించును గదా. అట్లుభగవంతునిచేఁ, నాయనతో సమముగ నాదరింపఁబడుట సాయుజ్యము. ఈదశయందుఁ గుమారునకుఁ గలుగు నానందము బ్రహ్మానందము. ఈయానందము దుఃఖమిశ్రము గాక, క్షణభంగురముకాక శాశ్వతమై నిర్వికల్పమై భీరహితమై నిత్యమై పూర్ణమై యుండును. భగవత్సౌందర్యావలోకన, తన్మధురాలాపాకర్ణన, తత్కృపాదరణ సౌశీల్యాద్యనుభవ జనితమై కొఱఁత యెఱుంగనిదై యుండును. భక్తులు గోరుముక్తి యిట్టిదై యుండును. స్వరూపనాశము. స్వభావనాశము. ఆనందానుభవనాశము కలిగించుదశను భక్తులు సాయుజ్య మనరు. వేదాంతగ్రంథములఁజెప్పఁబడిన దిట్టిసాయుజ్యమే.

**“అనేకసామ్యం యాస్యామి” “మమ సాధర్మ్య మాగతాః”**
**తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరంజనః పరమం సామ్య ముపైతి**

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా" ఇత్యాదులం దుపనిషత్తులు పరమసమత్వమునే బోధించుచున్నవి.

రామసుగ్రీవులకును, సీతారాములకును, రామభరతులకు నెట్టియైక్యమో యట్టియైక్యమే పరమందు జీవాత్మపరమాత్మల కని యెఱుంగవలయును. "రామసుగ్రీవయోరైక్యం. దేవ్యేవంసమజాయత" దేవీ! రామసుగ్రీవుల కైక్య మీవిధముగ సంభవించె నని కదా హనుమంతుఁడు చెప్పెను.

**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి.**

సాంఖ్యము యోగము రెండు నొకటేయని యెవ్వఁడెఱుఁ గునో

వాఁడేనిజము తెలిసినవాఁడు.

ఈయర్థము వాదుకయందున గాననగు. ఎట్లన. వాదిప్రతివాదు లేకమైనచో సాక్షులతోడ నేమిపని? నూవులు నూనె యొకటి గాండ్లవాఁడు వేఱు. వ్యవహారమం దిట్టివి యెన్నియో గలవు స+యుక్=భావము సాయుజ్యము ఒక కాఁడికి రెండెద్దులను గట్టుట వంటిది. లక్ష్యముతో నన్వయించు నీయర్థమే లక్షణమునకు సరియైన యర్థము. అటైనచో

**శ్లో॥ ప్రణవో ధను శ్శరో హ్యాత్మా, బ్రహ్మ తల్లక్ష్య ముచ్యతే,**
**అప్రమత్తేన వేద్ధవ్యం, శరవ త్తన్మయో భవేత్.**

**శ్లో॥ యథా నద్యః స్యందమానాః సముద్రేఽ**
**ఽస్తం గచ్ఛంతి నామరూపే విహాయ**
**తథా విద్వాన్ నామరూపా ద్విముక్తః**
**పరాత్పరం పురుష ముపైతి దివ్యమ్ ॥**

**శ్లో॥ యథోదకం శుద్ధే శుద్ధ మాసిక్తం**
**తాదృ గేవ భవతి, ఏవం మునే ర్విజ్ఞానత ఆత్మా భవతి గౌతమ.**

ఇట్టివాక్యములు జీవాత్మపరమాత్మలోఁ గలసి పోవుట చెప్పవా యందురేమో.

ప్రణవము ధనువు. ఆత్మ బాణము. బ్రహ్మ లక్ష్యము. బాణమువలెఁ హెచ్చరికతో వేధించువాఁడు దన్మయుఁ డగు చున్నాఁడు. అనుచోట నుపమాన స్వారస్యముచూడుఁడు. విలుకాఁడు బాణముచే గుఱిని గొట్టఁగా బాణము దాని యందుఁ గ్రుచ్చుకొని యుండును గాని గుఱియైనపదార్థము బాణము నొకదానితోనొకటి కలసియేకరూపమైపోవునా? తుపాకిగుండుతోఁ బులినిగొట్టినపుడు గుండు పులిలోఁదూఱును గదా యందురేమో. ఆమాత్రమున గుండు పులియగునా. పులి గుండగునా? గుండుస్వభావము చెడునా? దానికిస్వరూప నాశముగలదా? ఇఁక రెండవదానిలో నదులు సముద్రములోఁ జొచ్చి నపు డెట్లు రూపనామములు లేనివగునో యట్టులే విద్వాంసుఁడు నామరూపములు విడిచి పరాత్పరుఁ డైనపురుషుని బొందును అనికలదు.

గంగానది సముద్రములోఁ బ్రవేశింపఁగానే దాని తెల్లనివర్ణము గంగయనుపేరు రెండుపోవుట సత్యము. అంతియ కాని గంగనీటికి నాశములేదు. అట్టులే భక్తుఁడుముక్తుఁ డయినపుడువాని కిందున్న యెల్లయ్యమల్లయ్యయను పేరును, రూపమునుబోవును అంతియేకాని యితరమేమియు లేదు. ఇఁక మంచి నీళ్లలో గలసినమంచినీళ్లు దానివంటివే యగును అట్టులే జ్ఞానియునుఁ బ్రహ్మమువంటివాఁ డగునని యధ్యాహార్యము దానివంటివి యని శ్రుతిచెప్పుచున్నది గాని యదియే యగునని చెప్పలేదు. అట్టియర్థమే సాధు వనియెడివారు కలరు కదా యందురేని యందురుగాక. ఒకదరిద్రుఁడు లక్షాధికారియై యైశ్వర్యవంతుఁడై భోగపరుఁడగునేని వానిని లోకులు "వానికేమి, వాఁడు మహారాజైనాఁడు'' అందురు. అనఁగా భోగైశ్వర్య ముల మహారాజుతోసమానుఁ డని యర్థమును గ్రహింపవలయునా?

లేకసింహాసనమునందుండి మహారాజుపెండ్లమునకు మగఁడయినాఁడని గ్రహింపవలయునా? ఉచితమేది? సత్యమేది?

**సూ. భోగమాత్రసామ్యలింగాచ్చ. బ్రసూ. 4-6-21**

ముక్తునకు నీశ్వరునితో భోగమాత్రమున సామ్యము

**"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా."**

ఆముక్తపురుషుఁడు సర్వజ్ఞుఁ డగుబ్రహ్మముతోఁగూడ సర్వభోగము లనుభవించుచున్నాఁడు అనుబ్రహ్మసూత్రములు జీవనకు స్వరూపనాశము చెప్పలేదు.

మహావాక్యరత్నావళి యనుగ్రంథమునందు దీప మెండ లోకిఁ బోయినట్టు జీవాత్ముఁడు పరమాత్మలోఁ బ్రవేశించునని చెప్పఁబడినది. ఇదిసత్యము. ఈయుపమానమువలనను దీపమునకు స్వరూపనాశములేదు. పగటిపూఁట చంద్రనక్షత్రములు గోచరింపనిమాత్రమున నవి రూపుమాసిపోయె ననవచ్చునా? ముక్తునకు లక్ష్మీపతిత్వము జగత్సృష్టిస్థితిసంహారకార్యములు లేవు.

తల్లులారా? తండ్రులారా? శ్రుతులు పరస్పరవిరుద్ధముల బోధింపవు. అట్లు బోధించెనేని యందొకటి యసత్యము కావలయును. వేదము లసత్యమాడునని మీరు తలంతురా? అటుగాదేని దశాభేదమునుబట్టి యర్థభేదమును గ్రహింపవలయును. ఇట్లుచేయుటయందు నాకేయాక్షేపము లేదు. ఎట్లందు రేని ఛాందోగ్యమందు

**"ఖలు క్రతుమయోఽయం పురుషః యథా క్రతు రస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి. స క్రతుం కుర్వీత"**

క్రతు వనఁగా సంకల్పము, కోరిక, నమ్మిక. పురుషుఁడు క్రతుమయుఁడు కావున నెవని కోరిక నమ్మక మెట్టులున్నదో యట్టిదే వానికి మరణించిన తరువాతఁ బ్రాప్తించును అనికలదు.

**విశుద్ధసత్త్వః కామయతే యాం శ్చ కామాన్ తం తం లోకం జయతే తాం శ్చ కామాన్.** సత్త్వము వలననిర్మలమైన మనస్సుగలవాఁడేయే కోరికలుకోరునో వాఁడాయాలోకముల జయించి యాయాకోరికలఁ బడయును.

**"యే యథా మాం ప్రపద్యంతే, తాం స్తథైవ భజా మ్యహమ్"** భగవ.
**యాదృశీ భావనా యత్ర, సిద్ధి ర్భవతి తాదృశీ ॥**

ఇత్యాదిప్రమాణములవలన మనమేగతిని గోరుదుమో భగవంతుఁడు మన కాగతినే యిచ్చును. కావునఁ దామానందమే యయిపోవలయు నని కోరువారి కట్టిదశ యే ప్రాప్తించును. ఇట్టిదశ నాకు వలదు. నేను గలకండనైతి నేని కలకండతీపునే ననుభవించుటెట్లు? కావున నాకు బ్రహ్మానంద మనుభవించుదశ రావలయునని భక్తుఁడు కోరిన వాని కట్టిస్థితియే వచ్చును. వారివారిసంకల్పముకొలఁది వారివారికి ఫలము కలుగును కావునఁ బరస్పరకలహ మక్కఱలేదు. ఇట్లగుటచే ద్వైతులు విశిష్టాద్వైతు లయి విశిష్టాద్వైతుల ద్వైతులయి ముక్తిగాంతు రనియు, నివిమూఁడు నిచ్చెన మెట్లనియు నం దుత్తమ మద్వైతమోక్షమని చెప్పెడి వాక్కులు నిరాకరములు, అయుక్తికములు, అవిశ్వసనీయములు కావున నిరాదరణీయములు. కావున భ్రాంతచిత్తులరు గాక మీకిష్టమైనదశ మీరు సంకల్పించి విశ్వాసము కలవారైతిరేని మీకట్టిదశయే తప్పక కలుగును. మనము పాపాత్ములము మరణానంతరము శాశ్వతముగ నరకబాధ యనుభవింతుమనియు శాశ్వతముగ నగ్నికుండములోఁ గాల్పఁబడుచుందుమనియుఁ దలఁచుచుందు మేని యట్టికష్టమే ప్రాప్తించును. కొందఱవలె శూన్యమై పోదుమనియు, పాషాణములవలె నగుదు మనియుఁ దలంతు మేని యట్టి యతిఘోరదుర్దశయే ప్రాప్తించును. మనము బిడ్డలము భగవంతుఁడు తండ్రి. బిడ్డల దోషములను క్షమించి

తల్లిదండ్రులు బిడ్డలకు సుఖమును గలిగించునట్లు మనపాపములను బోఁగొట్టి నిత్యసుఖానుభవమును భగవంతుఁడు కలిగించుననినమ్మి సేవించితి మేని యట్టి శాశ్వతసుఖానుభవమే కలుగును. నాకుమోక్షముతోఁ బనిలేదు భగవన్నామ కీర్తనము గావించుచు భగవత్సేవ చేయుచు లోకోపకారకముగఁ బ్రవర్తింపఁ దలఁచితినేని యట్టులేయగు. ఇందు మీకెది యిష్టమో దానిని దృఢముగ సంకల్పింపుఁడు. మీసంకల్పమును భగవంతుఁడు తప్పక కొనసాగించును.

లంకనుండి సీతను శ్రీరాముఁడు పుష్పకమున నెక్కించు కొని యయోధ్యకుఁ గొనిపోయెఁ గదా, దీనివలన గ్రహింప వలసినదానిని వినుఁడు.

భక్తిమార్గమునఁ గాని యితరమార్గమునఁ గాని ముక్తిని సాధించినవా రర్చిరాదిమార్గంబునఁ బరమపదము ప్రాప్తింతురు.

**శ్లో॥ నారాయణం విశ్వరూప, మజ మిచ్ఛాత్తవిగ్రహమ్**
**శ్రీమన్నారాయణస్వామి, న్ననన్యశరణ స్తవ**
**చరణౌ శరణం యాత, ఇతి మాం య స్స్మరేత్ సకృత్**
**తత స్త మితరోపాయ, వ్యవధానవివర్జితమ్**
**తదవస్థం మృతిప్రాప్తౌ, కాష్ఠపాషాణసన్నిభమ్**
**కాష్ఠవ త్తు స్వతో దేహే, మనశ్చేష్టావివర్జితమ్**

* * * * *

**సోఽహ మాశ్రితతంత్రాత్మా, స్మరామి చ తదా స్వయమ్**
**ఇమం మద్భోగయోగ్యం తు, కృపాపూరప్రకాశనాత్**
**నయామి పరమం స్థాన, మర్చిరాదిగతిం వినాం**
**గరుడస్కంధ మారోప్య, యథేష్ట మనివారితః ॥**

**వరాహపురాణము**

నారాయణుఁడును, విశ్వరూపుఁడును, జననములేని వాఁడును ఇష్టము వచ్చిన యాకారమెత్తగలవాఁడును నగు నన్నుఁ గూర్చి లక్ష్మీవిశిష్టుఁడవైన నారాయణమూర్తీ స్వామీ, వేఱురక్షకుఁడు లేని నేను నీపాదయుగమునే శరణు చొచ్చితిని అని యొకసారి యెవఁడు స్మరించునో యట్టి యితర మోక్షోపాయము నడ్డముగాలేనియతఁడు మరణకాలమందు ఱాతివలెఁ గొయ్యవలె దేహస్మృతి మనోవ్యాపారము విడిచి యుండునపు డాశ్రితులకు బరాధీనమైన మనస్సుగల నేను వీఁడు నన్ననుభవింపయోగ్యుఁడని నాదయను బ్రకాశింపఁ జేయుటకై నాకృపాతిశయ మిట్టిదని ప్రకాశింపఁ జేయుటకై నేనే యతనిని స్మరించి గరుడుని మూఁపుపై నతని నుంచుకొని యర్చిరాది గతినిబోక చక్కఁగా నేయడ్డములేక నాపరమపదమునకుఁ దీసుకొనిపోఁగలవాఁడను అని భగవంతుఁడు వరాహమూర్తి సెలవిచ్చెను.

ఇచ్చట సీతను శ్రీరాములు తనతోడఁ బుష్పకంబున నునిచికొని యయోధ్యకుఁ గొనిపోయెను. "దేవానాంపూ రయోధ్యా" యన్నట్లు వైకుంఠమునకు నయోధ్య యనియుఁ బేరుగలదు. ఇట్టులే ప్రపన్నులు నర్చిరాదిమార్గమునఁ బోక చక్కగా వైకుంఠమునకుఁ బోదురు. తక్కినసాధకులగతికిఁ బ్రపన్నులగతికి నిది భేదము.

భక్తి లేమియే జననమరణదుఃఖములకుఁ గారణమనియు, భక్తియే మోక్షసాధనమనియుఁ బురుషకార మావశ్యకమనియు నావిషయమున సీతాదేవి యుత్తమోత్తమురాలనియు సీతాదేవిచర్యవలనఁ దెలిసికొంటిమి. ఆమెచర్యవలన నేర్చుకొనవలసిన విషయములు మఱియుఁ గొన్ని కలవు.

సీత పతిదేవత అనఁగా దేవుఁడే మగఁడనియు మగఁడే దేవుఁడనియు భక్తిగలది. స్త్రీలు దేవునిఁ బూజించునపుడు దేవుఁ డాయనయే యని పూజింపవలయును. దేవుని మించిన భర్త, భర్తను మించిన దేవుఁడు స్త్రీలకు లేఁడు.

సీత సహధర్మచరి. భర్త యేధర్మకార్యములు చేయఁ దలపెట్టునో యట్టిధర్మకార్యములందుఁ దానును బతికి సహాయురాలుగా నుండెను. పతి యడవుల శ్రమింపఁ దానింట నుండి సుఖము లనుభవింపరాదని తాను నడవుల కేగెను.

పతి శరణాగతరక్షణవ్రతముగలవాఁడు కావునఁ దాను బురుషకార భూతయై నిలిచి కాకాసురాదుల రక్షింపఁజేసెను.

పతి రావణాదిరాక్షసుల వధించి ధర్మరక్షచేయఁ దలఁపు గలవాఁడగుట యెఱిఁగి దానికి నెపముగల్పించి చెఱయందున్న స్త్రీలవిడిపింపఁ బతికి సహాయపడ రావణాసురునింటఁ జేరి వానివంశమునే నిర్మూలింపించెను.

భర్తవలెఁ దానును బగవారియందును దయగలదై యుండెను. నిష్కారణముగఁ గలిగిననిందనుండి భర్తను దన్ను విడివడఁ జేయఁ దుదకుఁ దేహమునే విసర్జించెను, కావున భార్య లిట్టివారై యుండవలయును. నిరపరాధి యగు లక్ష్మణుని దేరకు నిందలాడి పడరాని పాటులు పడెనను విషయమునఁ గొంతచెప్పవలసియున్నది. స్త్రీలచిత్తమున కంటెఁ గోమలమైనదియు నంతకంటెఁ గఠినమైనదియు లోకమున లేదు.

**గీ. ఉపలములకంటెఁ గఠినంబు లొక్క వేళఁ**
**గుసుమములకంటె నొకవేళఁ గోమలములు.**

**శ్లో॥ వాక్య మప్రతిరూపం తు, న చిత్రం స్త్రీషు మైథిలి!**
**స్వభావ స్త్వేష నారీణా, మేవం లోకేషు దృశ్యతే ॥**
**విముక్తధర్మా శ్చపలా, స్తీక్ష్ణభేదకరా స్త్రియః ॥ శ్రీమద్రా. ఆరణ్య**

ఈవాక్యము లెంతయు సత్యములు. ఇట్టినడవడి ప్రాకృతస్త్రీలకుఁ జెప్పినఁ జెప్పవచ్చును గాని లోకమాతయగు సీతయెడఁ జెప్పుట దోషమని భయపడెదను. మాయామనుజ రూపముల నటించినవా రగుటచే

మనుష్యస్వభావముదెలుప సీతారాములిట్లు ప్రవర్తించిరిగాని యథార్థ మదిగాదు.

లోకధర్మరక్షణార్థమై రావణవధఁ గాంక్షించి సీతారాము లేకోద్దేశముతో నవతరించిరి. సీతానిమిత్తముగ రావణుని రాముఁడు వధింపవలసినట్టు సమయము. కాలచోదితుఁడై రావణుఁడు సీతను హరింప నమకట్టెను. ఇది సీతారాముల సంకల్పమునకు ననుకూలమైనది. పతివ్రతలశీలరక్షణము చేయ రావణవధయందుఁ గంకణముకట్టుకొన్న సీతయే యీకార్యమునఁ బ్రముఖురాలై నిలిచి రావణసంకల్పమున కంతరము గల్పింప రాముని దూరముగఁ బంపెను; లక్ష్మణుఁడు తనతోడ నుండువఱకు రావణుఁడు తన్ను హరింప సాధ్యపడదు. కావున నెట్టులైన లక్ష్మణుని దూరమఁ బంపవలసియుండెను, మంచి మాటలతోఁ మీయన్నకుఁ దోడుగఁ బొమ్మన్న నన్నయానతి మీఱి లక్ష్మణుఁడు పోవువాఁడు కాఁడు. పోకున్న సమయ భంగము. కావున సీత దిట్టి లక్ష్మణుని నెడఁబాసెను. ఇది వాస్తవార్థము గాదేని

**ఉ. హారివిహారశాలలు సమంచితనిస్తులభోగభాగ్యముల్**
**వారిజలోచనామణులవర్గముఁ బాయుచుఁ, దల్లిదండ్రులన్**
**గౌరవమారఁ బల్కి, యధికం బగువారిప్రసాద మంది, కాం**
**తారనివాసి యయ్యె గుణధన్యుఁడు లక్ష్మణుఁ డన్నఁ గావఁగాన్.**

**చం. నిరుపమ విక్రమాఢ్యుఁడు వినీతుఁడు సత్ప్రియదర్శనుండు ని**
**ర్భరసుఖ మెల్ల వీడి తనభ్రాతకుఁగా గహనంబులోన ని**
**ష్ఠురదశ సానుకూలమతిఁ జొచ్చి నిజాగ్రజుఁ గొల్చు చుండు న**
**న్నరయును దల్లిఁగాఁగ దనయన్నను దండ్రిని గాఁగఁ జూచెడిన్.**

**ఆ. మంచిమనసువాఁడు మంచిచూడ్కులవాఁడు,**
**సింగ మెనయు మూపుచెలువువాఁడు**

**మామగారితో సమానుండు తెలియండు,**
**పాపి యసుర నన్నుఁ బట్టితేర.**

**సీ. వృద్ధోపసేవి సుశ్రీకుండు మితభాషి, మామామగారి గారాముసుతుఁడు**
**నాముద్దుమఱఁది యాసౌమిత్రి మేమేమి, చెప్పిన నన్నియుఁ జేయుచుండు**
**నెవ్వనిఁ గనుఁగొని యెలమి శ్రీరాముండు, తనతండ్రి మదిలోనఁ దలఁపకుండు**
**దాక్షిణ్యశీలుండు దయగలవాఁడు, నిర్మలమతి మెత్తనిమనసువాఁడు**
**ననఘుఁడౌ రామచంద్రుని యనుఁగుభ్రాత ॥**

యని లక్ష్మణునివిషయమై యిట్టియభిప్రాయముగల సీత నిష్కారణముగ నటువంటి రోఁతమాట లాడియుండునా?

ఇఁకనొక్కవిషయము ప్రస్తావించి విరమించెదను.

హనుమంతుఁడు సీతాదేవితో సంభాషించినపదపడి యశోకవనము నేలపాలుచేసెను. అప్పుడురాక్షసస్త్రీలు సీతాదేవినిగని నీతోనింత సేపు మాటలాడుచుండినవాఁ డెవ్వఁ డని యడిగిరి. వాఁడెవ్వఁడో నేనెఱుఁగను. మీరాక్షసమాయలు మీకే తెలియవలయునని సీతబొంకెను. అంతటి మహాత్మురాలు పుణ్యశీల సాధ్వి యి ట్లసత్యమాడవచ్చునా యని సందేహము కలుగకపోదు కావున సత్యమెట్టిది యసత్యమెట్టిదని పరిశీలింతము.

అన్నిధర్మములకుఁ దల్లి యహింస. దానిజ్యేష్ఠపుత్రిక సత్యము. కావున హింసాకారణముకాకుండ జెప్పుటసత్యము. సత్యవ్రతనిష్ఠులు మనము చెప్పునది భూతహితమా భూతభయ కారణమా యని యాలోచింతురుకాని మనము కలదికలట్టు చెప్పుచున్నామా లేదా యని చూడరు. తాము చెప్పెడిమాట వలన నితరులకు నిష్కారణబాధ

కలుగునట్లుండిన నెట్లుచెప్పిన నట్టిబాధ కలుగకయుండునో, మేలే కలుగునో యట్టిమాటనే చెప్పుదురు. అది సత్యమైనను మేలే. అసత్యమైనను మేలే. అట్లని దోషముచేసినవారిని నసత్యమాడియైన రక్షింపరాదు. నిర్దోషులవిషయమందే యావిచారము. న్యాయముగఁ దనకుఁ గాని యితరులకుఁగాని లభింపవలసినది యన్యాయముగ పోనున్న సమయంబునను బొంకిన దోషములేదు. ఈధర్మ విధము మనస్సున నుంచికొని సీతాదేవి యిట్టులాలోచించెను.

నాప్రాణము రామలక్ష్మణసుగ్రీవాదుల ప్రాణములు హనుమంతుని వశమున నున్నవి. ఈయనయా ప్రాణగొడ్డమైన సాహసమునకుఁ దెగించెను. ఈతని బలాబలములు నే నెఱుఁగను. శీలము నేనెఱుఁగను; తానెవ్వఁడొ యేల వచ్చెనో నలువురకుఁ దెలియఁజెప్పునో చెప్పఁడో. ఆయా యాలోచన నాకుఁ దెలియదు. ముందుగాఁ దానిట్టికార్యము చేసెదనని చెప్పినవాఁడును గాఁడు. ఇతఁడు రామదూతయని చెప్పితినా రాక్షసు లందఱు నేకమై యీతని నెట్లులైనఁ జంప నెంతప్రయత్నమైనఁ జేయుదురు. రామదూత యని తెలియక పోయెనా యేదో క్రోఁతిమాత్ర మని యుపేక్షింతురు. నేను సత్యము చెప్పి యుపకారి కపకారము చేయుట కంటె నాకుఁ దెలియ దని చెప్పుట ధర్మయుక్తము స్వక్షేమము. కార్యభార మాలోచించి యాయన కేది యుక్తమనితోఁచునో యట్లు చేయనిమ్ము. కార్యము చెడుటకు నే నేలకారణభూతను గావలయు నని సీతాదేవి యాలోచించి యట్లుచెప్పెను. ఇట్టిధర్మసంకటసమయంబుల ధర్మసూక్ష్మత్వ మాలోచించి మనము నిట్లు చేయవచ్చును. సీతాదేవిచరిత్ర మని వేఱుగ నామె జన్మకర్మాదుల గుఱించి వ్రాసియున్నాఁడను. దానిని జదివితిరేని యీలోకమాత విషయ మంతయు స్పష్టపడగలదు. శ్రీరామచంద్రుఁడు స్మరణమాత్రసంతుష్టుఁడు. సీతాదేవి నమస్కారప్రియ. కావున

నంజలిమోడ్చి సీతారాముల నుద్దేశించి సీతారామ సీతారామ యనియో శ్రీరామ శ్రీరామ యనియో యనుచుండినను నీయర్థము పూర్ణముగు గలశ్రీరామద్వయమంత్రము నుచ్చరించుచుండినను మనకు వారి పూర్ణానుగ్రహముచే సమస్తబాధలు తొలఁగి శాశ్వతసుఖము కలిగి సుఖింపఁగలము. అట్టికోరికగల వారట్లు చేయుదురని నమస్కార పూర్వకముగ మేడుచున్నాను.

రాముని విడిచి సీతను గాని సీతను విడిచి రామునిఁ గాని సేవింపవలదని చెప్పితిని. దానికారణమువినుఁడు

**శ్లో॥ లక్ష్మ్యా సహ హృషీకేశో, దేవ్యా కారుణ్యరూపయా**
**రక్షక స్సర్వసిద్ధాంతే, వేదాంతేషు చ గీయతే ॥**

దేవియు గారుణ్యరూపయు నగు లక్ష్మితోఁ గూడి జీవకోటికి నారాయణుఁడు రక్షకుఁ డగుచున్నాఁడు. ఇది సర్వసిద్ధాంతములందును వేదాంతములందును జెప్పు బడినదని యర్థము. ఇట్లగుటచే లక్ష్మీదేవి మూర్తీభవించిన భగవద్దయ యని యేర్పడెను. ఈయర్థమును జెప్పు వాక్యములు మఱియు బెక్కులుగలవు. దయకు స్థానము హృదయ మగుటచేతనే లక్ష్మీదేవినారాయణువక్షస్థలంబున నున్నదందురు. భాస్కరేణప్రభా యథాయని సీతాదేవి సూర్యుని సూర్యకాంతినెట్లెడఁ బాయుజేయసాధ్యముగా కుండునో యట్లే తన్ను రాముని నెడఁబాయు జేయసాధ్యముగాదని చెప్పెను. దయ యనుగుణ మాధేయము. దయగలవాఁడు గుణి యాధారము. గుణిని విడిచి గుణ మెన్నఁడు నుండఁజాలదు. ఆశ్రయములేక యేగుణము నిలువదు తెల్లనిపదార్థమును విడిచి తెలుపు నూహింపసాధ్యమా? పదార్థమనునది యొకటి యుండెనేని యది యేదేని యొక గుణము లేనిదై యుండుట నూహింప సాధ్యమా? కావున గుణమును విడిచి వస్తువుండదు. వస్తువును విడిచి గుణముండదు.

కావుననే భగవంతుఁడు నిర్గుణుఁ డన్నప్పుడు ప్రకృతిసంబంధ హేయగుణములు సత్త్వరజస్తమస్సులు లేనివాఁడని పెద్దలు చెప్పిరి. అట్లు గాదేని జ్ఞానబలక్రియాదిశక్తిగుణములు గలవాఁడని చెప్పు నుపనిషద్వాక్యములు భగవచ్ఛబ్దము వ్యర్థము లగుచున్నది. కావున భగవంతుఁడు దయగలవాడనియే మనముగ్రహింపవలయును. ఆదయాగుణమే లక్ష్మి. ఆమెయే సీత. దయలేనివానిని గొలిచిన రాఁగఫల మేమి? దయలేనికఠినచిత్తుఁడు మనకేమి మేలుచేయుగలుడు? కావున సీతను విడిచి రాముని లక్ష్మిని విడిచి నారాయణుని సేవింపరాదు. ఈయన సీతారాములచర్యవలననే యేర్పడుచున్నది.

సీత తనతోడ నుండువఱకు రాముడు మారణకార్యమునకుఁ బూనినవాఁడు కాఁడు. ఖరదూషణాదులు జంపవలసివచ్చినపుడు సీతను దూరముగు బంపెను అనిననేమి యర్థము. దయాదూరుఁడయ్యె ననియే కదా. దయాగుణముచే రావణవధవఱకు రామునకు సీతలేదు. దయలేదు. రాముడు చేసిన వన్నియు హింసాకార్యములే. రావణవధానంతరము సీత వచ్చెను. వధకార్యము నిలిచెను. మరల సీతనువాల్మీకాశ్రమమునకుఁ బంపెను. శంబూక, లవణగంధర్వాదులవధకుఁ గారణభూతుఁ డయ్యెను కావున మనము సీతావిశిష్టుఁడైన రాములనే కొలువవలయును.

సీతాదేవి పతిదేవత యని చెప్పుబడెను. పతిదేవత యనఁగా నీకాలమునందువలెఁ బతికి దేవత యని యర్థము కాదు. పతియేతనదైవమని వేఱుదైవము లేదని దైవమే తనపతి యని యెంచునది పతిదేవతయనియర్థము. అక్కలారా! యిట్టి వారు మీలో నెందఱున్నారో లేచి నిలఁబడెదరా. అట్టివారికి నమస్కరింపఁ దలుపుగలదు. క్షమింతురుగాక. మీరందఱు నట్టివారేయనియు లేచి నిలుచుండుట యహంకారసూచక మను తలంపుతో సాధ్వీవృత్తము ననుసరించి నిలువలేదనియు నమ్మెద.

**అల మేషా పరిత్రాతుం రాఘవా ద్రాక్షసీగణమ్ ॥**

శ్రీరాములవలననుండి రాక్షసీగణములను జక్కఁగ రక్షించుటకు సీతాదేవియే చాలును. ఆమెయే సమర్థురాలు అను త్రిజటావాక్యమును మీకుఁజరమవాక్యముగ మహామంత్రముగా నుపదేశించుచున్నాను. దీనిని నిండుమనస్సుతో గ్రహించి విశ్వసించి యాప్రకారము వర్తించి యుభయలోకముల నఖండావిచ్ఛిన్నశాశ్వతానందము ననుభవింతురుగాక. భక్తిశ్రద్ధలు భగవంతుడు మీ కనుగ్రహించును గాక.

సీతాదేవీపట్టాభిషేకోత్తర చర్యవలన భక్తులు గ్రహింపవలసిన విషయము వివరించెదను. శ్రీసీతారాములుఁ బట్టాభిషేకమైనతరువాత 2–3 సంవత్సరములలో సీతాదేవి గర్భము ధరించెను. నిండుచూలాలిని, నిఁక 10–14 దినములలోఁ బ్రసవింపనుండుదానిని, దనతోడ 14 సంవత్సరములు తన కంటె నెక్కువశ్రమపడినదానిని, నిర్దోషురాలిని, నిర్దోషురాలని తాను నమ్మినదానిని లోకులనెడునిందలకై యామె కేవిషయము చెప్పక రాముడు వంచించి సీత నడవులపాలు చేసెను. నిష్కారణముగ శ్రీరాముల నడఁవులపాలు చేసిన దశరథునకు భార్య నడవులపాలుచేసిన శ్రీరాములకుఁ గలతారతమ్యము పుణ్యపాపవిచారము చేయ నిది సమయముగాదు. సీతాదేవిచరిత్రమే గ్రాహ్యము. పతివ్రత యగుస్త్రీ పతిదేవతగావున భర్తచేసినకార్యము న్యాయ్యమా యన్యాయమా యని విచారింపవలసినపనిలేదు. ఆపుణ్యపాపము లతనివే. పతియాజ్ఞకు లోఁబడియుండుటే సతికి ధర్మము. పతిచేసిన కార్య మన్యాయ్యమని తోఁచినను నతని నిందింపరాదు. అతని కపకీర్తివచ్చుకార్యము చేయరాదు. అట్టులే భక్తుఁడును సతి పతిదేవతయగునేని భక్తునకు దేవుఁడే పతి. భక్తుల కనేకకష్టములు భగవంతుఁడు కల్పించి భగవత్సేవకును విఘ్నములు కలిగించుచుండును, దానికిఁ గారణము సర్వజ్ఞుడైన

భగవంతునకుఁ దెలియునేకాక యల్పజ్ఞులమైన మనకుఁ దెలియదు. కావునఁ గష్టములు ప్రాప్తించినపుడు భగవంతుని నిందింపరాదు. తన్నుఁ బరీక్షించి తనకు మేలుగూర్ప భగవంతుఁ డట్లుచేయు చున్నాఁ డనియు భగవంతుఁ డేదిచేసినను మనమేలునకే కాని కీడుకుఁ గాదు అని నమ్మవలయును. శ్రీసీతారాములు తమభక్తులయిన మిమ్మను గ్రహింతురు గాక. లోకంబున భక్తివర్ధిల్లును గాక.

* * *